ఈనాడు
అమరావతి
ఎన్టీఆర్
మంగళవారం అక్టోబరు 22, 2024

అమరులారా వందనం..!


గౌరవ వందనం స్వీకరిస్తున్న సీఎం చంద్రబాబు, హోం మంత్రి అనిత, వేదికపై సీఎస్ నీరబ్‌కుమార్‌ప్రసాద్, డీజీపీ ద్వారకాతిరుమలరావు, శాంతి భద్రతల విభాగం ఐజీ శ్రీకాంత్


అమరవీరులకు నివాళులర్పిస్తున్న సాయుధ పోలీసులు


అమరవీరులకు పుష్పాంజలి ఘటిస్తూ..


విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే: పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ముఖ్యఅతిథిగా విచ్చేశారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసు సిబ్బంది నివాళులర్పించారు. వారి సేవలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో హోంమంత్రి వంగలపూడి అనిత, డీజీపీ ద్వారకాతిరుమలరావు, ఐజీ (లా అండ్ ఆర్డర్) శ్రీకాంత్, ఇతర ఐపీఎస్ అధికారులు, పోలీసు కుటుంబాలు, సిబ్బంది పాల్గొన్నారు.


పోలీసు సేవల ఛాయాచిత్ర ప్రదర్శన తిలకిస్తున్న సీఎం

ప్రకాశం బ్యారేజీకి వరద

కృష్ణలంక, న్యూస్‌టుడే: ప్రకాశం బ్యారేజీకి సోమవారం సాయంత్రానికి ఎగువ నుంచి 2,20,500 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరినట్లు అధికారులు తెలిపారు. కృష్ణా తూర్పు ప్రధాన కాలువకు 5,309 క్యూసెక్కులు, పశ్చిమ ప్రధాన కాలువకు 2,519 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం బ్యారేజీ వద్ద నీటిమట్టం 12 అడుగులకు చేరగా.. 70 గేట్లను 5 అడుగుల మేర ఎత్తి 2,28,328 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.


పున్నమిఘాట్ వద్ద రిహార్సల్స్




బబ్బూరి మైదానంలో డ్రోన్ షో పోస్టర్లు

ప్రధాన వేదిక


సీకే కన్వెన్షన్‌లో ముస్తాబైన వేదిక

రారండ్రో.. వేడుక పిలిచెన్


డ్రోన్లతో గౌతమ బుద్ధుడు, విమానం ఆకృతులు

నేటి నుంచి డ్రోన్ సమ్మిట్-2024

భవానీపురం, న్యూస్‌టుడే: అమరావతి రాజధానికి బ్రాండ్ ఇమేజ్ తీసుకువచ్చే దిశగా ప్రభుత్వం వినూత్న కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా కృష్ణా నదీతీరం వెంబడి పున్నమి, భవానీ ఘాట్‌ల వేదికగా డ్రోన్‌షో నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. గతంలో ఎన్నడూ జరగని రీతిలో డ్రోన్‌షో నిర్వహించనున్నారు. కృష్ణానదిపై ఆకాశంలో ఒక్కసారిగా 5,500 డ్రోన్లు కనువిందు చేయనున్నాయి. డ్రోన్లతో ఆకాశంలో వివిధ రకాల బొమ్మలు, ఆకృతులు, పేర్లతో షో జరుగుతుంది. ఇప్పటికే నిర్వాహకులు ట్రయల్ రన్‌ను పూర్తి చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు కనువిందు చేయనున్నాయి. మంగళవారం సాయంత్రం 6 గంటల నుంచి కార్యక్రమాలు ప్రారంభమవుతాయి.


ఘనంగా ఏర్పాట్లు.. నదీ తీరం వెంబడి డ్రోన్‌షోకు పటిష్ఠ ఏర్పాట్లు చేశారు. కార్యక్రమాన్ని తిలకించేందుకు రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాలకు చెందిన వారు హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో నదీతీరాన్ని పరిశుభ్రంగా ఉంచారు. ఘాట్‌కు వెళ్లే మార్గంలో పచ్చని మొక్కలు ఉంచారు. వీఐపీలు, అతిథులు, సాధారణ ప్రజలకు గ్యాలరీలు సిద్ధం చేశారు. సందర్శకులు కూర్చుని కార్యక్రమాన్ని తిలకించేలా గ్యాలరీల్లో కుర్చీలు వేశారు. ఘాట్ పొడవునా భారీ ఎత్తున ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. విద్యుత్తు దీపాల వెలుగు జిలుగులతో నదీతీరం కోలాహలంగా మారింది. డ్రోన్‌షోతో పాటు లేజర్ లైట్ షో, మ్యూజిక్ బ్యాండ్, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయి. భవానీ ద్వీపం వద్ద నుంచి బాణసంచా భారీ ఎత్తున కాల్చనున్నారు.

ఆకట్టుకున్న ముందస్తు రిహార్సల్స్... డ్రోన్‌షో విజయవంతానికి నిర్వాహకుల ముందస్తు రిహార్సల్స్ ఆకట్టుకున్నాయి. ఆదివారం, సోమవారం రాత్రి సమయంలో నదీతీరం వెంబడి ట్రయల్ రన్ వేశారు. ఆకాశంలో ఒక్కసారిగా వివిధ రకాల ఆకారాలతో బొమ్మలు కనిపించడంతో నగర వాసులు సంభ్రమాశ్చర్యాలకు గురయ్యారు. నదీతీర ప్రాంతం ఒక్కసారిగా వెలుగు జిలుగులతో నిండిపోవడంతో అలాగే చూస్తుండిపోయారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర మంత్రులు, మంత్రులు, అతిథులు వస్తున్న నేపథ్యంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. మంగళవారం మధ్యాహ్నం నుంచే వెయ్యి మందికి పైగా పోలీసులు బందోబస్తులో ఉన్నారు. వేదికపై అతిథుల ప్రసంగాలను వీక్షించేలా భారీ తెరలు సైతం అమర్చారు. వేలాది డ్రోన్‌లకు ఛార్జింగ్ పెట్టారు. అలాగే ఆకాశంలో వివిధ రకాల ఆకారాలు వచ్చేలా కంప్యూటర్ ప్రోగ్రామింగ్ ఇచ్చారు.


సమ్మిట్‌కు సిద్ధమైన డ్రోన్లను పరిశీలిస్తున్న యువతి


వెలుగుల వేడుకకు సర్వం సిద్ధం


అతిథుల ప్రసంగాలను వీక్షించేలా భారీ తెర


వినువీధిలో ఎగరేస్తాం...

మంగళగిరిలో ప్రతిష్ఠాత్మక ఏర్పాట్లు..

మంగళగిరి: మంగళగిరిలోని సీకే కన్వెన్షన్ వేదికగా మంగళ, బుధవారాల్లో అమరావతి డ్రోన్ సమ్మిట్-2024ను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించడానికి ప్రభుత్వం ఏర్పాట్లు పూర్తి చేసింది. రెండు రోజుల పాటు జరిగే సదస్సుకు ప్రణాళికాయుతంగా సదస్సు విజయవంతమయ్యేలా జాగ్రత్తలు తీసుకున్నారు. జాతీయ స్థాయిలో జరుగుతున్న కార్యక్రమం కావడంతో భద్రతా పరంగా ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. రెండు రోజుల పాటు జరిగే సదస్సులో డ్రోన్ల ఆవశ్యకత, భవిష్యత్తు అవసరాలు, ఆయా రంగాల్లో ఏవిధంగా ఉపయోగించుకోవాలనే అంశాలపై విస్తృత స్థాయిలో చర్చలు జరుగుతాయి. వివిధ రకాల డ్రోన్ల తయారీదారులు వారి ఉత్పత్తులను ప్రదర్శించనున్నారు. వ్యవసాయం నుంచి విపత్తుల వరకు ప్రతి రంగంలోనూ డ్రోన్ల అవసరాలు పెరిగాయి. ఇందుకు అనుగుణంగా తయారు చేసిన డ్రోన్లను ప్రదర్శిస్తారు. దేశంలోని పలు ప్రాంతాల నుంచి వచ్చే డెలిగేట్స్ సదస్సు వేదికగా వారి అభిప్రాయాలను పంచుకోనున్నారు. ఇక్కడ జరిగే సదస్సు ఈ రంగంలో కీలకంగా మారనుంది. ఇక్కడి నుంచే భవిష్యత్తులో డ్రోన్ల వినియోగం, ఇతరత్రా అంశాలపై ఒక స్పష్టత రానుంది. వివిధ ప్రాంతాల నుంచి డెలిగేట్స్ వస్తున్నందున వారందరికీ ఎలాంటి అసౌకర్యం కలగకుండా జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. అదే విధంగా ట్రాఫిక్, భద్రతాపరంగా అన్ని చర్యలు పోలీసు శాఖ చేపట్టింది. మంగళవారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హాజరుకానున్నారు.


ప్రదర్శనకు స్టాళ్లు సిద్ధం



త్రివర్ణ శిల్పికి.. సగర్వ నివాళి

- బందరు వైద్యకళాశాలకు పింగళి పేరు
- జీవో విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- ఫలించిన ఎంపీ వల్లభనేని బాలశౌరి కృషి
- వైకాపా హయాంలో అడుగడుగునా ఆటంకాలు

ఈనాడు, అమరావతి,
మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే

మచిలీపట్నం వైద్య కళాశాలకు జాతీయ పతాక రూపశిల్పి పింగళి వెంకయ్య పేరు పెడుతూ రాష్ట్ర ప్రభుత్వం జీవో విడుదల చేసింది. కృష్ణా జిల్లాకు చెందిన పింగళి పేరును వైద్య కళాశాలకు పెట్టాలంటూ మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి చేసిన ప్రయత్నాలు ఫలించాయి. పింగళి పేరును వైద్య కళాశాలకు పెట్టకుండా గత వైకాపా ప్రభుత్వంలో అడుగడుగునా ఎన్నో ఆటంకాలు సృష్టించారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత ఇదే విషయంపై ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఎంపీ లేఖ రాశారు. వైద్య కళాశాలకు మహనీయుని పేరును పెట్టాలంటూ కోరారు. తాజాగా అక్టోబరు 02న గాంధీ జయంతి సందర్భంగా మచిలీపట్నంలో నిర్వహించిన 'స్వచ్ఛతే సేవ' కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరవ్వగా.. ఆ సమయంలో వేదిక పైనుంచే ఎంపీ బాలశౌరి పింగళి పేరు పెట్టాలంటూ విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి వెంటనే స్పందించి భావితరాలకు స్ఫూర్తినిచ్చేలా వైద్య కళాశాలకు పింగళి పేరు పెడతామంటూ హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం.. సోమవారం జీవోను విడుదల చేశారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో 64 ఎకరాల విస్తీర్ణంలో రూ.550 కోట్లతో వైద్య కళాశాల నిర్మాణం జరుగుతోంది. రూ.125 కోట్లతో తొలి విద్యా సంవత్సరానికి అవసరమైన పనులు పూర్తి చేసి 2023 సెప్టెంబరు 1న తరగతులు ఆరంభించారు. పరిపాలన, పరీక్షల విభాగాలు, గ్యాలరీ, విద్యార్థుల వసతి గృహాలు, డిపార్ట్‌మెంట్ బ్లాక్, పరిశోధనశాలలను నిర్మించారు. ప్రస్తుతం 150మంది విద్యార్థులు మొదటి ఏడాది పూర్తి చేసుకుని ద్వితీయ విద్యా సంవత్సరంలోకి ప్రవేశించారు. ఈ ఏడాది కొత్త బ్యాచ్ రావడంతో మిగిలిన భవన నిర్మాణాల పనులు ప్రస్తుతం జరుగుతున్నాయి. ఆసుపత్రి, నర్సింగ్ కళాశాల, టీచింగ్ అండ్ నాన్‌టీచింగ్ క్వార్టర్లు, శవాగారం, బయో వ్యర్థాల నిర్వహణ కోసం భవనాల నిర్మాణం జరుగుతోంది.



మహనీయుని పేరు పెట్టకుండా కుట్రలు..

గత వైకాపా ప్రభుత్వ హయాంలో.. వైద్య కళాశాల ఏర్పాటుకు అనుమతులు, కేంద్రంతో మాట్లాడి నిధులు సకాలంలో విడుదలయ్యేలా ఎంపీ బాలశౌరి కృషి చేశారు. కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రిని అనేకసార్లు వైద్య కళాశాల కోసం కలిశారు. కళాశాల నిర్మాణ పనుల పురోగతిపై తరచూ సమీక్షించేవారు. వైద్య కళాశాల ఏర్పాటైన దగ్గర నుంచి పింగళి వెంకయ్య పేరునే పెట్టాలంటూ ఎంపీ కోరుతున్నారు. కానీ ఈ వైద్య కళాశాలకు మహనీయుని పేరు పెట్టకుండా అడ్డుకునేందుకు వైకాపా ప్రభుత్వం, అప్పటి స్థానిక ఎమ్మెల్యే పేర్ని నాని అనేక కుట్రలు చేశారు. అప్పటి ముఖ్యమంత్రి జగన్ తన తండ్రి వైఎస్ఆర్ పేరు కళాశాలకు పెట్టుకోవాలని ప్రయత్నించడం బాధాకరం. దేశమంతా గర్వంగా చెప్పుకొనే పింగళి వెంకయ్య పేరును పెట్టకుండా ఆయన పుట్టిన ప్రాంతంలో తీవ్రంగా అవమానించారు. వైద్య కళాశాలకు వైఎస్ఆర్ పేరును పెట్టినట్టుగా బ్యానర్లు, చిత్రాలను కూడా తయారు చేసి సామాజిక మాధ్యమాల్లో తిప్పారు. కొందరు వైకాపా కార్యకర్తలు అత్యుత్సాహంతో కళాశాల వద్ద కూడా బ్యానర్లు కట్టారు. దీనిని ఎంపీ బాలశౌరి అప్పట్లోనే తీవ్రంగా వ్యతిరేకించారు.

పింగళికి బందరుతో ప్రత్యేక బంధం..

త్రివర్ణ పతాకానికి రూపకల్పన చేసిన పింగళి వెంకయ్యది కృష్ణా జిల్లాలోని భట్లపెనుమర్రు. మచిలీపట్నంతో ఆయనకు ప్రత్యేక అనుబంధం ఉంది. బందరులోని ఆంధ్ర జాతీయ కళాశాలలో అధ్యాపకుడిగా సేవలందించారు. ఆ సమయంలోనే మువ్వన్నెల జెండాను రూపొందించారు. స్వాతంత్ర్యోద్యమంలో బందరు కేంద్రంగానే అనేక పోరాటాలు చేశారు. జాతిపిత మహాత్మాగాంధీకి అత్యంత నమ్మకమైన అనుచరుడిగా పింగళి ఉండేవారు. తెదేపా హయాంలో మచిలీపట్నంలోని రాజుపేటలో ఓ వీధికి ఆయన పేరు పెట్టారు. మచిలీపట్నం ప్రభుత్వ వైద్య కళాశాలకు పింగళి పేరు పెట్టడం ద్వారా.. చిరస్థాయిగా నిలిచిపోవాలని ఎంపీ బాలశౌరి అలుపెరగని కృషి చేశారు.

ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు..

– వల్లభనేని బాలశౌరి, మచిలీపట్నం ఎంపీ



వైద్య కళాశాలకు పింగళి వెంకయ్య పేరు పెడుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం ఆనందంగా ఉంది. ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నా. కళాశాల నిర్మాణ సమయంలోనే ఆయన పేరు పెట్టాలని నిర్ణయించాం. కానీ గత వైకాపా ప్రభుత్వం, ఆ పార్టీ స్థానిక నేతలు అడుగడుగునా అడ్డుకుని రాజకీయం చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆ మహనీయునికి సముచిత గౌరవం దక్కింది. ప్రభుత్వం వచ్చిన వెంటనే పింగళి పేరు పెట్టాలంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు లేఖ రాశా. ముఖ్యమంత్రి ఇటీవల మచిలీపట్నం వచ్చినప్పుడు ఇదే విషయం గుర్తుచేయగా వెంటనే హామీ ఇచ్చి.. ఇప్పుడు జీవోను విడుదల చేశారు.



మెరుపు వేగం.. మేటి సాయం..!

- పౌర సేవలకు డ్రోన్లు వినియోగిస్తున్న విజయవాడ నగరపాలిక
- కంకిపాడు, పెనమలూరుల్లో డ్రోన్ ఆధారిత సంస్థలు
- వ్యవసాయంలో ఎరువుల పిచికారీకి ఎక్కువగా వాడకం

ఈనాడు – అమరావతి

నగరాభివృద్ధి, పట్టణ ప్రణాళిక, ప్రజారోగ్య విభాగాల్లో.. డ్రోన్ల వినియోగం బాగా పెరిగింది. విజయవాడ నగరంలోనూ ప్రస్తుతం ప్రజారోగ్య విభాగం ఆధ్వర్యంలో డ్రోన్లను వినియోగిస్తున్నారు. తాజాగా నగరపాలక సంస్థ రెండు అధునాతన డ్రోన్లను కొన్నది. వాటిని వ్యాధుల నివారణకు అవసరమైన మందులను పిచికారీకి వినియోగిస్తున్నారు. త్వరలో మరిన్ని డ్రోన్లను నగరపాలిక కార్యకలాపాల్లో వినియోగించడం ద్వారా ప్రజలకు నాణ్యమైన సేవలను అందించాలనే ప్రణాళికలు రూపొందిస్తున్నారు. విజయవాడ పున్నమిఘాట్‌లో నేటి సాయంత్రం ఐదు వేలకు పైగా డ్రోన్లతో చేపట్టనున్న భారీ ప్రదర్శనకు ఇప్పటికే ఏర్పాట్లు చేస్తున్నారు.

రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో అమరావతి కేంద్రంగా ఈనెల 22, 23ల్లో నిర్వహించబోయే డ్రోన్ సమ్మిట్‌లో నగరాభివృద్ధిలో డ్రోన్ల వినియోగంపై ప్రత్యేకంగా చర్చించనున్నారు. నగరాల పరిధిలో ఏఏ రంగాల్లో డ్రోన్లను వినియోగిస్తే పౌరులకు అధునాతన సేవలను అందించవచ్చనే అంశంపై ఇప్పటికే నివేదికలు సిద్ధం చేశారు. విజయవాడ వంటి నగరాల్లో ఇప్పటికే డ్రోన్ల వినియోగం బాగా పెరిగింది. ఈ నేపథ్యంలో తాజాగా రాష్ట్ర ప్రభుత్వమూ ప్రత్యేకంగా డ్రోన్ల వినియోగం విధివిధానాల రూపకల్పనపై దృష్టిపెట్టడంతో ఈ రంగంలో అనేక అవకాశాలను యువత అందుకోనున్నారు.

పట్టణ ప్రణాళికలో వినియోగం..

విజయవాడ నగరం దినదినాభివృద్ధి చెందుతోంది. పట్టణప్రణాళికా విభాగంలో డ్రోన్ల వినియోగం పెరగనుంది. భవన నిర్మాణాల పర్యవేక్షణతోపాటు 3 డీ మోడల్స్ పరిశీలన, స్థలాల మ్యాపింగ్, స్మార్ట్ సిటీల రూపకల్పనకు చేపట్టాల్సిన చర్యలేంటనేది నిర్ధరించడానికి డ్రోన్ల అవసరం చాలా ఉంటుంది. ప్రధానంగా నగర ట్రాఫిక్ సమస్య పరిష్కారం, మౌలిక సౌదుపాయాల కల్పన, పట్టణాల్లో ఖాళీ స్థలాల పరిశీలనకు డ్రోన్లు ఎంతో ఉపయోగపడతాయి. వీటిపైనా డ్రోన్ సమ్మిట్‌లో చర్చించనున్నారు.



వరదల వేళ ఆత్మీయ నేస్తం

విజయవాడ సింగ్‌నగర్ ప్రాంతాన్ని ఇటీవల బుడమేరు వరద ముంచెత్తిన సమయంలో డ్రోన్లను పెద్ద ఎత్తున వినియోగించారు. నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో డ్రోన్లను అద్దెకు తీసుకొచ్చి.. బాధితులకు ఆహారం, నీటిని అందించారు. బోట్లలో వెళ్లి సహాయం చేయలేని ప్రాంతాలకు.. తొలుత డ్రోన్ల ద్వారానే ఆహారం, నీళ్లు, మందులను చేరవేశారు. హెలికాప్టర్లు వచ్చేవరకూ డ్రోన్లే సహాయపడ్డాయి. వరద ముంచెత్తి వారం దాటినా నీళ్లు కాలనీల్లో నిల్వ ఉండటంతో.. డ్రోన్ల సాయంతోనే దోమల నివారణ మందులను పిచికారీ చేశారు. ఇవి ఎంతో ఉపయోగకరంగా ఉండడంతో ప్రస్తుతం రెండు డ్రోన్లను నగరపాలక సంస్థ కొనుగోలు చేసింది. ప్రజారోగ్య విభాగం ఆధ్వర్యంలో వీటిని ప్రస్తుతం వినియోగిస్తున్నారు. నీళ్లు నిల్వ ఉండే ప్రాంతాల్లో వీటి ద్వారా మందులు పిచికారీ చేస్తున్నారు.

రైతన్నకు అండదండలు

డ్రోన్ల ఆధారిత సంస్థలు సైతం విజయవాడ, శివారు ప్రాంతాలైన కంకిపాడు, నెప్పల్లి, పెనమలూరుల్లోనూ ఏర్పాటయ్యాయి. ఇంజినీరింగ్ పూర్తిచేసిన యువత సైతం డ్రోన్లపై ఆధారపడే సంస్థలను నెలకొల్పారు. డ్రోన్లను వ్యవసాయంలో ఉపయోగిస్తూ ఆదాయం పొందుతున్నారు. కె.ఎల్.యూనివర్శిటీలో ఇంజినీరింగ్ పూర్తిచేసిన గోపీ రాజా అనే యువకుడు ఏడేళ్ల కిందటే కంకిపాడు కేంద్రంగా డ్రోన్ ఆధారిత సంస్థను నెలకొల్పాడు. ఈ కంపెనీ ఆధ్వర్యంలో డ్రోన్లను అవసరమైన వారికి తయారుచేసి ఇస్తూ.. శిక్షణ సైతం ఇస్తున్నారు. రైతులకు పొలాల్లో మందులను పిచికారీ చేయడానికి సైతం డ్రోన్లను పంపిస్తున్నారు. ఎకరాకు రూ.400 చొప్పున పురుగు మందులు, ఎరువులను పిచికారీ చేయడానికి తీసుకుంటున్నారు. రైతులు సైతం ప్రస్తుతం వీటికి బాగా అలవాటు పడ్డారు. ప్రస్తుతం ఇలాంటి సంస్థలు విజయవాడ శివారు ప్రాంతాల్లో మూడు నాలుగు ఏర్పాటయ్యాయి. తాజాగా జరగబోయే డ్రోన్ సమ్మిట్‌లో గోపీరాజా సంస్థ పాల్గొంటోంది. వ్యవసాయంతోపాటు ఉత్పత్తులను డెలివరీ చేసే కార్గో డ్రోన్‌లను ఈ సమ్మిట్‌లో భాగంగా మంగళగిరి సి.కె. కన్వెన్షన్‌లో ప్రదర్శించబోతున్నట్లు గోపీ రాజా వెల్లడించారు.


పంటలపై ఎరువుల పిచికారీకి డ్రోన్ వినియోగం

దసరా ఆదాయం రూ.9.31 కోట్లు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే : దసరా ఉత్సవాల సందర్భంగా దుర్గగుడి హుండీలలో భక్తులు సమర్పించిన కానుకలను మూడు విడతల్లో మల్లికార్జున మహామండపం ఆరో అంతస్తులో లెక్కించగా రూ.9.31కోట్లు ఆదాయం వచ్చింది. మొదటి విడతలో రూ.3.50కోట్లు, రెండో విడతలో రూ.2.76కోట్లు, మూడో విడతలో రూ.3.05 కోట్ల కానుకలు వచ్చాయని ఆలయ ఈవో రామారావు సోమవారం తెలిపారు. మూడు విడతల్లో బంగారం 733 గ్రాములు, 25.705 కిలోల వెండి వస్తువులను భక్తులు మొక్కుల రూపంలో చెల్లించారు. కానుకల లెక్కింపును ఈవోతోపాటు డిప్యూటీ ఈవో రత్నంరాజు సీసీ కెమెరాల్లో వన్‌టౌన్ పోలీసులు, ఎస్‌పీఎఫ్, దేవస్థానం సెక్యూరిటీ సిబ్బంది పర్యవేక్షించారు. కార్యక్రమంలో పాల్గొన్న దేవస్థానం ఉద్యోగులు, సేవా సిబ్బందికి దేవస్థానం లడ్డూతోపాటు అన్నప్రసాదాన్ని అందజేశారు.


కానుకలు లెక్కిస్తున్న దేవస్థానం సిబ్బంది

ఆటవిడుపు.. పెదవివిరుపు!

న్యూస్‌టుడే పరిశీలన

ఆహ్లాదం అందని దైన్యం
నగరం, గ్రామీణంలోనూ ఇదే పరిస్థితి..

కుటుంబ బాధ్యతలు, ఉద్యోగ విధులు, ఆర్థిక బాధలతో తలమునకలవుతున్న ప్రజలు సేదతీరేందుకు సరైన ఉద్యానాలు లేవు. ఉన్నవి ఆదరణ వసతుల మధ్య కొట్టుమిట్టాడుతున్నాయి. క్రీడా పరికరాలు అంతంత మాత్రమే. అధికారులు, పాలకుల నిర్లక్ష్యం వల్ల ఆహ్లాదం అందని పరిస్థితులు నెలకొన్నాయి. సాయంత్రం వేళ పచ్చని చెట్ల మధ్య కాసేపైనా విశ్రాంతి పొందే వీలులేదు. గత వైకాపా ప్రభుత్వ పాలనకు ఇవి సాక్ష్యాలుగా నిలిచాయి. కూటమి ప్రభుత్వమైనా స్పందించి.. పార్కులను అభివృద్ధి చేయాలని జనం కోరుకుంటున్నారు.

విజయవాడ నగరపాలక సంస్థ, నందిగామ, మైలవరం, జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే

విజయవాడ నగరవాసులకు ఆహ్లాదాన్ని పంచే పార్కుల విషయంలో పాలకులు, అధికారులు పూర్తి నిర్లక్ష్యం చూపుతున్నారు. మూడు కమిషనరేట్ పార్కుల్లోనే కాస్తంత సౌకర్యాలు ఉన్నాయి. ఏలూరు, రైవస్, బందరు కాలువగట్లపై గతంలో 16 పార్కులు ఉండేవి. వీటిలో కొన్నింటిని పూర్తిగా మూసివేశారు. నిర్వహణ లేక దాదాపుగా అన్నీ కునారిల్లుతున్నాయి. ఉన్నవి అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారాయి. రామయ్య, అంబేడ్కర్, రాజీవ్‌గాంధీ పార్కులూ అదే స్థితికి చేరాయి. సాధారణ రోజుల్లోనే అసాంఘిక కార్యక్రమాలు సాగుతున్నాయి. అధికారులు పట్టించుకోవడం లేదు. అజిత్‌సింగ్‌నగర్‌లో రూ.10 కోట్ల వ్యయంతో పది ఎకరాల్లో నిర్మాణం చేపట్టిన బికాన్ పార్కు.. నేటికీ అందుబాటులోకి రాలేదు. నిధుల లేమి కారణంగా పనులు అసంపూర్తిగా మిగిలాయి. పాయకాపురం చెరువు ప్రాంతంలో 8 ఎకరాల్లో రూ.6 కోట్లతో నిర్మాణం చేసిన పార్కు.. ఇటీవల వరదలకు కొంతవరకు పాడైపోయింది. అందుబాటులోకి రాకుండానే మూలనపడింది. రామలింగేశ్వరనగర్ వారధి సమీపంలో 8 ఎకరాల్లో రూ.12 కోట్లతో అభివృద్ధి చేసిన వారధి రివర్ ఫ్రంట్‌దీ అదే పరిస్థితి. ఇటీవల వరదలకు స్వల్పంగా పాడైపోయింది. సాయంత్రం వేళ మాత్రమే కొంత వరకు అనుమతిస్తున్నారు.


విజయవాడ సత్యనారాయణపురంలో ఇసుకలో ఆడుకుంటున్న చిన్నారులు


నందిగామలో మినీ పార్కులో ఆట వస్తువుల దుస్థితి..

క్రీడా పరికరాలకు తుప్పు

నందిగామ ద్వితీయ శ్రేణి పురపాలక సంఘంగా అప్‌గ్రేడ్ అయినా.. కనీసం ఉద్యానం లేకపోవడంతో పట్టణ ప్రజలకు అసౌకర్యంగా ఉంది. పురపాలక సంఘం పరిధిలో నందిగామతోపాటు హనుమంతుపాలెం, అనాసాగరం గ్రామాలు ఉన్నాయి. 20 వార్డుల్లో 50వేల మందికి పైగా జనాభా ఉన్నారు. పరిసర ప్రాంతాల ప్రజలు నందిగామలో స్థిరపడుతుండడంతో.. వేగంగా అభివృద్ధి చెందుతోంది. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో గత తెదేపా ప్రభుత్వంలో ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ఆధ్వర్యంలో మినీ పార్కు ఏర్పాటు చేశారు. తర్వాత వచ్చిన వైకాపా ప్రభుత్వం పట్టించుకోలేదు. పార్కు స్వరూపం మారిపోయింది. పిల్లలు ఆడుకునే జారుడు బల్లలు, ఉయ్యాల వంటి ఆట పరికరాలు తుప్పుపట్టి పాడైపోయాయి. పిచ్చిమొక్కలు పెరిగి అధ్వానంగా మారింది. పార్కు ఏర్పాటు చేస్తామని అప్పటి ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ ఇచ్చిన హామీలు అమలుకు నోచుకోలేదు. ప్రజలు సరదాగా గడిపేందుకు, పిల్లలు ఆటలు ఆడుకునేందుకు సరైన పార్కు లేకపోవటంతో ఇబ్బంది పడుతున్నారు.

నగర జనాభా	సందర్శకులు	ముఖ్యమైన కాలనీలు
12.50 లక్షల మంది	60–70 వేల మంది	250

- నగరపాలక సంస్థ పార్కులు: 173
- ఉపయోగంలో ఉన్నవి: 119
- వినోదం కలిగించేవి: 3
- నిరుపయోగంగా ఉన్నవి: 54
- క్రీడా పరికరాలు ఉన్నవి: 6
- పాడైన కాలువగట్ల పార్కులు: 16
- అమృత్ పార్కులు: 4
- నిర్మాణంలో ఉన్నవి: 1
- ప్రారంభించినా అందుబాటులోకి రానివి: 2

మందు బాబులకు అడ్డా

మైలవరం స్టేడియం ఎదుట ఉన్న సూరిబాబు పార్కులో ఆహ్లాదం ఆవిరైపోయింది. సుమారు ఎకరం విస్తీర్ణంలో ఉంది. పిచ్చి మొక్కలు, వయ్యారిభామ మొక్కలతో నిండిపోయింది. క్రీడా సామగ్రి నిరుపయోగంగా మారింది. చిన్నారులకు అక్కరకు రావడం లేదు. ప్రజలు కాసేపు కాలక్షేపానికి కూర్చోవాలన్నా ఇబ్బందిగా మారింది. ఏడేళ్ల కిందట సుమారు రూ.5 లక్షలు వెచ్చించి ఆధునీకరించారు. గత ప్రభుత్వం పట్టించుకోలేదు. ఆహ్లాదం లేకపోవడంతో పూర్తిగా అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. మందుబాబులు బల్లలపై కూర్చుని.. మందు తాగుతున్నారు.


మైలవరంలో.. పిచ్చి మొక్కల మధ్యలో క్రీడాసామగ్రి

సౌకర్యాలు అవసరం

జగ్గయ్యపేట బస్టాండ్ పక్కనే మున్సిపల్ పార్కు, ఊరచెరువు మధ్యలో బుద్ధ విహార్ పార్కులు అందుబాటులో ఉన్నాయి. కానీ పూర్తిస్థాయిలో సౌకర్యాలు లేవు. తాగునీరు, మరుగుదొడ్లు లేవు. సందర్శకులు ఇబ్బందులు పడుతున్నారు. పురపాలక సంఘం, ప్రభుత్వం దృష్టిసారించాలని పట్టణ వాసులు కోరుతున్నారు.


జగ్గయ్యపేట బుద్ధ విహార్ పార్కు

ఎస్సై.. మహిళపై యువకుల దౌర్జన్యం

కారుపై జోగి రమేష్ స్టిక్కర్


భవానీపురం పోలీసుస్టేషన్ వద్ద సీజ్ చేసిన కారు

భవానీపురం, న్యూస్‌టుడే : మాజీ మంత్రి జోగి రమేష్ పేరున్న ఎమ్మెల్యే స్టిక్కర్ అంటించి ఉన్న కారులో వచ్చిన ఇద్దరు యువకులు భవానీఘాట్ వద్ద హల్‌చల్ చేశారు. విధుల్లో ఉన్న ఎస్సై, మహిళపై దౌర్జన్యం చేశారు. వివరాలిలా ఉన్నాయి.. విద్యాధరపురం లేబర్‌కాలనీలో పలివెల కనకదుర్గ కుటుంబ సభ్యులతో కలిసి నివాసం ఉంటున్నారు. కృష్ణానది ఒడ్డున డ్రోన్‌షో ఏర్పాట్లను తిలకించేందుకు సోమవారం మధ్యాహ్నం ఆమె అక్కడకు వెళ్లారు. ఆ సమయంలో ఈపూరి అరుణ్, జగదీష్‌లు కారులో అక్కడకు దూసుకుని వచ్చారు. అక్కడ ఉన్న పోలీసు బారికేడ్లను ఢీకొట్టారు. కారు వెనక్కు తిప్పి కనకదుర్గ ఉన్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టారు. కారులో ఉన్న వారిద్దరినీ ఆమె ప్రశ్నించగా దురుసుగా మాట్లాడారు. అక్కడే విధుల్లో ఉన్న ఎస్సై అక్కడకు వచ్చి ప్రశ్నించగా అతనిపైనా దౌర్జన్యం చేశారు. కారుపై మాజీ మంత్రి జోగి రమేష్ స్టిక్కర్ ఉంది. దీంతో పోలీసులు కారును సీజ్ చేసి భవానీపురం స్టేషన్‌కు తరలించారు. కనకదుర్గ ఫిర్యాదు మేరకు ఈపూరి అరుణ్, జగదీష్‌లపై భవానీపురం పోలీసులు కేసు నమోదు చేశారు.

దుర్గగుడికి నోటీసుల వెనుక కార్పొరేషను కీలక ప్రజాప్రతినిధి?

దసరాలో ప్రొటోకాల్ పాటించలేదని ఆలయ అధికారులపై ఆగ్రహం

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే : దుర్గగుడికి ఆస్తి పన్ను వ్యవహారంలో దేవాదాయ శాఖ కమిషనర్ ఉత్తర్వులు చూపినా కార్పొరేషను అధికారులు నోటీసులు ఇవ్వడం వెనుక కీలక ప్రజాప్రతినిధి హస్తం ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. దసరా ఉత్సవాల్లో తనకు ప్రొటోకాల్ ఇవ్వలేదని బహిరంగంగా చెప్పి కార్పొరేషను సహకారం లేకుండా ఉత్సవాలు ఏ విధంగా నిర్వహిస్తారని సదరు ప్రజాప్రతినిధి ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ఉత్సవాలు ముగిసి పది రోజులు గడవకుండానే కార్పొరేషనుకు ప్రాపర్టీ ట్యాక్స్ చెల్లించాలంటూ సదరు అధికారులు నోటీసులు అందజేసిన విషయం చర్చనీయాంశమైంది.

★ సీవీ రెడ్డి ఛారిటీస్ స్థలంలో గతంలో దుకాణాలు ఉండేవి. వాటిపై ఆలయానికి రూ.30లక్షల ఆదాయం వచ్చేది. 2010లో సీవీ రెడ్డి ఛారిటీస్ దుర్గగుడిలో కలిసిపోయింది. 2015లో ఇక్కడ ఉన్న దుకాణాలు తొలగించి డార్మిటరీలు నిర్మించడంతో దేవస్థానానికి ఆదాయం రాకపోగా నెలకు రూ.5 లక్షలు విద్యుత్తు ఛార్జీల రూపేణా చెల్లిస్తున్నారు. భక్తులకు ఉచిత వసతి సౌకర్యం కల్పిస్తున్న మల్లికార్జున మహామండపం, రాజగోపురం, డార్మిటరీకు సైతం ఆస్తిపన్ను రూ.2.36 కోట్లు కట్టాలని నోటీసు ఇచ్చారు. 26 అసెస్‌మెంట్స్ ఉన్నట్లు దుకాణాలు తొలగించక ముందు ఉన్న లెక్కలు ప్రస్తావించారు. ప్రస్తుతం అక్కడ రూ.10కోట్ల వ్యయంతో నిర్మించిన డార్మిటరీ వలన దేవస్థానానికి ఇసుమంత ప్రయోజనం కూడా లేదు. భక్తుల ఉచిత వసతి కోసం ఏడాదికి రూ.60లక్షల మేర విద్యుత్తు ఛార్జీలు చెల్లిస్తున్నారు. లాభాపేక్ష లేకుండా సేవా కార్యక్రమాలు నిర్వహించే సంస్థలకు వర్తించే నిబంధనలు దుర్గగుడికి వర్తిస్తాయని అధికారులు దేవాదాయ శాఖ కమిషనర్ ఇచ్చిన ఉత్తర్వులను కార్పొరేషను అధికారులకు చూపించారు. 2017 నుంచి 2024 వరకు వారు చెబుతున్న అసెస్‌మెంట్స్ అక్కడ లేనప్పటికీ ప్రాపర్టీ ట్యాక్స్‌తోపాటు జరిమానా కూడా విధించినట్లు నోటీసు స్పష్టం చేస్తోంది.

పన్ను మినహాయింపుపై సంప్రదిస్తున్నాం

రాజగోపురం, మల్లికార్జున మహామండపం, సీవీ రెడ్డి ఛారిటీస్‌పై కార్పొరేషను అధికారులు ఆస్తి పన్ను విధించడంపై ఈవో రామారావును సంప్రదించగా ఈ విషయంపై 2023లో నోటీసు ఇచ్చినప్పుడు దానికి దేవాదాయ శాఖ కమిషనర్ ఇచ్చిన సర్క్యులర్‌ను దేవస్థానం అధికారులు చూపించారన్నారు. వ్యాపార లావాదేవీలు, ఆదాయం లేనందున వాటిని కేవలం భక్తుల సౌకర్యం కోసం వినియోగిస్తునందున పన్ను మినహాయింపు ఉంటుందని వారికి తెలియజేశామన్నారు. కార్పొరేషను కమిషనర్‌ను కూడా కలిసి పన్ను మినహాయింపు.. అవకాశం ఉన్న వాటిని దేవస్థానానికి వర్తింపజేయాలని కోరతామన్నారు.

ఇసుక తవ్వకాల్లో ఆధిపత్య పోరు

భీమవరప్పాడులో ఇరువర్గాల ఘర్షణ

మైలవరం, జి.కొండూరు, న్యూస్‌టుడే: ఉచిత ఇసుక వ్యవహారం గ్రామాల్లో ఆధిపత్య పోరాటాలకు దారితీస్తోంది. కొన్ని చోట్ల ట్రాక్టర్లతో తెచ్చి, టిప్పర్ల ద్వారా బయటకు తరలించి సొమ్ములు చేసుకుంటుంటే.. మరికొన్ని గ్రామాల్లో ట్రిప్పులకు పన్నులేసి వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే గ్రామాల్లో నాయకులు ఎవరికివారే బుడమేరు వాగును తమ అడ్డాగా మార్చుకుంటూ ఇతరులొస్తే బెదిరింపులు, దాడులకు పాల్పడుతున్నారు. అదే కోవలో సోమవారం జి.కొండూరు మండలం వెల్లటూరు శివారు బీమవరప్పాడులో, ఇరువర్గాల మధ్య ఘర్షణ తలలు పగిలే వరకు వెళ్లింది. జి.కొండూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం వెల్లటూరు శివారు సీతారాంపురానికి చెందిన ఆకుల రామారావు తన ఇంటి ప్రహరీ నిర్మాణం నిమిత్తం ఇసుక కోసం పొరుగు శివారు గ్రామమైన బీమవరప్పాడు వద్ద బుడమేరు ఇసుక కోసం తన ట్రాక్టరు తీసుకుని వెళ్లాడు. అదే సమయంలో ఆ గ్రామానికి చెందిన మొండితోక గోపాలరావు కొంతమంది తమ గ్రామం నుంచి ఇసుక తరలించడానికి వీల్లేదంటూ అడ్డుతగిలారు. ఈక్రమంలో ఇసుక ట్రాక్టరును అక్కడే వదిలేసి అంతా కలిసి గ్రామంలోకి వెళ్లగా ఇరువర్గాల తరపున పెద్ద ఎత్తున మద్దతుదారులు పోగయ్యారు. ఇరు వర్గాల వాదనల నేపథ్యంలో కొట్లాటకు దిగడంతో ఆకుల రామారావు, అతని కుమారుడు వెంకట శివనాగరాజుతో పాటు వారి కుటుంబంలోని పలువురు మహిళలకు స్వల్ప గాయాలవగా, మైలవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. దాడులపై ఇరువర్గాల పరస్పర ఫిర్యాదుల మేరకు కేసులు నమోదు చేస్తున్నట్లు జి.కొండూరు ఎస్సై కె.సతీష్ కుమార్ తెలిపారు.


మైలవరం ప్రభుత్వాస్పత్రిలో బాధితుల వివరాలు సేకరిస్తున్న పోలీస్


ఆసుపత్రి వద్ద ప్రజలు

ప్రాణం తీసిన రూ.5వేలు

భార్య పీక కోసిన భర్త

విజయవాడ(చిట్టినగర్), న్యూస్‌టుడే : డబ్బులు అడిగితే ఇవ్వలేదనే కోపంతో భార్య పీక కోసి హతమార్చిన ఘటన విజయవాడలో సంచలనం సృష్టించింది. పోలీసులు వివరాల ప్రకారం.. కంసాలిపేటకు చెందిన షేక్ బాజీ, నగిన(32)లకు 11 ఏళ్ల కిందట వివాహమైంది. వారికి బాబు సంతానం. భర్త పెయింటింగ్ పని, భార్య స్థానికంగా సమోసాల తయారీ కేంద్రంలో పని చేస్తారు. భర్త మద్యానికి బానిసై పనికి సరిగా వెళ్లడం లేదు. అప్పులు చేస్తూ తరచూ భార్యను డబ్బులు కావాలంటూ వేధించేవాడు. బుడమేరు వరద వచ్చిన దగ్గర నుంచి స్పిరిట్, సొల్యూషన్ తాగేందుకు అలవాటు పడ్డాడు. నాలుగు రోజుల కిందట రూ.5 వేలు కావాలని భార్యను అడిగాడు. ఆమె ఇవ్వకపోవడంతో గొడవ పడ్డాడు. ఆ తరువాత నగిన పక్కవీధిలో ఉండే అక్క సాబీర దగ్గరకు వెళ్లింది. సాయంత్రం పని అయిపోగానే ఇంటికి వెళ్లి రాత్రికి పడుకోవడానికి అక్క దగ్గరకు వస్తుంది. ఈ నేపథ్యంలో ఈ నెల 21వ తేదీన తెల్లవారుజామున 4 గంటలకు పనికి వెళ్లి ఓ గంట విశ్రాంతి సమయం ఉండడంతో ఉదయం 8 గంటలకు ఇంటికి వచ్చింది. అప్పటికే మత్తులో ఉన్న భర్త ఆమెతో గొడవపడి కొట్టాడు. దీంతో ఆమె తన సోదరికి ఫోన్ చేసి విషయం చెప్పింది. ఇంతలోనే ఉల్లిపాయలు కోసే కత్తితో బాజీ భార్య పీక కోశాడు. ఆమె కేకలు వేస్తూ రక్తపు మడుగులో పడి అక్కడికక్కడే మృతి చెందింది. సాబీర తన చెల్లి ఇంటికి వచ్చే చూసే సరికి కత్తితో రక్తం మరకలతో బాజీ బయటకు వస్తున్నాడు. ఆమె ఆందోళనతో ఇంట్లోకి వెళ్లి చూడగా రక్తపు మడుగులో విగతజీవురాలైన సోదరి కనిపించింది. ఆమె కేకలు వేయడంతో చుట్టు పక్కల వాళ్లు వచ్చారు. అప్పటికే నిందితుడు బాజీ అక్కడి నుంచి పరారయ్యాడు. సాబీర కొత్తపేట పోలీసులకు సమాచారం అందించగా ఘటనా ప్రాంతానికి చేరుకుని శవపంచనామా అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతురాలి అక్క ఫిర్యాదు మేరకు పోలీసులు బాజీని అదుపులోకి తీసుకోని కేసు నమోదు చేశారు.


హతురాలు నగీన


నిందితుడు బాజీ

ఆలిండియా టెన్నిస్ టోర్నీ ప్రారంభం

విజయవాడ క్రీడలు: ఆటలు యువతలో స్ఫూర్తి నింపడంతో పాటు ఆరోగ్యాన్ని ఇస్తాయని టోర్నీ వైస్ ఛైర్మన్ డాక్టర్ జి.సురేంద్ర పేర్కొన్నారు. అయిదు రోజుల పాటు నగరంలో నిర్వహిస్తున్న 'శ్రీబెజవాడ శ్రీకృష్ణారెడ్డి ఐస్టా-విజయవాడ 2024 ఆలిండియా సీనియర్ ర్యాంకింగ్ టెన్నిస్ టోర్నీ' ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. స్థానిక ఐజీఎంసీ టెన్నిస్ కాంప్లెక్స్‌లో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... 35+ నుంచి 75+ వయసు గల క్రీడాకారులు టోర్నీలో తలపడేందుకు హాజరవడం సంతోషంగా ఉందన్నారు. యువత కూడా రోజూ కొంత సమయం ఇష్టమైన క్రీడా సాధనకు కేటాయించాలని సూచించారు. టోర్నీ కార్యనిర్వాహక కార్యదర్శి కర్రోతి రాధాకృష్ణమూర్తి అధ్యక్షత వహించగా.. ఐస్టా-విశాఖపట్నం డైరెక్టర్ డీఎస్ఎన్ రాజు, రిటైర్డ్ జడ్జి వై.రామకృష్ణ, సహ ప్రాయోజకుడు డాక్టర్ జి.శశిధర్ పాల్గొన్నారు.

28న అగ్రిగోల్డ్ బాధితుల మహా విజ్ఞాపన దీక్ష

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే : అగ్రిగోల్డ్ బాధితుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 28న మహా విజ్ఞాపన దీక్ష చేపడుతున్నట్లు అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు, ఉప ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ తెలిపారు. సోమవారం వారు దాసరిభవన్‌లో విలేకరులతో మాట్లాడారు. అగ్రిగోల్డ్ కంపెనీ చేసిన మోసానికి, లక్షలాది మంది కుటుంబాల కష్టానికి పదేళ్లు నిండాయని ఆవేదన వ్యక్తం చేశారు. గత వైకాపా ప్రభుత్వం బాధితులకు అన్ని విధాలా న్యాయం చేస్తామని మోసం చేసిందన్నారు. బాధితుల గోడు వినడం గాని, అర్జీలు తీసుకోవడం గాని చేయలేదని విమర్శించారు. ఆ సంస్థ ఆస్తులు అమ్మి ఆదుకుంటామని కూటమి ప్రభుత్వం ఎన్నికల మ్యానిఫెస్టోలో పెట్టిందని, ఈ సమస్యపై ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి గందరగోళంగా ఉందనే కారణంతో వెంటనే డబ్బులు ఇవ్వాలని కోరలేదని చెప్పారు. అగ్రిగోల్డ్ ఆస్తుల పరిరక్షణ, కోర్టు కేసులను పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఒక సమర్థమంతమైన అధికారితో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి, రాష్ట్రంలో అన్ని జిల్లాలు పర్యటించి బాధితుల ఇబ్బందులను తెలుసుకోవాలని కోరారు. వేల ఎకరాల్లో ఉన్న రియల్ ఎస్టేట్ భూములను చిన్న చిన్న ప్లాట్లుగా చేసి, వేలం వేస్తే రెట్టింపు డబ్బులు వస్తాయని చెప్పారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామన్నారు. ఈ నెల 28న తలపెట్టిన కార్యక్రమానికి అన్ని జిల్లాల నుంచి బాధితులు తరలి రావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు షరీఫ్, కార్యదర్శి వీరభద్రం, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యా ప్రమాణాలతోనే ఉత్తమ ఫలితాలు


బ్రోచర్ ఆవిష్కరిస్తున్న శ్రీనివాసరావు, సుబ్బారెడ్డి, సుబ్బారావు, మహేశ్వరరావు తదితరులు

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే : ప్రాథమిక పాఠశాల స్థాయిలోనే నాణ్యమైన విద్యా ప్రమాణాలతో పాఠాలు బోధిస్తే ఉత్తమ ఫలితాలు సాధించడంతో పాటు విద్యార్థుల ప్రతిభ, నైపుణ్యాలు మెరుగుపడతాయని సమగ్ర శిక్షా రాష్ట్ర సంచాలకుడు బి.శ్రీనివాసరావు అన్నారు. విజయవాడ ఆంధ్రా లయోలా కళాశాల ప్రాంగణంలోని ఎస్‌జే కన్వెన్షన్‌లో పాఠశాల విద్యాశాఖ, సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులకు ఆరు రోజుల పాటు నిర్వహించే ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసీ (ఎఫ్ఎల్ఎన్) శిక్షణ తరగతులను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న గ్రేడ్ 1, 2 ఉపాధ్యాయులకు శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందని, ఇలాంటి శిక్షణ దేశంలోనే తొలిసారి ఇస్తున్నట్లు వెల్లడించారు. ఇది విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులకు నాంది పలుకుతుందని అన్నారు. సమగ్ర శిక్షా అదనపు సంచాలకుడు ఎ.సుబ్బారెడ్డి, జిల్లా అదనపు ప్రాజెక్టు సమన్వయకర్త జి.మహేశ్వరరావు, జిల్లా విద్యాశాఖాధికారి యు.వి.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. ఎన్టీఆర్, కృష్ణా, ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల ఉపాధ్యాయులు హాజరయ్యారు. తొలుత కార్యక్రమానికి సంబంధించిన బ్రోచర్ ఆవిష్కరించారు.

మేఘాలయ వికెట్లు టపటపా..!

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: ఆంధ్రా బౌలర్ వాసు (6/54) ప్రత్యర్థి మేఘాలయ బ్యాటింగ్ ఆర్డర్‌ను కుప్పకూల్చాడు. మూలపాడులో జరుగుతున్న అండర్-23 కల్నల్ సీకే నాయుడు క్రికెట్ మ్యాచ్‌లో భాగంగా ఆంధ్రా జట్టు సోమవారం 373 పరుగుల ఓవర్ నైట్ స్కోర్‌తో తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించి 66.4 ఓవర్లలో మూడు వికెట్లను కోల్పోయి 402 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. హర్షవర్ధన్ 161 పరుగులతో క్రీజ్‌లో నిలిచాడు. అనంతరం తొలి ఇన్నింగ్స్ బ్యాటింగ్‌కు దిగిన మేఘాలయ జట్టు 66.4 ఓవర్లలో 184 పరుగులకే ఆలౌటైంది. స్వస్తిక్ (49), కెవిన్ (33) రాణించగా.. ప్రత్యర్థి బౌలర్లు వాసు (6/54), ఇస్మాయిల్ (2/55) మెరిశారు. ఫాలోఆన్‌కు దిగిన మేఘాలయ జట్టు రెండో ఇన్నింగ్స్ ఆట నిలిపే సమయానికి 16 ఓవర్లలో మూడు వికెట్లను కోల్పోయి 23 పరుగులతో కొనసాగుతోంది.


తిరువూరు

● తిరువూరు ● మైలవరం

ప్రతిభకు పదును


పరీక్ష రాస్తున్న విద్యార్థులు

మైలవరం, న్యూస్‌టుడే: ప్రతిభా పాటవ పోటీల్లో పాల్గొనడం ద్వారా విద్యార్థుల్లోని ప్రతిభకు పదును పెరుగుతుందని స్థానిక ఆక్స్‌ఫర్డ్ పాఠశాల కరస్పాండెంట్ వీవీ లక్ష్మి పేర్కొన్నారు. 'ఈనాడు' ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రతిభా పాటవ పరీక్షల్లో భాగంగా సోమవారం ఆ పాఠశాలలో '.. ఇంటర్నెట్ విని యోగం వల్ల లాభనష్టాలు, విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అంశాలపై 8, 9, 10 తరగతి విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఎం.డి.సాయి శ్రీకర్, జీఎన్ఎన్ శ్రీవల్లి, ఎం.పల్లవి మొదటి మూడు స్థానాలు సాధించి బహుమతులు అందుకున్నారు.


విజేతలతో కరస్పాండెంట్ వీవీ లక్ష్మి

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తిరువూరు: 85005 44088 మైలవరం: 80085 74705

స్పందనకు వందనం

★ పట్టణంలోని 6వ వార్డు సచివాలయం పరిధిలో 11వ వార్డులో మధిర రోడ్డులో కాల్వలో మురుగు పేరుకుపోయిందని స్థానికులు మేమున్నాం..మీకు తోడుగాకు చేసిన ఫిర్యాదును ఇన్‌ఛార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ బుర్రి జగదీష్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించి సిబ్బందితో తొలగింపజేశారు.

★ 4వ వార్డు సచివాలయం పరిధిలో 7వ వార్డులో మురుగు నీరు పారుదల కాల్వ పూడుకు పోయిందన్న స్థానికుల ఫిర్యాదును ఇన్‌ఛార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ బుర్రి జగదీష్‌కి తెలుపగా స్పందించి సిబ్బందితో పూడిక తీయించారు.

★ 9వ వార్డు సచివాలయం పరిధిలో 16, 17వ వార్డుల పరిధిలోని వీధుల్లో చెత్త తొలగించలేదని స్థానికుల ఫిర్యాదుకు ఇన్‌ఛార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ బుర్రి జగదీష్ స్పందించి సిబ్బందితో చెత్తను ట్రాక్టర్‌లో వేయించి డంపింగ్ యార్డుకు తరలించారు.

★ 10వ వార్డు సచివాలయం పరిధిలో 19వ వార్డులో కాల్వల్లో పూడిక పేరుకుపోయి మురుగునీరు పారుదల లేదని స్థానికులు చేసిన ఫిర్యాదును ఇన్‌ఛార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ బుర్రి జగదీష్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించి సిబ్బందితో బాగుచేయించారు.

- న్యూస్‌టుడే, తిరువూరు

విద్యుత్తు సరఫరాకు అంతరాయం నేడు

గంపలగూడెం, న్యూస్‌టుడే: మండలంలోని రాజవరం, పెనుగొలను, జింకలపాలెం, రాజులపాలెం, చల్లగుండ్లవారిపాలెం, సత్యాలపాడు, మేడూరు, ఆర్లపాడు, తునికిపాడు, దుందిరాలపాడు, చెన్నవారం గ్రామాల్లో మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్తు సరఫరా ఆపేస్తున్నట్లు డిస్కం ఏఈ జగదీష్ తెలిపారు. కొత్త లైన్ల ఏర్పాటుకు బంద్ చేస్తున్నందున వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఆంధ్రరత్న పురస్కారం అందజేత

జి.కొండూరు: గంగినేని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు పండితుడిగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ పెదగమళ్ల నాగరాజు ఆంధ్రరత్న పురస్కారానికి ఎంపికైన విషయం తెలిసిందే. ఈ మేరకు సోమవారం విజయవాడలో నిర్వహించిన కార్యక్రమంలో అఖిల భారత సాంస్కృతిక సేవా సంస్థ ఛైర్మన్ డాక్టర్ విజయ్‌కుమార్, మెజిస్ట్రేట్ శంకర్ తదితరులు పురస్కారాన్ని నాగరాజుకు అందజేశారు. కార్యక్రమంలో కన్నడ, తెలుగు సినీ నటి పంకజం, కౌన్సిలర్ సునీత, నాట్యకళాకారిణి వాణి తదితరులు పాల్గొన్నారు.

అధిష్ఠానం నిర్ణయం మేరకే ఛైర్మన్ ఎంపిక

కొండపల్లి, న్యూస్‌టుడే: 'కొండపల్లి పురపాలిక ఛైర్మన్ ఎంపికకు ఇంకా సమయం ఉంది. కౌన్సిలర్లు అందరూ పార్టీకి విధేయత కలిగి.. అభివృద్ధికి ప్రభుత్వం కేటాయించిన నిధులను సద్వినియోగ పరచుకోవాలి' అని ఎమ్మెల్యే కృష్ణ ప్రసాద్ అన్నారు. కొండపల్లి కౌన్సిలర్లకు గొల్లపూడి పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఛైర్మన్ ఎన్నికపై అందరూ ఆసక్తిగా ఉండడం సహజమన్నారు. అయితే ఏ ఒక్కరి పట్ల తాను పక్షపాతం చూపడం లేదన్న సంగతి మిగిలిన కౌన్సిలర్లు గ్రహించాలన్నారు. పార్టీ అధిష్ఠానం ప్రతిపాదించిన వ్యక్తికే తాను మద్దతు పలుకుతానన్నారు.

మట్టి అక్రమ తవ్వకందారులపై చర్యలకు వినతి

కృష్ణలంక, న్యూస్‌టుడే: మట్టి అక్రమంగా తవ్వకాలు చేపట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని తెదేపా మైలవరం ఎస్సీ సెల్ కార్యదర్శి మొండెం జమలయ్య, విజయవాడ రూరల్ రైతు నాయకుడు చింతా సుధాకర్ జాయింట్ కలెక్టర్ నిధిమీనాను సోమవారం కలిసి వినతిపత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ... తాడేపల్లి రెవెన్యూ సర్వే నెం.235లో పోతురాజు వెంకటేశ్వర్లు అనే వ్యక్తి భూమిని ఆనుకుని ఉన్న భూమిలో నైన వరం గ్రామానికి చెందిన దావు వెంకటేశ్వరరావు(డి.వి.ఆర్) అనే వ్యక్తి గతంలో అక్రమంగా మట్టి తవ్వకాలు చేసినట్లు భూముల్లో ఆరోపించారు. ప్రభుత్వ కొండవాగు భూముల్లో అక్రమంగా సుమారు 30 నుంచి 40 మీటర్ల లోతున తవ్వుతున్నట్లు గ్రామస్థులు గుర్తించి అడ్డుకునేందుకు ప్రయత్నించినా ఉపయోగం లేకుండా పోయిందన్నారు. పూర్వపు కలెక్టర్ ఆ ప్రాంతంలో పర్యటించి ప్రభుత్వ భూముల్లో మట్టి తవ్విన వారిపై చర్యలు తీసుకోవాలని సీపీని ఆదేశించినప్పటికీ స్పందించలేదని గుర్తుచేశారు. అక్రమ తవ్వకాల వల్ల పొలాలకు వెళ్లాలంటే రైతులు ఆందోళన చెందుతున్నారు, కొత్తూరు గ్రామంలో జీవీఎల ఒకరు పొలానికి వెళ్లి ట్రాక్టర్‌తో కాలువ పడి మృతి చెందినట్లు చెప్పారు. సంబంధిత వ్యక్తిపై చర్యలు తీసుకొని న్యాయం చేయాలని కోరారు.

ఉరుసు మహోత్సవానికి విరాళం

మైలవరం, న్యూస్‌టుడే: స్థానిక డౌన్ సెంటరులో నిర్వహించే ఉరుసు మహోత్సవానికి తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు లంకా లితీష్ రూ.10 వేల విరాళాన్ని సోమవారం నిర్వాహకులకు అందజేశారు.


నీటి ప్లాంటు వద్ద ఇలా


ఊరి మధ్య గుంతలో ద్విచక్ర వాహనదారుడి పాట్లు

అధోగతి.. రహదారుల దుస్థితి

● అధ్వానంగా మారిన గణపవరం ప్రధాన రహదారి

● అవస్థలు పడుతూ ప్రయాణాలు సాగిస్తున్న ప్రజలు

మైలవరం, న్యూస్‌టుడే

గత ప్రభుత్వ నిర్లక్ష్యం మండలంలోని గణపవరానికి శాపంలా మారింది. కందులపాడు నుంచి ఆ ఊరి మీదుగా విసన్నపేట వెళ్లే రహదారి అభివృద్ధికి గత ప్రభుత్వంలోనే రూ.45 కోట్ల నిధులు మంజూరయ్యాయి. కానీ బిల్లుల చెల్లింపుల్లో వైకాపా ప్రభుత్వంపై అపనమ్మకంతో పనులు దక్కించుకున్నా గుత్తేదారు ముందుకు రాలేదు. అప్పటికే తీవ్ర గోతులమయంగా మారిన ప్రధాన రహదారి, ప్రస్తుత వర్షాలకు చేపల చెరువుల్లా తయారయ్యాయి. దాదాపు కిలోమీటరున్నర మేరకు ప్రయాణం చేయాలంటే నాలుగు చక్రాల వాహనాలతో తప్ప, తమ ఊర్లోకి రాలేరంటూ ఆ గ్రామస్థులే నిట్టూర్చుతున్నారు. మైలవరం నుంచి ఆగిరిపల్లి మండల గ్రామాలు, విజయవాడకు, గన్నవరం అంతర్జాతీయ విమానాశ్రయానికి వెళ్లే మార్గం కూడా కావడంతో అటుగా వెళ్లే ప్రయాణికులు అవస్థలు పడుతూ.. నగరం చుట్టూ తిరిగి గన్నవరం చేరుకుంటున్నారంటే రహదారి దుస్థితి అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రహదారుల సమస్య నుంచి కాపాడాలంటూ గ్రామస్థులు విజ్ఞప్తి చేస్తున్నారు.


పాఠశాల వద్ద గోతులు


అదుపుతప్పితే అంతే సంగతి

అధిక ధరలకు అమ్మితే లైసెన్సులు రద్దు

ఈనాడు కథనానికి స్పందన

మైలవరం, న్యూస్‌టుడే: రైతుబజారుల్లో అధిక ధరలకు కూరగాయల అమ్మే ఏ దుకాణం లైసెన్సునైనా రద్దు చేస్తామని మార్కెటింగ్ శాఖ డీడీ పి.లావణ్య పేర్కొన్నారు. 'ధరాభారం మోయలేకున్నాం' శీర్షికన ఆదివారం 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి స్పందించిన ఆమె ఏడీఎం పి.మంగమ్మతో కలిసి సోమవారం స్థానిక రైతుబజారుని పరిశీలించారు. రాయితీపై టమాటాలు, ఉల్లిపాయల సరఫరాపై ఆరా తీశారు. అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు తెలిస్తే వెంటనే వారి లైసెన్సులు రద్దుకు సిఫారసు చేయాలని ఈవో చిట్టిబాబుకు సూచించారు. ధిక్కరించి వ్యవహరించే వారి పట్ల కఠినంగా ఉంటామని, అధిక ధరలకు అమ్మాలనుకుంటే బయటకు వెళ్లిపోవచ్చని సూచించారు.


రాయితీ ఉల్లిపాయల స్టాల్ వద్ద వివరాలు అడుగుతున్న డీడీ పి.లావణ్య, అధికారులు

నేటి నుంచి ఆధార్ శిబిరాలు

విస్సన్నపేట, న్యూస్‌టుడే: మండల పరిషత్ కార్యాలయంలో 22 నుంచి 25వ తేదీ వరకు ఆధార్ నమోదు శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సీహెచ్.చిన్నరాట్నాలు తెలిపారు. 22న విస్సన్నపేట, 23న చంద్రుపట్ల, లంబాడీతండా, తెల్లదేవరపల్లి, పుట్రేల, 24న వేమిరెడ్డిపల్లి, కొర్లమండ, కలగర, మారేమండ, 25న నరసాపురం, తాతకుంట్ల, కొండపర్వ గ్రామాల ప్రజలు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

తిరువూరు, న్యూస్‌టుడే: మండలంలో ఆంజనేయపురం, ముష్టికుంట్లలో 22, 23 తేదీల్లో, కోకిలంపాడు, అక్కపాలెంలో 24, 25 తేదీల్లో ఆధార్ నమోదుకు ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో పీవీఎస్ నాగేశ్వరరావు తెలిపారు.

కొండపల్లి, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు కొండపల్లి పురపాలికలో 6 కేంద్రాల్లో ఆధార్ ప్రత్యేక క్యాంపులను నిర్వహించనున్నామని కమిషనర్ పి.శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం నుంచి శుక్రవారం వరకు ఈ ప్రత్యేక కేంద్రాలు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. పాఠశాలలు, కళాశాలల్లో అపార్(ఏపీఏఏఆర్)ఐడీ నమోదు ప్రక్రియ జరుగుతున్న నేపథ్యంలో విద్యార్థులకు ఆధార్ సవరణలు అవసరమవుతాయన్నారు. అందువల్లే ప్రభుత్వం ఈ ప్రత్యేక కేంద్రాలను నాలుగు రోజుల పాటు ఏర్పాటు చేసిందని తెలిపారు.

తిరువూరు, న్యూస్‌టుడే: నగర పంచాయతీ పరిధిలోని రాజుపేట 1వ వార్డు సచివాలయంలో 22, 23 తేదీల్లో, రాజుపేట నడిం వార్డు సచివాలయంలో 24, 25 తేదీల్లో ఆధార్ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు కమిషనర్ జి.లోవరాజు తెలిపారు.

'ప్రజలపై భారం మోపేందుకు ప్రభుత్వం ప్రణాళిక'


మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

తిరువూరు, న్యూస్‌టుడే: రాష్ట్రంలో విద్యుత్తు వినియోగదారుల నుంచి ట్రూఅప్ ఛార్జీల పేరుతో రానున్న రెండేళ్ల కాలంలో రూ.28 వేల కోట్లు దోపిడీ చేసేందుకు ప్రభుత్వం కుట్ర చేస్తోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఆరోపించారు. ఈ ఏడాది రూ.8వేల కోట్లు, 2025-26లో మరో రూ.20వేలు కోట్లు భారం మోపేందుకు ప్రణాళిక చేసిందన్నారు. తిరువూరు సీపీఎం కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో నిత్యావసరాల ధరలు తగ్గించాలని కోరుతూ నవంబరు 8 నుంచి 15వ తేదీ వరకు ప్రజాపోరు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇసుక కొరతతో భవన నిర్మాణాల యజమానులు, కార్మికులు, చేతి వృత్తిదారులు ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. సీపీఎం నాయకులు ఎం.నాగేంద్రప్రసాద్, కె.కళ్యాణ్, పీవీ.ఆంజనేయులు, ఎస్.నాగేశ్వరరెడ్డి, జి.వెంకటరత్నం సమావేశంలో పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితుల అరెస్టు..

రూ.37 లక్షల సొత్తు స్వాధీనం

మంగళగిరి, న్యూస్‌టుడే: చోరీకి పాల్పడిన ఓ మహిళతో సహా మరో వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. మంగళగిరి గ్రామీణ పోలీసుస్టేషన్‌లో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ మురళీకృష్ణ, సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ వెంకట్ వివరాలు వెల్లడించారు. మిడ్‌వ్యాలీ సిటీలో నివసిస్తున్న డాక్టర్ ఇంట్లో పనిచేస్తోన్న వెంకట రమణ అనే మహిళ దశలవారీగా చోరీకి పాల్పడుతూ వస్తుంది. రోజుకో వస్తువు, నగదును అపహరించుకువెళుతుంది. అనుమానం వచ్చిన సదరు యజమాని ఈ నెల 15న పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు పనిమనిషితోపాటు విజయవాడ సమీపంలోని జక్కంపూడి వైఎస్ఆర్ కాలనీకి చెందిన వేముల వెంకన్న అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించారు. వారి నుంచి సుమారు 30 గ్రాములు బంగారు వస్తువులు, రూ.11.9 లక్షలు నగదు, రూ.1.50 లక్షల విలువైన ద్విచక్ర వాహనం, రూ.1.90 లక్షలు విలువ చేసే రెండు మొబైల్ ఫోన్లు మొత్తం రూ.37 లక్షలు సొత్తును వారి నుంచి స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు.

క్రైమ్ కార్నర్

చికిత్స పొందుతూ ఒకరి మృతి

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న ప్రమాదంలో ఒకరు చికిత్స పొందుతూ మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. .ఆదివారం సాయంత్రం కుదప నుంచి ఓ తల్లి, కుమారుడు ద్విచక్రవాహనంపై పాటియాతండాకు వెళ్తున్నారు. ఈ క్రమంలో ఆజ్మీర నాగరాజు(51) కుదప గ్రామం వస్తుండగా ఎన్ఎస్‌పీ కాల్వ దగ్గరలో రెండు వాహనాలు ఢీకొట్టుకున్నాయి. ఈ ప్రమాదంలో నాగరాజుకు తీవ్ర గాయాలు కావడంతో విజయవాడలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడి కుమారుడు భానుప్రకాశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ యు.శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రమాదంలో యువకుడి దుర్మరణం

విస్సన్నపేట, తిరువూరు: రహదారి ప్రమాదంలో విస్సన్నపేట మండలం తెల్లదేవరపల్లికి చెందిన ఊసిక కృష్ణారావు(32) దుర్మరణం చెందాడు. తిరువూరు మండలం మల్లేల వద్ద సోమవారం రాత్రి సంఘటన చోటు చేసుకుంది. తిరువూరు సీఐ కె.గిరిబాబు తెలిపిన వివరాల మేరకు. ..కృష్ణారావు తన ద్విచక్ర వాహనంపై తిరువూరు నుంచి స్వస్థలమైన తెల్లదేవరపల్లికి వెళ్తుండగా మల్లేల సమీపంలో ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టడంతో లారీ ముందు చక్రం కిందపడి అక్కడికక్కడే మృతిచెందాడు. సీఐ గిరిబాబు తన సిబ్బందితో ప్రమాద స్థలానికి చేరుకుని మృతదేహాన్ని తిరువూరు ప్రభుత్వ ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. భార్య అరుణకుమారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

టిప్పర్ ఢీ..అయ్యప్ప దీక్షధారులకు తీవ్రగాయాలు

గొల్లపూడి, న్యూస్‌టుడే: టిప్పర్ ఢీకొనడంతో ఇద్దరు అయ్యప్ప దీక్షధారులు గాయపడ్డారు. వివరాలిలా ఉన్నాయి...ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం రామాపురానికి చెందిన సురేష్, తమ్మిలు ఎన్టీఆర్‌జిల్లా గొల్లపూడి అయ్యప్పస్వామి ఆలయంలో మాల ధరించేందుకు సోమవారం ఉదయం ద్విచక్రవాహనంపై వచ్చారు. మాల ధరించిన అనంతరం జాతీయరహదారిపై ఇంటికి వెళ్తున్న క్రమంలో పశ్చిమ బైపాస్ వద్దకు వచ్చే సరికి వ్యతిరేక మార్గంలో వచ్చిన టిప్పర్ వారిని ఢీకొట్టింది. దీంతో వారికి తీవ్ర గాయాలు కాగా స్థానికులు 108 వాహనంలో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వ్యతిరేక మార్గంలో వేగంగా వచ్చిన టిప్పర్ ఢీకొట్టడం వల్లే ప్రమాదం జరిగినట్లు అయ్యప్పలు పోలీసులకు తెలిపారు.

గ్రామపార్టీ అధ్యక్షుడిపై కేసు

మైలవరం, న్యూస్‌టుడే: మండలంలోని గణపవరం తెదేపా గ్రామపార్టీ అధ్యక్షుడు ఉమ్మా రమణారెడ్డిపై కేసు నమోదైంది. ఎస్సై కె.సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. గణపవరంలో సీజ్ చేసిన ఇసుక వద్ద నిఘా ఉన్న తమ విధులకు ఆటంకం కలిగేలా వ్యవహరించారంటూ ఆ గ్రామ వీఆర్వో స్రవంతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని తెలిపారు.

జూద శిబిరాలపై దాడి

మైలవరం, న్యూస్‌టుడే: మండలంలోని కొత్తగూడెంలో ఆదివారం సాయంత్రం జూద శిబిరాలపై దాడి చేసి ఐదుగురు వ్యక్తులను, వారి వద్ద నుంచి రూ.4,680 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై కె.సుధాకర్ తెలిపారు.

అమరవీరులకు నివాళి


మౌనం పాటిస్తున్న పోలీసులు

తిరువూరు, న్యూస్‌టుడే: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సోమవారం పోలీస్ అమరువీరుల సంస్మరణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విధి నిర్వహణలో అమరులైన అధికారులు, రక్షకభటులకు ఠాణాలో సిబ్బంది నివాళులర్పించారు. అమరవీరుల ఆత్మకు శాంతి చేకూరాలని మౌనం పాటించారు.

రైతుల సమస్యలు సత్వరమే పరిష్కరిస్తాం

మారేపల్లి(ఎ.కొండూరు), న్యూస్‌టుడే: మండలంలోని మారేపల్లిలో సోమవారం నిర్వహించిన రెవెన్యూ గ్రామసభలో 22 మంది రైతులు అర్జీలు అందజేశారని తహసీల్దారు బి.ఆశయ్య తెలిపారు. గ్రామసభలో రైతులు అందించిన వినతులపై సత్వరమే విచారించి పరిష్కరిస్తామని ఆయన పేర్కొన్నారు. సర్పంచి తాళ్లూరి నాగేశ్వరరావు, రెవెన్యూ ఉద్యోగులు పాల్గొన్నారు.

రాజవరం(గంపలగూడెం), న్యూస్‌టుడే: రాజవరంలో సోమవారం నిర్వహించిన రెవెన్యూ గ్రామసభలో పలు సమస్యలను పరిష్కరించాలని రైతులు తహసీల్దారు వడ్డేశ్వరపు రాజకుమారికి మూడు అర్జీలు అందజేశారు. సర్పంచి సీహెచ్.నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.


ఎ.కొండూరు : అర్జీ స్వీకరిస్తున్న తహసీల్దారు ఆశయ్య

వాముకుంట్ల(తిరువూరు): మండలంలోని వాముకుంట్లలో జరిగిన రెవెన్యూ గ్రామసభలో సర్వే నంబరు, ఎల్‌పీఎం, విస్తీర్ణంలో వ్యత్యాసం, ఖాతా నంబరు, మ్యుటేషన్‌కు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రైతుల నుంచి అధికారులకు 108 అర్జీలు అందాయి. సర్పంచి వి.సత్యనారాయణ, డివిజనల్ సర్వేయర్ ఆర్.వి.సారంగపాణి, ఆర్ఐ బి.మోహన్‌రావు, మండల సర్వేయర్ నల్లిబోయిన గోపాలకృష్ణ, వీఆర్వోలు పాల్గొన్నారు.

చంద్రుపట్ల(విస్సన్నపేట): చంద్రుపట్లలో నిర్వహించిన రెవెన్యూ గ్రామసభలో సమస్యలను పరిష్కరించాలని కోరుతూ 37 మంది రైతులు అర్జీలు అందజేసినట్లు తహసీల్దారు లక్ష్మీకళ్యాణి తెలిపారు.

జి.కొండూరు, న్యూస్‌టుడే: మండలంలోని వెలగలేరులో గతంలో రీసర్వే జరిగిన నర్సాయిగూడేనికి చెందిన భూముల సమస్యలపై రెవెన్యూ అధికారుల సమక్షంలో సోమవారం గ్రామసభ నిర్వహించారు. భూమి విస్తీర్ణానికి సంబంధించిన 3 దరఖాస్తులు రాగా సత్వరమే వాటిని సరిచేస్తామని డిప్యూటీ తహసీల్దార్ విజయ్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గోపి, ఉపసర్పంచి కె.వెంకటరత్నం పాల్గొన్నారు.


రెడ్డిగూడెం: తహసీల్దార్ సుశీలాదేవికి అర్జీలు అందజేస్తున్న రైతులు

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే : కుదప గ్రామ సచివాలయం వద్ద నిర్వహించిన గ్రామసభలో రీసర్వేకు సంబంధించిన సమస్యలపై 25 మంది రైతులు అర్జీలు సమర్పించినట్లు తహసీల్దారు జె.సుశీలాదేవి తెలిపారు. ఆర్ఐ జి.పుల్లయ్య. మండల సర్వేయర్లు, వీఆర్‌వోలు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం(గ్రామీణం, న్యూస్‌టుడే: తుమ్మలపాలెం గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన గ్రామసభలో ముగ్గురు రైతులు గతంలో జరిగిన రీసర్వేలో తమ పొలాల విస్తీర్ణం, పేరు మార్పుల్లో జరిగిన తప్పులను సరిచేయాలని ఉప తహసీల్దారు సుజాతకు వినతి పత్రాలు అందించారు. గ్రామ కార్యదర్శి సరోజిని బాయి, వీఆర్‌వో, రెవెన్యూ, సచివాలయ అధికారులు పాల్గొన్నారు.

ఫిర్యాదులపై విచారణ

ఈనాడు కథనానికి స్పందన

చంద్రగూడెం(మైలవరం) : చంద్రగూడెం సొసైటీపై పలువురు రైతుల ఫిర్యాదుల మేరకు సోమవారం ఆ సంఘం పర్సన్ ఇన్‌ఛార్జి (పీఐసీ) జి.సుజాత విచారణ నిర్వహించారు. 'మరీ ఇంత దారుణమా' శీర్షికన సోమవారం 'ఈనాడు'లో ప్రచురితమైన కథనం నేపథ్యంలో తన పేరిట అధిక మొత్తం రుణం నమోదైందంటూ ఫిర్యాదు చేసిన గ్రామానికి చెందిన తాతా పోతురాజును సంఘ కార్యాలయానికి పిలిచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆమె 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ అంతర్గత విచారణలో వెలుగు చూసిన లోపాల అనంతరం అప్పటి కార్యదర్శి, గుమస్తాలు ఇంకా రూ.33 లక్షలు చెల్లించాలని అధికారుల నుంచి నోటీసులు జారీ చేశామన్నారు. రైతుల నుంచి పూర్తి విచారణ నిమిత్తం మంగళవారం గ్రామంలో టాంటాం వేయిస్తున్నామని, ఇబ్బంది ఉన్న రైతులు సంఘానికి వచ్చి వివరాలు తెలియజేయాలన్నారు.

అవీ ఇవీ

లక్ష్య సాధనకు కష్టపడాలి

మైలవరం: విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సాధించడానికి కష్టపడాలని ఎల్బీఆర్‌సీఈ అసోసియేట్ ప్రొఫెసర్ బి.రాజేంద్రప్రసాద్ సూచించారు. లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపల్ ఇళ్లా రవి, చరిత్ర అధ్యాపకుడు శ్రీనివాసరావు పాల్గొన్నారు

భాజపాలో చేరిక

రెడ్డిగూడెం: అన్నేరావుపేటలో మండల పార్టీ అధ్యక్షుడు బలగాని గోపి ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన కొండెబోయిన నరసింహారావు, కైతేపల్లి దుర్గారావు, మడుగుల సాయికుమార్‌లు సోమవారం భాజపాలో చేరగా వారికి మైలవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి నూతలపాటి బాలకోటేశ్వరరావు(బాల) కండువాలు కప్పి ఆహ్వానించారు.

మధ్యంతర భృతి ప్రకటించండి

మైలవరం: కూటమి ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాల సమస్యల పరిష్కారంలో చొరవ చూపాలని, 30 శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలని ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి ఎం.బసవయ్య కోరారు.

ఆయాలకు ఉద్యోగ భద్రత కల్పించాలి

గంపలగూడెం: ప్రభుత్వ పాఠశాలల్లో ఆయాలకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఏఐటీయూసీ నాయకులు కోరారు. స్థానిక ఎంఈవో కార్యాలయం వద్ద సోమవారం ఆయాలతో కలిసి ధర్నా చేశారు. ఏఐటీయూసీ నాయకులు త్యాగరాజు, నాగుల్‌మీరా, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సామూహిక ఎలుకల నిర్మూలన నేడు

ఎ.కొండూరు, న్యూస్‌టుడే: మండలంలోని రైతు సేవా కేంద్రాల పరిధిలో మంగళవారం సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఏవో టిప్పుసుల్తాన్ తెలిపారు. బ్రోమోడయోలోన్ మందును ఉపయోగించి పంటలను నాశనం చేస్తే ఎలుకలను నిర్మూలకు రైతులు రైతు సేవా కేంద్రాల్లో వీపీఏలను సంప్రదించాలని సూచించారు.

హిజ్రాల వివాదం

కొండపల్లి: హిజ్రాల మధ్య వివాదంతో ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ గందరగోళంగా మారింది. పోలీసుల వివరాల ప్రకారం జాతీయరహదారి సమీపంలోని టీ స్టాల్ వద్ద ఓ హిజ్రా తన బృందం నగదు వసూలు చేసుకొంటానని స్టిక్కర్ అంటించారు. ఈ క్రమంలో ఇబ్రహీంపట్నానికి చెందిన మరో హిజ్రా అక్కడికి వెళ్లి నగదు వసూలు చేయడంతో ఇరువురికి వివాదం నెలకొంది. ఈ విషయాన్ని ఇబ్రహీంపట్నానికి చెందిన హిజ్రా సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేయడంతో వారికి విజయవాడలో హిజ్రాలు మద్దతుగా స్టేషన్‌కు చేరుకోవడంతో వాగ్వాదాలు చోటు చేసుకున్నాయి. సీఐ చంద్రశేఖర్, ఎస్సై పాపారావు కల్పించుకొని వారిని హెచ్చరించి పంపారు.

నష్టపరిహారం అందించండి

కొండపల్లి: కొండవాగు నీటిలో మునిగి నష్టపోయిన తమకు పరిహారం అందించాలని కొండపల్లి శ్రామికనగర్ వాసులు కమిషనర్ శ్రీనివాస్‌ను సోమవారం ఆయన కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందించారు.

రఘునందన్‌కు సత్కారం

తిరువూరు: తిరువూరు రచయితల సంఘం ప్రధానకార్యదర్శి రేపాక రఘునందన్‌ను ఆదివారం రాత్రి తాడేపల్లిగూడెంలో జరిగిన 24 గంటల కవి సమ్మేళనంలో నిర్వాహకులైన శ్రీశ్రీ కళావేదిక ప్రతినిధులు సత్కరించారు. కవి సమ్మేళనంలో అన్నదాతల సమస్యలపై ఆయన చదివిన కవిత ఆకట్టుకుంది. రఘునందన్ ప్రతిభను గుర్తించిన నిర్వాహకులు సన్మానించారు.

విజయవాడ తూర్పు

ఇద్దరు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ల బదిలీ

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ విభాగంలో సుదీర్ఘకాలంగా పని చేస్తున్న ఇద్దరు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లను ప్రభుత్వం బదిలీ చేసింది. సర్కిల్-1 పరిధిలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా పని చేస్తున్న ఎ.ఎస్.ఎన్. ప్రసాద్‌ను గుడివాడ పురపాలక సంఘానికి, సర్కిల్-2 పరిధిలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా విధులు నిర్వహిస్తున్న వి.చంద్రశేఖర్‌ను మచిలీపట్నం మున్సిపల్ కార్పొరేషన్‌కు పంపించింది. వారిని రిలీవ్ చేస్తూ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాలిచ్చారు.

కనీస వేతన చట్టం అమలు చేయాలి

చుట్టుగుంట, న్యూస్‌టుడే: నగరపాలక సంస్థ పారిశుద్ధ్య కార్మికులకు కనీస వేతన చట్టం అమలు చేయాలని ఏఐటీయూసీ నగర ప్రధాన కార్యదర్శి మూలి సాంబశివరావు డిమాండ్ చేశారు. విశాలాంధ్ర రోడ్డులోని బ్రహ్మానందరెడ్డి నగర్ శానిటరీ కార్యాలయం వద్ద సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వరదల్లో పారిశుద్ధ్యం మెరుగుదలకు శ్రమించిన శుద్ధ్య కార్మికులకు ఒక నెల జీతం అదనంగా చెల్లించాలన్నారు. కార్మికులకు సాధించుకున్న ప్రతి రాయితీలో ఏఐటీయూసీ కృషి ఉందని స్పష్టం చేశారు. నాయకులు కేజర్ ఆంజనేయులు, బుద్ధ రాజా, జెశ్శి, జేమ్స్, తుపాకుల నాగేశ్వరరావు, తుపాకుల ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభతో మెరిసి.. విజేతగా నిలిచి..

కృష్ణలంక, విజయవాడ సిటీ, న్యూస్‌టుడే: విజయవాడ రాణిగారితోటలోని కెన్ ఉన్నత పాఠశాల, గురునానక్ కాలనీలోని సిటీ జన్స్ హైస్కూల్‌లో సోమవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీ నిర్వహించారు. 'ఇంటర్నెట్ వినియోగం వల్ల లాభన ష్టాలు.. విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అనే అంశంపై వ్యాసరచన పోటీ ఏర్పాటు చేశారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కెన్ పాఠశాలలో విజేతలుగా నిలిచిన కె.నాగ గీతికారెడ్డి, ఎం.మహేశ్వరి, యు.కావ్యలకు ప్రిన్సిపల్ షేక్ మున్నూర్, ఇన్‌ఛార్జి పి.దుర్గారమేష్ బహుమతులు అందజేశారు. సిటిజన్స్ పాఠశాలలో విజేతలుగా నిలిచిన ఎన్.లోహిత (పదో తరగతి), కె.సౌజన్య (పదో తరగతి), ఎస్.హర్షిణి (తొమ్మిదో తరగతి)లకు ప్రిన్సిపల్ జి.లక్ష్మి బహుమతి ప్రదానం చేశారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపల్ షేక్ మున్నూర్, ఇన్‌ఛార్జ్ దుర్గారమేష్



గెలుపొందిన వారికి బహుమతి ప్రదానం చేస్తున్న ప్రిన్సిపల్ జి.లక్ష్మి

సృజన అద్వితీయం

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే

విద్యార్థులు చదువుతో పాటు తమకు ఆసక్తి ఉన్న రంగంలో కూడా రాణిస్తున్నారు. నైపుణ్యాలు మెరుగుపరుచుకొని.. సృజనాత్మకంగా ఆలోచించి విద్యాపరమైన పోటీలో పాల్గొని బహుమతులు కైవసం చేసుకుంటున్నారు. ఆ ప్రతిభతో కొలువులు కూడా సాధిస్తున్నారు. వ్యాపార, పారిశ్రామిక రంగంలోనూ ప్రగతి పథంలో పయనిస్తున్నారు. విద్యార్థులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో స్థానిక సిద్ధార్థ మహిళా కళాశాల ఆంగ్ల విభాగం, లిటరరీ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో 'అద్వితీయ-2024' పేరుతో ఇంటర్ కాలేజియేట్ అకడమిక్ పోటీలు సోమవారం కళాశాలలో నిర్వహించారు. వివిధ కళాశాలల విద్యార్థులు ప్రతిభ చూపి బహుమతులను గెలిచారు.



పోస్టర్లు సిద్ధం చేస్తున్న విద్యార్థినులు

వివిధ పోటీల్లో సత్తా...

వ్యాసరచన, చిత్రలేఖనం పోటీల్లో ప్రతిభ చూపారు. లఘు చిత్రాలు, యాడ్ ఫిల్మ్ మేకింగ్‌లో నటనతో ఆకట్టుకున్నారు. కొలాజ్ మేకింగ్‌లో నైపుణ్యం ప్రదర్శించారు. వ్యాపార రంగంలో రాణింపుపై వర్ణించారు. భావవ్యక్తీకరణ నైపుణ్యాలు ఎలా వృద్ధి చేసుకోవాలో తెలియజేశారు. వినూత్న ఆలోచనలతో పోస్టర్ ప్రజెంటేషన్ చేశారు. సంప్రదాయ కళలు ప్రదర్శించి భళా అనిపించారు.

సమాజానికి సందేశమిచ్చేలా..



చిన్నప్పటి నుంచి సినిమాలు చూడటం ఇష్టం. దర్శకుడు కావాలని అనుకుంటున్నా. అందుకు అనుగుణంగా ప్రస్తుతం లఘు చిత్రాలు తీస్తున్నాను. ప్లాస్టిక్ వల్ల అనర్థాలు, కాలుష్యం వల్ల కలిగే నష్టాలు, మొక్కల పెంపకం ఆవశ్యకత తదితర అంశాలపై పలు సందేశాత్మక లఘు చిత్రాలు తీస్తున్నాను. - ఎస్.మహేశ్‌బాబు, నలంద డిగ్రీ కళాశాల

ఆత్మవిశ్వాసం పెరిగింది - పవన్‌కుమార్, కేబీఎన్ డిగ్రీ కళాశాల



ఇంటర్ నుంచి పోటీలకు హాజరవుతున్నా. వ్యాసరచన, వక్తృత్వం, కొలాజ్ మేకింగ్, పోస్టర్ ప్రజెంటేషన్ పోటీల్లో బహుమతులు సాధించా. పోటీల వల్ల ఆత్మవిశ్వాసం పెరిగింది. పరీక్షల్లో మార్కులతో పాటు బహుమతి ప్రతిభ ఉన్న వారిని బహుళజాతి సంస్థలు కొలువులకు ఎంపిక చేస్తున్నాయి. ఇలా కూడా మాకు ప్రయోజనం.

పోటీతత్వం అలవడుతుంది - వి.సింధు, పీబీ సిద్ధార్థ కళాశాల



వివిధ ప్రాంతాల్లో జరిగే పోటీలకు వెళ్లడం వల్ల సృజనాత్మకత, నైపుణ్యాలు పెంపొందుతాయి. పోటీతత్వం అలవడుతుంది. పరాజయం చెందితే లోపాలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకుంటాం. స్నేహపూర్వకమైన సంబంధాలు మెరుగుపడతాయి. చాలా అంశాలు తెలుసుకోవచ్చు. కొన్నింటికి పంచుకోవచ్చు.

నత్తనడకన సీసీ రోడ్డు నిర్మాణం

పటమట, న్యూస్‌టుడే: 13వ డివిజన్ బ్రహ్మం వీధిలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఈ ఏడాది ఆగస్టులో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, కార్పొరేటర్ ముమ్మనేని ప్రసాద్ సీసీ రోడ్డు నిర్మించేందుకు శంకుస్థాపన చేశారు. రోడ్డు తవ్వి గ్రావెల్ వేసి అలాగే వదిలేశారు. దాదాపు రెండు నెలలు గడిచినా పనులు ప్రారంభించలేదు. ఆ రోడ్డులో నివసిస్తున్న ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పనులు వెంటనే ప్రారంభించాలని స్థానికులు సోమవారం వీఎంసీ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు.

సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అందిన ఫిర్యాదులను విభాగాధిపతులు స్వయంగా పరిశీలించి పరిష్కరించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు. నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. కమిషనర్ మాట్లాడుతూ.. విభాగాధిపతులంతా తమ పరిధిలోని సచివాలయ సిబ్బందిని సమన్వయం చేసుకుంటూ త్వరగా సమస్యలు పరిష్కరించాలన్నారు. ఆస్తి పన్ను, రహదారి ఆక్రమణ, సిమెంట్ రోడ్డు నిర్మాణం, ఆక్రమ నిర్మాణాలు, తాగునీటి సమస్య, బడ్డీకొట్టు తొలగింపు, మొగల్రాజపురంలో బాబూ జగ్జీవన్‌రామ్ సామాజిక భవనం తాళాలు అప్పగించాలంటూ వినతులు అందాయి. అధికారులు డి.చంద్రశేఖర్, జీవీజీఎస్‌వీ ప్రసాద్, శ్రీనాథ్‌రెడ్డి, జి.సృజన, సురేష్‌బాబు, పి.సత్యనారాయణ, సత్యకుమార్, మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

80085 74652

స్పందనకు వందనం

❖ మూడో డివిజన్ శ్రీరామచంద్రనగర్ నుంచి కరెన్సీనగర్ బాయన బాబూజీ దారిలో తాగునీటి పైపు లీకేజీ అవుతోందని స్థానిక నివాసి శ్రీనివాసరావు మేమున్నాం... మీకు తోడుగా ద్వారా ఏఈ నాగేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన మరమ్మతులు చేయించారు.

❖ గుణదల కుమ్మరి బజార్ 2-27/96 విద్యుత్ స్తంభానికి ఉన్న దీపం వెలగడం లేదని స్థానిక నివాసి శివరామకృష్ణ మేమున్నాం. ..మీకు తోడుగా ద్వారా ఏఈ ప్రభాకర్‌రావు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన కొత్త దీపాన్ని ఏర్పాటు చేయించారు.

? పటమట లక్ష్మి హాస్పిటల్ రోడ్డు 72-5-20 ఇంటి ఎదురుగా భూగర్భ డ్రైనేజీ మ్యాన్‌హోల్ నుంచి మురుగు నీరు లీకేజీ అవుతోంది - **వేమూరి సుధారాణి**

✔ పరిశీలించి చర్యలు తీసుకుంటాం - **జశ్వంత్, ఏఈ**

? క్రీస్తురాజపురం విజయనగర్ కాలనీ కొండపైన 5-15/31 విద్యుత్తు స్తంభానికి దీపం వెలగడం లేదు. - **సుబ్బారావు**

✔ కొత్త దీపాన్ని ఏర్పాటు చేస్తాం - **ప్రభాకర్‌రావు, ఏఈ**

- న్యూస్‌టుడే, కరెన్సీనగర్

తెదేపాలోకి ముగ్గురు వైకాపా కార్పొరేటర్లు



ఎంపీ శివనాథ్, ఎమ్మెల్యే ఉమాలతో కార్పొరేటర్లు లక్ష్మీపతి, రమాదేవి, తిరుపతమ్మ తదితరులు

పటమట, న్యూస్‌టుడే: విజయవాడలో వైకాపాకు వరుస ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. గతంలో పశ్చిమ నియోజకవర్గానికి చెందిన ముగ్గురు వైకాపా కార్పొరేటర్లు ఎంపీ కేశినేని శివనాథ్ సమక్షంలో తెదేపాలో చేరారు. సోమవారం సెంట్రల్ నియోజకవర్గానికి చెందిన వైకాపా కార్పొరేటర్లు కె.లక్ష్మీపతి, రమాదేవి, తిరుపతమ్మ తమ అనుచరులతో కలిసి తెదేపా తీర్థం పుచ్చుకున్నారు. వారికి ఎంపీ శివనాథ్, సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. తమది మంచి ప్రభుత్వమని ప్రజలు విశ్వసిస్తున్నారని పేర్కొన్నారు. విజయవాడకు వరద వచ్చినప్పుడు సీఎం చంద్రబాబు స్పందించిన తీరు అద్భుతమని కొనియాడారు. కూటమి ప్రభుత్వంతోనే ప్రజలు కష్టాలు తీరుతాయని భావిస్తున్న వైకాపా నాయకులు తెదేపాలో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారని అన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ... వరద ప్రాంతాల్లో చంద్రబాబు చేసిన సేవలు చూసి వైకాపా నాయకులే మెచ్చుకుంటున్నారని పేర్కొన్నారు. ప్రజాసేవ పట్ల అంకిత భావం ఉన్న వారినే పార్టీలో చేర్చుకుంటున్నామని వెల్లడించారు. కూటమి నాయకులతో కలిసి డివిజన్ల అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. తెదేపా నాయకులు బొప్పన భవకుమార్, నవనీతం సాంబశివరావు, చెన్నుపాటి ఉషారాణి, మాదిగాని గురునాథం, రమణ, సొంగా సంజయ్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

వీధి విక్రయదారులను ఆదుకోండి



కమిషనర్‌కు వినతి పత్రం అందిస్తున్న సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: బుడమేరు వరద ముంపు బారిన పడి నష్టపోయిన వీధి విక్రయదార్లను ఆదుకోవాలని నగర సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు కమిషనర్ ధ్యానచంద్రను నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో సోమవారం కలిసి వినతి పత్రం సమర్పించారు. సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ... బుడమేరు వరదకు 32 డివిజన్లు ముంపు బారిన పడ్డాయని, ఆ సమయంలో నష్టపోయిన వీధి విక్రయదార్లను ఆదుకుంటామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారని గుర్తు చేశారు. హుద్‌హుద్ తుపాను సమయంలో విశాఖపట్నంలో నష్టపోయిన చిరు వ్యాపారులకు రూ.10 వేల చొప్పున ఆర్థిక సాయం అందించారని గుర్తు చేశారు. అదేవిధంగా ఇక్కడ వారికి కూడా ఆర్థిక సాయం చేయాలని కోరారు. వరద సమయంలో సేవలు అందించిన పారిశుద్ధ్య కార్మికులకు ఒక నెల వేతనాన్ని బోనస్‌గా ఇవ్వాలని కోరారు. నాయకులు కె.ఆర్.ఆంజనేయులు, ఎం.సాంబశివరావు, టి.వెంకటేశ్వరరావు, మారుతీరావు తదితరులు పాల్గొన్నారు.

కాలుష్య రహితంగా నగరం

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగరాన్ని కాలుష్య రహితంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర వెల్లడించారు. మినిస్ట్రీ ఆఫ్ హౌసింగ్ అండ్ అర్బన్ అఫైర్స్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సుకు నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయం నుంచి సోమవారం ఆయన హాజరయ్యారు. అనంతరం అధికారులతో కమిషనర్ సమావేశమై చర్చించారు. ఆపై మాట్లాడుతూ.. నగరంలో కాలుష్యాన్ని కనిష్ఠ స్థాయికి తెచ్చేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. తాగునీటి సరఫరా మెరుగుపర్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని, వాడుక నీటి శుద్ధిపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని అన్నారు. నగరంలో పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. మినిస్ట్రీ ఆఫ్ హౌసింగ్ అండ్ అర్బన్ అఫైర్స్ ప్రతినిధుల సూచనలకు అనుగుణంగా ముందుకు సాగాలని తెలిపారు. అధికారులు శ్రీనాథ్‌రెడ్డి, పి.సత్యకుమార్, వెంకటేశ్వరరెడ్డి, బి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే రామ్మోహన్‌కు చెక్ అందజేస్తున్న మృత్యుంజయరావు, లక్ష్మీప్రసూనాంబ

అన్న క్యాంటీన్‌లకు విరాళం

పటమట, న్యూస్‌టుడే: అన్న క్యాంటీన్‌కు తూర్పు నియోజకవర్గం జేడీ నగర్‌కు చెందిన దంపతులు చిగురుపాటి మృత్యుంజయరావు, లక్ష్మీప్రసూనాంబ రూ.లక్ష విరాళం ప్రకటించారు. సోమవారం అశోక్‌నగర్‌లోని పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌ను కలిసి చెక్ అందజేశారు. విరాళం ఇచ్చిన దంపతులను ఆయన అభినందించారు. కార్పొరేటర్ ముమ్మనేని ప్రసాద్, జేడీ నగర్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులు బహుముఖ ప్రతిభ చూపాలి


లబ్బీపేట (విజయవాడ సిటీ), న్యూస్‌టుడే : విద్యార్థులు విద్యతో పాటు కళల్లోనూ రాణిస్తూ బహుముఖ ప్రతిభ కనబరచాలని రైటర్స్ వాయిస్ వ్యవస్థాపకుడు టి.సుజిత్ అన్నారు. సిద్ధార్థ మహిళా కళాశాల ఆంగ్ల విభాగం ఆధ్వర్యంలో 'అద్వితీయ-2024' పేరుతో ఇంటర్ కాలేజియేట్ అకడమిక్ పోటీలు సోమవారం నిర్వహించారు. వివిధ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ప్రిన్సిపల్ ఎస్.కల్పన, ప్రత్యేకాధికారి ఆర్.మాధవి తదితరులు పాల్గొన్నారు. ముఖ్య అతిథులుగా సిద్ధార్థ కళాశాల పూర్వ డైరెక్టర్ టి.విజయలక్ష్మి, స్పీకింగ్ ట్రీ ఫైనాన్స్, అకడమిక్స్ డైరెక్టర్ వై.సాయికృష్ణ హాజరయ్యారు.





విద్యార్థినికి ధ్రువపత్రం అందజేస్తున్న ప్రిన్సిపల్ కల్పన, మాధవి, పక్కన సుజిత్

'దళితులపై దాడి చేస్తున్నా చర్యలు కరవు'

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే : రాష్ట్రంలో దళితులపై దాడులు, హత్యలు జరుగుతున్నా.. రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అండ్ర మల్యాద్రి, న్యాయవాది పొత్తూరి సురేష్‌కుమార్, రైల్వే ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం కార్యదర్శి జి.పాపారావు, డీఎస్ఎంఎం జాతీయ నాయకుడు శైలేంద్ర సోమవారం దిల్లీలో జాతీయ ఎస్సీ కమిషన్ ఛైర్మన్ కుశలవ కుమార్, డైరెక్టర్ వడ్డేపల్లి రామచంద్రను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. చాలా కేసుల్లో పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేయడం లేదని, కౌంటర్ కేసులు పెట్టి దళితులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.







వినువీధిలో కనువిందు

పున్నమి ఘాట్‌లో డ్రోన్ షోకు సర్వం సిద్ధమైంది. మంగళవారం బుల్లి విహంగాల ప్రదర్శన నేపథ్యంలో సోమవారం రాత్రి నిర్వాహకులు ట్రయల్ రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆకాశంలో వేలాది డ్రోన్లు వివిధ ఆకారాల్లో కనువిందు చేశాయి. వినువీధిలో ఒక్కసారిగా వెలుగులు రావడంతో ప్రజలు ఆసక్తిగా తిలకించారు. - భవానీపురం, న్యూస్‌టుడే





డ్రోన్‌లు ఉంచేందుకు అమర్చిన కార్పెట్‌లు



పోలీసు సిబ్బందికి సూచనలిస్తున్న ఉన్నతాధికారులు

అందుబాటులో ఆధునిక వస్త్రాలు

మొగల్రాజపురం (చుట్టుగుంట), న్యూస్‌టుడే : మొగల్రాజపురం నిమ్మతోట కూడలిలో 'హైఫ్స్ వి సిల్క్స్'ను సోమవారం వైభవంగా ప్రారంభించారు. ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, బొండా ఉమామహేశ్వరరావు, శ్రీదుర్గామల్లేశ్వర దేవస్థానం ఈవో రామారావులు అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఇప్పటి వరకు శ్రీకాళహస్తి వస్త్ర ప్రేమికులను అలరిస్తున్న 'హైఫ్స్ వి సిల్క్స్'.. ఇప్పుడు విజయవాడ నగరవాసుల చెంతకు వచ్చినట్లు చెప్పారు. దేశవ్యాప్తంగా ప్రఖ్యాతిగాంచిన కంచి, బెనారస్, సికో, కోట, బగాకోపురి మొదలైన చీరలు, పట్టు వస్త్రాలను ఆధునిక డిజైన్లలో అందిస్తున్నట్లు షోరూమ్ జనరల్ మేనేజర్ ఎం.భరత్ తెలిపారు. కార్యక్రమాన్ని దిగ్విజయం చేసిన ప్రతి ఒక్కరికీ షోరూమ్ ఛైర్మన్ పి.ఎస్.పెరుమాళ్ల రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. పలువురు పురప్రముఖులు, శ్రేయోభిలాషులు, వినియోగదారులు పాల్గొన్నారు.



షోరూమ్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఉమామహేశ్వరరావు. పక్కన ఈవో రామారావు, ఛైర్మన్ పెరుమాళ్లరెడ్డి

నిత్యాన్నదానానికి విరాళం

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం నిత్యాన్నదాన పథకానికి విజయవాడ అయ్యప్ప నగర్‌కు చెందిన కొల్లూరి విజయలక్ష్మి దంపతులు రూ.1,11,111 విరాళాన్ని సోమవారం అందజేశారు. దేవస్థానం ఈవో రామారావు, డిప్యూటీ ఈవో రత్నంరాజు వారికి అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

కృష్ణా వర్సిటీ బ్యాడ్మింటన్ విజేత పీబీ సిద్ధార్థ

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: స్థానిక పీబీ సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఆధ్వర్యంలో జరిగిన కృష్ణా విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల బ్యాడ్మింటన్ (పురుషుల) పోటీలు, వర్సిటీ జట్టు ఎంపిక పోటీల్లో ఆతిథ్య కళాశాల జట్టు విన్నర్ ట్రోఫీ కైవసం చేసుకుంది. సోమవారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో పీబీ సిద్ధార్థ కళాశాల జట్టు ఏఎన్నార్ కళాశాల (గుడివాడ) జట్టుపై విజయం సాధించింది. తృతీయ స్థానం కానూరులోని ఎస్వీడీ న్యాయ కళాశాల జట్టు కైవసం చేసుకుంది. బహుమతి ప్రదానోత్సవానికి కళాశాల పీజీ డీన్ రాజేష్ సి.జంపాల, వాసిరెడ్డి నాగేశ్వరరావు (పీడీ, కేవీఆర్ కళాశాల, నందిగామ), ఆర్.రఘురామ్ (పీడీ, సప్తగిరి కళాశాల, విజయవాడ) హాజరై విజేతలకు ట్రోఫీలు బహూకరించారు. కళాశాల వ్యాయామ విద్యా విభాగాధిపతి టీవీబీ కృష్ణారెడ్డి పర్యవేక్షించారు.



రాజేష్ సి.జంపాల నుంచి విన్నర్ ట్రోఫీ అందుకుంటున్న పీబీ సిద్ధార్థ కళాశాల జట్టు కెప్టెన్, పీడీ కృష్ణారెడ్డి

జిమ్నాస్ట్ కీర్తనకు అభినందన

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: స్థానిక ఎస్‌డీఎం సిద్ధార్థ మహిళా జూనియర్ కళాశాలలో విద్యనభ్యసిస్తున్న ఎస్.కీర్తన రాష్ట్ర స్థాయి జిమ్నాస్టిక్స్ ఛాంపియన్‌షిప్‌లో సత్తా చాటి పలు పతకాలు కైవసం చేసుకోవడంతో పాటు వ్యక్తిగత ఆల్‌రౌండ్‌లో పసిడి పతకాన్ని కైవసం చేసుకుందని ప్రిన్సిపల్ ఎస్.పద్మజ తెలిపారు. ఈ నెల 17 నుంచి 19వ తేదీ వరకు గుంటూరులో జరిగిన రాష్ట్ర స్థాయి జిమ్నాస్టిక్స్ ఛాంపియన్‌షిప్‌లో జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించిన కీర్తన ఫ్లోర్ ఎక్సైజ్‌లో పసిడి, బీమ్, అన్-ఈవెన్ బార్‌లో రజత పతకాలు సొంతం చేసుకుంది. సోమవారం కళాశాలలో కీర్తనను అధ్యాపకులు, విద్యార్థినులు అభినందించారు.



పతకాలు సాధించిన కీర్తనతో పద్మజ

23 నుంచి వర్సిటీ అంతర్ కళాశాలల కబడ్డీ టోర్నీ

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: స్థానిక ఎస్సార్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో ఈ నెల 23, 24వ తేదీల్లో కృష్ణా విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల పురుషుల కబడ్డీ పోటీలు, వర్సిటీ జట్టు ఎంపిక చేస్తామని ప్రిన్సిపల్ కె.భాగ్యలక్ష్మి తెలిపారు. టోర్నీలో పాల్గొనే జట్లు ఈ నెల 23వ తేదీ ఉదయం 8 గంటల్లోపు మూడు సెట్ల అర్హతా పత్రాలతో పాటు క్రీడాకారుల గుర్తింపు కార్డులతో కళాశాల వ్యాయామ విద్యాసంచాలకుడు డి.యుగంధర్‌కు రిపోర్టు చేయాలన్నారు. వ్యక్తిగతంగా పోటీలో పాల్గొనే క్రీడాకారులు తగు అర్హత పత్రాలతో అదే రోజు ఉదయం 11 గంటలకు టోర్నీ కార్యనిర్వాహక కార్యదర్శి వద్ద హాజరు కావాలని చెప్పారు. మరిన్ని వివరాలకు 94401 96634 నంబరులో సంప్రదించాలని సూచించారు.

ఎస్‌జీఎఫ్ జాతీయ రెజ్లింగ్ పోటీలకు రాష్ట్ర జట్లు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌లో ఈ నెల 23 నుంచి 27వ తేదీ వరకు జరిగే స్కూల్ గేమ్స్ సమాఖ్య (ఎస్‌జీఎఫ్) జాతీయ స్థాయి అండర్-19 బాలబాలికల రెజ్లింగ్ పోటీల్లో పాల్గొనే రాష్ట్ర జట్లు సోమవారం నగరం నుంచి పయనమయ్యాయని ఎస్‌జీఎఫ్ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు తెలిపారు. క్రీడాకారులకు రాష్ట్ర ప్రభుత్వం కిట్లు, ప్రయాణ, దినసరి భత్యాలు అందజేసినట్లు చెప్పారు. జాతీయ పోటీల్లో పాల్గొనే క్రీడాకారుల వివరాలు వెల్లడించారు. జట్లకు కోచ్‌లుగా బి.ఉదయకుమార్, కె.వెంకటకృష్ణ, పి.ఆనంద్‌కుమార్, మేనేజర్‌గా పి.సుధ వ్యవహరిస్తారని ఆయన పేర్కొన్నారు.



ఎంపికైన రాష్ట్ర క్రీడాకారులు

మహిళలకు ఉచిత డ్రైవింగ్ శిక్షణ

చిట్టినగర్, న్యూస్‌టుడే: మహిళలకు ఉచితంగా ద్విచక్ర వాహనం డ్రైవింగ్ శిక్షణ ఇస్తున్నట్లు కేబీఎన్ కళాశాల ప్రిన్సిపల్ జి.కృష్ణవేణి తెలిపారు. కొత్తపేటలోని కేబీఎన్ కళాశాల ఉమెన్ స్టడీ సెంటర్ ఆధ్వర్యంలో ద్విచక్రవాహనం శిక్షణకు సంబంధించిన కరపత్రాలను హిందూ హైస్కూల్స్ ఏవో నారాయణరావు చేతుల మీదుగా సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలకు ద్విచక్ర వాహనం డ్రైవింగ్ శిక్షణ ఈ నెల 25వ తేదీ నుంచి ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న మహిళలు, యువతులు కళాశాలలో సంప్రదించాలని సూచించారు. వైస్ ప్రిన్సిపల్స్ ఎం.వెంకటేశ్వరరావు, పీఎల్.రమేష్, ఉమెన్ స్టడీ సెంటర్ కన్వీనర్ వి.శైలజ, తదితరులు పాల్గొన్నారు.

ఓర్వలేకే అసత్య ప్రచారం

పటమట, న్యూస్‌టుడే: మాజీ సీఎం జగన్‌కు చేతకాని అభివృద్ధిని ముఖ్యమంత్రి చంద్రబాబు చేసి చూపిస్తున్నారని, ఓర్వలేకే వైకాపా నేతలు ప్రభుత్వంపై అసత్య ప్రచారం చేస్తున్నారని తెదేపా విజయవాడ పార్లమెంట్ కార్యదర్శి కొట్టేటి హనుమంతరావు అన్నారు. సోమవారం గురునానక్ కాలనీలోని ఎన్టీఆర్ భవన్‌లో ఆయన మాట్లాడుతూ... గత ప్రభుత్వంలో ఇసుక, మద్యం ద్వారా భారీ స్థాయిలో అవినీతి జరిగిందని, జగన్ తన జేబులు నింపుకునేందుకు నాసిరకమైన మద్యాన్ని సరఫరా చేశారని ఆరోపించారు. అందుబాటు ధరలో నాణ్యమైన మద్యం అందించాలనే లక్ష్యంతో సీఎం చంద్రబాబు నూతన పాలసీ తీసుకొచ్చారని పేర్కొన్నారు. జగన్ అసత్య ప్రచారాన్ని నమ్మేందుకు ప్రజలు సిద్ధంగా లేరన్నారు. నాయకులు ఎం.డి.ఇర్ఫాన్, దోమకొండ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

నందిగామ

•నందిగామ •జగ్గయ్యపేట

మిర్చి రైతులకు అవగాహన



మాట్లాడుతున్న శాస్త్రవేత్త రాజశేఖర్

వత్సవాయి: మిర్చి పంట సాగులో రైతులు సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ శాస్త్రవేత్త రాజశేఖర్ తెలిపారు. గరికపాడు కేవీకే ఆధ్వర్యంలో గోపినేనిపాలెంలో మిరప సాగుదారులకు శిక్షణ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. మిరప పంటను నాశనం చేసే పురుగు, తెగుళ్ల నివారణపై రైతులు దృష్టి సారించాలన్నారు. దోమను అరికట్టేందుకు జిగురు అట్టలు పెట్టుకోవాలని చెప్పారు. సర్పంచి శ్రీనివాసరావు, శాస్త్రవేత్తలు వెంకట్ రెడ్డి, జస్వంత్‌రెడ్డి, రాకేష్, రైతులు పాల్గొన్నారు.

వైభవంగా సత్తెమ్మతల్లి రథోత్సవం

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే: పట్టణంలోని ఆర్టీసీకాలనీ సత్తెమ్మతల్లి దేవాలయం వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం అమ్మవారికి రథోత్సవం నిర్వహించారు. మహిళలు కోలాట నృత్యాలతో అలరించారు.



ఆకట్టుకున్న మహిళల కోలాటం

బాధితులకు ఆర్థిక చేయూత



ఎల్‌ఓసీలు అందజేస్తున్న ఎమ్మెల్యే తాతయ్య

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే: పట్టణానికి చెందిన ఇద్దరికి అవసరమైన వైద్య ఖర్చులకు సీఎంఆర్‌ఎఫ్ నుంచి మంజూరైన రూ.5.67 లక్షల ఎల్‌ఓసీ చెక్కులను ఎమ్మెల్యే శ్రీరాంతతయ్య లబ్ధిదారులకు అందజేశారు. పట్టణంలోని కొలిమి బజార్‌కి చెందిన గాజర్ల సంతోష్ వర్మ మూత్రపిండాల వ్యాధితో బాధపడుతూ శస్త్రచికిత్స అత్యవసరమని తెలియజేయడంతో ఆయనకు రూ.3.5 లక్షల వైద్య సహాయాన్ని ప్రభుత్వ లేఖ ద్వారా అందించారు. చినమోదుగుపల్లి గ్రామానికి చెందిన బొజ్జ వెంకటేశ్వరరావు మోకాళ్ల శస్త్రచికిత్స నిమిత్తం రూ.2.17 లక్షల ఎల్‌ఓసీని సోమవారం తన స్వగృహంలో ఆయన అందజేశారు. శ్రీరాంసాయి ప్రసాద్, కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రాలు అసంపూర్తి!

కంచికచర్ల, న్యూస్‌టుడే

గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ భారత్ విలేజ్ హెల్త్ క్లినిక్‌ల నిర్మాణం ప్రతి చోటా పూర్తి కాలేదు. గత వైకాపా ప్రభుత్వ అసమర్థ విధానాలతో అవి అక్కరకు రాకుండా పోయాయి. కాలానుగుణ వ్యాధులకు తోడు ఇటీవల విజృంభిస్తున్న వైరల్ జ్వరాలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అందుబాటులో సరైన వైద్య



నిరుపయోగంగా గండేపల్లి విలేజ్ హెల్త్ క్లినిక్

సదుపాయాలు లేక ప్రైవేటు ఆసుపత్రులపై ఆధారపడి జేబులు ఖాళీ చేసుకున్నారు. గత రెండు నెలలుగా ప్రైవేటు ఆసుపత్రుల్లో జ్వరాలతో చికిత్స పొందుతున్న వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. నందిగామ నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో మొత్తం 42 ఆయుష్మాన్ భారత్ కేంద్రాల నిర్మాణానికి అప్పటి అధికారులు ప్రతిపాదనలు పంపారు. ఒక్కో కేంద్రానికి సుమారు

నందిగామ నియోజకవర్గంలో ఆయుష్మాన్ భారత్ కేంద్రాల వివరాలు					
మండలం	మొత్తం ఆరోగ్య కేంద్రాలు	అంచనా వ్యయం (రూ.లక్షల్లో)	పూర్తి	నిర్మాణం మొదలు కానివి	నిలిచిన పనులు
చందర్లపాడు	12	246.30	8	2	2
నందిగామ	09	183.90	3	3	3
కంచికచర్ల	09	167.40	1	4	4
వీరులపాడు	12	219.90	2	7	3

నిధులు లేక నిలిచిన పనులు

రూ.20 లక్షల అంచనా వ్యయంతో నిర్మాణాలు ప్రారంభించారు.

బిల్లులు మంజూరుకాక..

ఆరోగ్య కేంద్రాల నిర్మాణాన్ని గుత్తేదారులు మొదలు పెట్టారు. తరువాత సకాలంలో బిల్లులు విడుదల చేయకపోవడంతో పనులు నిలిపివేశారు. నిధులు లేక ప్రస్తుతం భవనాల పనులు నిలిచిపోయాయి. నిర్మాణం పూర్తయిన కేంద్రాల్లో కొన్నే వినియోగంలో ఉన్నాయి. కొన్నింటికి చిన్న చిన్న పెండింగ్ పనులు చేయాల్సి ఉంది. మరికొన్నింటికి ఆ శాఖకు అప్పగించలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో ఆయుష్మాన్ భారత్ కేంద్రాల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేసి పేదలకు వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రతిభా పాటవ పోటీకి స్పందన



ప్రతిభ చూపిన విద్యార్థినులకు బహుమతులిస్తున్న ప్రధానోపాధ్యాయిని విజయలక్ష్మి

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: నందిగామ జడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రతిభా పాటవ పోటీకి విద్యార్థుల నుంచి మంచి స్పందన వచ్చింది. ఎనిమిది, తొమ్మిది, పది తరగతుల విద్యార్థులకు 'ఇంటర్నెట్ వినియోగం వల్ల లాభనష్టాలు.. విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పదో తరగతి విద్యార్థినులు కె. నక్షత్ర ప్రథమ, జి. అఖిల ద్వితీయ, పి. ఎస్తేరి తృతీయ స్థానంలో నిలిచారు. విజేతలకు ప్రధానోపాధ్యాయిని పొదిలి విజయలక్ష్మి ప్రశంసాపత్రాలు, బహుమతులు అందించారు. తెలుగు పండితులు ఉమాకాంత్, యానాల హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.



వ్యాసరచన పోటీలో విద్యార్థులు

రహదారుల నిర్మాణానికి శంకుస్థాపన

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని మాగల్లు గ్రామంలో సోమవారం పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా సిమెంటు రహదారుల అభివృద్ధి పనులకు తెదేపా నాయకులు శంకుస్థాపన చేశారు. ఎస్సీ కాలనీలో రూ.25 లక్షల జాతీయ గ్రామీణ ఉపాధి హామీ నిధులతో రహదారులు విస్తరిస్తున్నారు. తెదేపా నాయకులు అప్పారావు, కృష్ణమోహన్, శేషగిరిరావు, శ్రీనివాసరావు, బుడేసాహెబ్, దేవదానం తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న తెదేపా నాయకులు

గుంతకు మరమ్మతులు



జగ్గయ్యపేట గ్రామీణం: చిల్లకల్లు ఫ్లైఓవర్ వద్ద వర్షానికి ఏర్పడిన గుంతను జాతీయ రహదారి సిబ్బంది సోమవారం పూడ్చారు. ఈ గుంత వల్ల వాహనాల రాకపోకలకు ఇబ్బందికరంగా ఉంటుందని, వాహనదారుల జాతీయ రహదారి సిబ్బందికి తెలియజేశారు. జాతీయ రహదారి సిబ్బంది స్పందించి సోమవారం మరమ్మతులు చేసి గుంతను పూడ్చారు.

పల్లెల ప్రగతికి బాటలు



లింగాలపాడులో శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సౌమ్య, రమాదేవి

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: గ్రామాల్లో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా సిమెంటు రహదారులు, డ్రెయిన్ల నిర్మాణ పనులు పెద్దఎత్తున చేపడుతున్నామని ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య తెలిపారు. సోమవారం మండలంలోని అడవిరావులపాడులో రూ.20 లక్షలు, లింగాలపాడులో రూ.25 లక్షలు, తక్కెళ్లపాడులో రూ.20 లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు జనసేన నియోజకవర్గ సమన్వయకర్త తంబళ్లపల్లి రమాదేవితో కలిసి ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ఈనెల 14 నుంచి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో అభివృద్ధి పనులు ఊపందుకున్నాయని చెప్పారు. కూటమి ప్రభుత్వం పల్లెల ప్రగతికి బాటలు వేస్తోందని అన్నారు. తెదేపా మండల అధ్యక్షుడు వీరంకి వీరాస్వామి, నాయకులు బండారు రోశయ్య, కొండూరు నరసింహారావు, మరియదాసు, విక్రం, వడ్లమూడి శ్రీనివాసరావు, సర్పంచి పద్మజ, గర్మిడి సురేష్, సంగయ్య, రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనల మేరకు ధాన్యం కొనుగోలు

కంచికచర్ల, న్యూస్‌టుడే : ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు ధాన్యం కొనుగోలు చేయనున్నట్లు పౌరసరఫరాల శాఖ అసిస్టెంట్ మేనేజర్ జయప్రద అన్నారు. ధాన్యం కొనుగోలుపై కంచికచర్ల మండల పరిషత్ కార్యాలయంలో కంచికచర్ల, వీరులపాడు మండల వీఏఏలకు సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ధాన్యం సేకరణకు అవసరమైన గోనె సంచులను ప్రభుత్వమే ఉచితంగా అందిస్తుందని అన్నారు. రైతుల నుంచి కొను



మాట్లాడుతున్న పౌరసరఫరాల శాఖ అసిస్టెంట్ మేనేజర్ జయప్రద

గోలు కేంద్రాలకు ధాన్యాన్ని తరలించేందుకు అయ్యే కూలీ, రవాణా ఖర్చును సైతం ప్రభుత్వమే భరించనుందని తెలిపారు. క్వింటా సాధారణ రకం ధాన్యం ధర రూ.2300, ఏ గ్రేడు రకం ధర రూ.2320 అని వెల్లడించారు. ధాన్యం నాణ్యత ఎలా ఉండాలి, ఎలా పరీక్షించాలి తదితర అంశాలపై వీఏఏలకు అవగాహన కల్పించారు. కరపత్రాలు ఆవిష్కరించారు. కంచికచర్ల, వీరులపాడు తహసీల్దార్లు జాహ్నవి, షేక్ హుస్సేన్, పౌర సరఫరాల శాఖ ఉప తహసీల్దారు సుమతి, మండల వ్యవసాయాధికారి విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా చప్టా



వీరులపాడు నుంచి దొడ్డదేవరపాడు వెళ్లే ఆర్అండ్‌బీ రహదారిపై తోట మూల సమీపంలోని చప్టా కింద మట్టి ఇటీవల కురిసిన వర్షాలకు కోతకు గురైంది. చప్టాని ఆనుకొని ఉన్న రహదారి సైతం దెబ్బతినడంతో నిత్యం రాకపోకలు సాగించే వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. అసలే వీరులపాడు - దొడ్డదేరపాడు రహదారి పలు చోట్ల కోతకు గురై ప్రమాదకరంగా ఉందని, దీనికి తోడు చప్టా కింద మట్టి కోతకు గురికావడంతో ఏ క్షణంలో ఏం జరుగుతుందోనని భయపడుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు. - **దొడ్డదేవరపాడు (వీరులపాడు), న్యూస్‌టుడే**

తిరుపతమ్మ దేవస్థానం ఈఈగా రమాదేవి బాధ్యతల స్వీకరణ

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: పెనుగంచిప్రోలు తిరుపతమ్మ దేవస్థానం ఈఈగా నియమితులైన రమాదేవి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అమ్మవారి దేవస్థానం ఈఈ వైకుంఠరావును విజయవాడ దుర్గ గుడికి, అక్కడ విధుల్లో ఉన్న రమాదేవి పెనుగంచిప్రోలుకు బదిలీ అయ్యారు. రమాదేవికి ఆలయ అధికారులు స్వాగతం పలికి వేదపండితులతో ఆశీర్వచనాలు అందించారు. ఏఈలు రాజు, అరవింద్, ఆలయ ఇన్‌స్పెక్టర్ కృష్ణమోహన్ పాల్గొన్నారు.

పైప్‌లైన్ పగిలి.. తాగునీరు మురికి

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే

జగ్గయ్యపేటలో రక్షిత మంచినీటి వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారై ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. గత నెలలో వరద విజృంభణతో ధ్వంసమైన పైప్‌లైన్ల ప్రభావం పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో కనిపిస్తోంది. పథకం నిర్వహణ, మరమ్మతుల విషయంలో పురపాలక సంఘం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న నేపథ్యంలో వివిధ ప్రాంతాలకు మురుగు నీరు వెళ్తోంది. ముఖ్యంగా శివారు ప్రాంతాల్లో గడిచిన 50 రోజులుగా కలుషిత నీరు సరఫరా అవుతున్నా.. అధికారులు అరికట్టలేకపోతున్నారు.

ముఖ్యంగా హెడ్‌వాటర్ వర్క్స్‌లో పరికరాలు దెబ్బతిన్నాయి. వాటిని పునరుద్ధరించేందుకు రూ.కోటి వరకు ఖర్చు అయ్యే అవకాశం ఉంది. నిధుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఇక సాధారణ నిర్వహణ, మరమ్మతుల విషయంలో ఇంజినీరింగ్ శాఖ కాడి పడేసింది. ఇటీవల ఇంజినీరింగ్ విభాగంపై కౌన్సిల్ యావత్తు ధ్వజమెత్తడం గమనార్హం. అందులోని ముఖ్య అధికారులు బదిలీపై వెళ్లి కొత్త వారు రావడం కూడా పనులు జాప్యానికి కారణంగా చెబుతున్నారు. పురపాలక సంఘానికి కూతవేటు దూరంలోని రాజీవ్ చౌక్‌లో సుమారు నెల రోజులుగా పైపులైన్ లీకై నీరు వృథాగా పోతోంది. రోడ్డు బురదమయంగా మారినా కనీస మరమ్మతులు చేపట్టలేదు. లీకుల కారణంగానే నీరు కలుషితం అవుతున్నట్లు ప్రజలు గగ్గోలు పెడుతున్నా.. వాటిని అరికట్టే ప్రయత్నాలు కనిపించడం లేదు. మూడు నెలల కిందట పట్టణాన్ని అతిసారం కుదిపేసింది. మరణాలు సంభవించినా పురపాలక అధికారులు ప్రజారోగ్యం విషయంలో తాత్సారం చేస్తున్నారని ప్రజలు ఆక్షేపిస్తున్నారు. రాజీవ్ చౌక్‌లోని వ్యాపారి రమేష్ తమ దుకాణాల ముందు బురద వల్ల పడుతున్న ఇబ్బందిపై ఇటీవల ఫిర్యాదు చేశారు. కాకాని నగర్‌లో కృష్ణారెడ్డి తమ ఇంట్లో మురుగు నీరు సరఫరా అవుతున్నట్లు అధికారులకు అర్జీ ఇచ్చారు. ఇప్పటికైనా స్పందించి తాగునీటి సమస్యలు వెంటనే పరిష్కరించాలని పట్టణవాసులు కోరుతున్నారు. దీనిపై పురపాలక ఛైర్మన్ రాఘవేంద్ర మాట్లాడుతూ.. ఇంజినీరింగ్ విభాగంలో అధికారులు పూర్తిగా మారారని, వారితో చర్చించి సమస్య పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని తెలిపారు.



జగ్గయ్యపేటలో రాజీవ్‌చౌక్‌లో పైపులైన్ లీక్



కాకాని నగర్‌లో సరఫరా అయిన బురద నీరు

కొలతల్లో తప్పులు సరిచేయాలని వినతి



పెనుగంచిప్రోలు: గ్రామసభలో రెవెన్యూ అధికారులు

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: భూసర్వేలో అనేక తప్పులున్నాయని రెవెన్యూ, సర్వే అధికారులు వాటిని సరిచేయాలని భూయజమానులు అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. ఇటీవల భూసర్వే జరిగిన సుబ్బాయిగూడెంలో రెవెన్యూ అధికారులు సోమవారం గ్రామసభ నిర్వహించి రైతుల నుంచి అభ్యంతరాలు స్వీకరించారు. ఇటీవల చేసిన భూసర్వే తర్వాత ఇచ్చిన కొలతలు పాత రికార్డులతో సరిపోవడం లేదని తెలిపారు. గ్రామంలోని 870 ఎకరాలను సర్వే చేయగా, 140 ఎకరాల్లోని 132 మంది రైతులు తమకు ఎల్‌పీ నంబర్లు ఇవ్వాలని కోరారు. రీసర్వేలో జాయింట్ ఎల్‌పీలు ఇవ్వడం వల్ల తమ భూమికి సంబంధించిన 1బీ అడంగల్ రావడం లేదని ఫిర్యాదు చేశారు. దానికోసం అర్జీలు పెట్టుకునేందుకు మీసేవకు వెళ్తే ఒక్కొక్కరికి రూ.500 ఖర్చు అవుతోందని రైతులు వాపోయారు. సభకు తహసీల్దారు రాకపోవడంపై రైతులు అసంతృప్తి వ్యక్తం చేశారు. సర్పంచి వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు ప్రభాకర్, డీటీ కోట భాస్కరరావు, ఆర్ఐ అబ్దుల్ అలీం, సర్వేయర్ స్వప్న, వీఆర్వో రమణ పాల్గొన్నారు.

వీరులపాడు: రీ సర్వేలో చోటుచేసుకున్న భూ సమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ గ్రామ సభను సోమవారం వీరులపాడులో నిర్వహించారు. 7 అర్జీలు వచ్చాయి. ఆర్ఐ సంధ్య పాల్గొన్నారు.

నందిగామ గ్రామీణం: పల్లగిరిలో సోమవారం భూముల రీ సర్వే ఫిర్యాదుల స్వీకరణకు గ్రామసభ నిర్వహించారు. రైతుల నుంచి 23 అర్జీలు స్వీకరించారు. తహసీల్దార్ సురేష్‌బాబు, డిప్యూటీ తహసీల్దార్ ఆంజనేయులు, మండల సర్వేయరు భోజ్యానాయక్, వీఆర్వో ప్రకాశరావు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు ఫిర్యాదు

కంచికచర్ల: స్థానిక జుజ్జూరు రహదారిలో ఉన్న మద్యం దుకాణంపై జిల్లా కలెక్టర్‌కు స్థానికులు సోమవారం లిఖితపూర్వక ఫిర్యాదు చేశారు. ఈ రహదారిలోని పాఠశాలలు, గుడికి సమీపంలో దుకాణం ఉందని, ప్రధాన రహదారికి పక్కనే ఉండడంతో రాత్రి సమయాల్లో మహిళలు, విద్యార్థులు, వాహనదారుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా ఉంటుందని వివరించారు. ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని వెంటనే చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో శ్రీఅక్షర పాఠశాల, ఏకత్వ పాఠశాల నిర్వాహకులు, నాగేంద్ర స్వామి ఆలయ కమిటీ సభ్యులు, స్థానికులు ఉన్నారు.

జనసేనలో చేరిక

జగ్గయ్యపేట: పెనుగంచిప్రోలు మాజీ ఎంపీపీ జి.శ్రీనివాసరావు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు బి.శ్రీనివాసరెడ్డి, మైనార్టీ నాయకుడు షాబుద్దీన్‌లు జిల్లా జనసేన అధ్యక్షుడు సామినేని ఉదయభాను సమక్షంలో సోమవారం పార్టీలో చేరారు. ఉదయభాను వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. తిరువూరు నియోజకవర్గ జనసేన నాయకులు జగ్గయ్యపేటలో ఉదయభానును కలిసి తమ అభినందనలు తెలిపారు. సత్తార్, గోపీచంద్, వాసు పాల్గొన్నారు.

ఉచితంగా నట్టల నివారణ మందు

వేములపల్లి(కంచికచర్ల): గొర్రెలు, మేకల్లో నట్టల నివారణకు ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తున్న మందును వేములపల్లిలో సోమవారం అందజేశారు. నులి పురుగుల కారణంగా జీవాలు మందకొడిగా ఉంటూ ఆహారం తీసుకోవడం మానివేస్తాయని అన్నారు. వాటిని ప్రాథమిక స్థాయిలోనే నివారించాలని సూచించారు. నందిగామ డివిజన్ పశుసంవర్థక శాఖ ఉప సంచాలకుడు వెస్లీ, గండేపల్లి పశు వైద్యాధికారి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

చందర్లపాడు, న్యూస్‌టుడే: కోనాయపాలెంలో గొర్రెలు, మేకలను నట్టల నివారణ మందులను వైద్యురాలు నీరజ వేశారు. ఆసుపత్రి పరిధిలోని ప్రతి గ్రామంలో ఉచితంగా మందు అందజేస్తున్నట్లు చెప్పారు. గుత్తికొండ రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగులకు అండగా ప్రభుత్వం

కంచికచర్ల, న్యూస్‌టుడే : ఉద్యోగ విరమణ అనంతరం సామాజిక సేవ చేస్తూ.. తమ వంతు బాధ్యత నెరవేరుస్తున్న విశ్రాంత ఉద్యోగుల సేవలు వెలకట్టలేనివని ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అన్నారు. కంచికచర్ల విశ్రాంత ఉద్యోగుల సంఘం భవనంలో ఎమ్మెల్యేని సంఘం ప్రతినిధులు సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విశ్రాంత ఉద్యోగుల కోసం 2017లో తెదేపా ప్రభుత్వ హయాంలోనే భవనం నిర్మించామని గుర్తు చేశారు. వారికి ఎల్లప్పుడూ ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఎన్నికల్లో తన విజయానికి కృషి చేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సానె రామ్మోహనరావు, కార్యదర్శి ముండ్లనాటి పోతురాజు, మండల విద్యాశాఖాధికారి బాలాజీ, తెదేపా నాయకులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేని సన్మానిస్తున్న సంఘం ప్రతినిధులు

రసాయనాల ముప్పు

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే

ఒకప్పుడు పట్టణానికి దూరంగా నిర్మితమైన ఆటోనగర్ ఇప్పుడు పట్టణ విస్తరణతో దగ్గర కావడంతో కొత్త సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఆటోనగర్‌లోని కొన్ని కర్మాగారాలు తమ సంస్థ నుంచి విడుదలయ్యే రసాయన మిశ్రమాలను నేరుగా కాల్వల ద్వారా పట్టణం దిశగా మళ్లించడంతో పెనుప్రమాదం పొంచి ఉంది. జాతీయ రహదారి నుంచి జగ్గయ్యపేట వైపు వచ్చే అండర్ పాసింగ్ వద్ద రసాయన వ్యర్థాలతో కూడిన ఈ కాల్వలు దర్శనమిస్తున్నాయి. గతంలో జాతీయ రహదారికి అవతల వైపు మాత్రమే పరిమితమైన రసాయన వ్యర్థాల సమస్య ఇప్పుడు నేరుగా పట్టణంలోకి ప్రవేశిస్తుంది. కోదాడ రోడ్డులోని అండర్‌పాసింగ్ సమీపంలో ఓ పాఠశాల ముందు ప్రవహించే మురుగునీరు ఈ రసాయన వ్యర్థాల మిశ్రమంగా ఉండడంతో పిల్లల తల్లిదండ్రులు భయపడుతున్నారు. నీటి నుంచి వచ్చే దుర్వాసన కాక, నేరుగా కర్మాగారాలు గాలిలోకి వదిలే రసాయన వాయువుల సమస్య కూడా ఇబ్బంది పెడుతుందని సమీపంలోని స్థానికులు గగ్గోలు పెడుతున్నారు. అడ్డరోడ్డుకు సమీపంలోని సాయినగర్, శాంతినగర్, విష్ణుప్రియనగర్, వివేకానంద నగర్ ప్రాంతాలతోపాటు పాఠశాల, ఆడిటోరియం వంటి నిత్యం రద్దీ ఉండే ప్రదేశాలపై కూడా దీని ప్రభావం పడుతుంది. తాజాగా ఈ విషయంపై సమీప పాఠశాల, నివాస ప్రాంతాలవారు ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీరాంతాతయ్య ఆయా కర్మాగారాల యాజమాన్యాలకు హెచ్చరికలు చేయడంతో పాటు దీనిపై తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల వారికి సూచించారు.



ఆటోనగర్‌కు ఎదురువైపు ప్రవహిస్తున్న వ్యర్థాలు



జగ్గయ్యపేట - కోదాడ రహదారిపై ఇలా...

పోలీస్ అమరవీరులకు నివాళి

కంచికచర్ల, న్యూస్‌టుడే : పోలీసు అమర వీరుల సంస్మరణ దినం సందర్భంగా కంచికచర్ల స్టేషన్‌లో పోలీసులు సోమవారం అమరవీరులకు ఘన నివాళులు అర్పించారు. అమర వీరుల చిత్ర పటాలకు పూల మాలలు వేసి నివాళులు అర్పించిన అనంతరం స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి ప్రధాన రహదారిలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఎస్సై బోనగిరి రాజు, సిబ్బంది పాల్గొన్నారు.



కంచికచర్ల: ప్రదర్శన నిర్వహిస్తున్న పోలీసులు



పెనుగంచిప్రోలులో...

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: పోలీసు అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకొని వత్సవాయి పోలీస్‌స్టేషన్ వద్ద ఎస్ఐ ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసులు, స్థానికులు అమరవీరులకు నివాళులర్పించారు.

కారు ఢీకొని దంపతులకు గాయాలు

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే: పట్టణంలోని కోదాడ రోడ్డులో శాంతినగర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న దంపతులకు గాయాలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం.. పెనుగంచిప్రోలు మండలం వెంకటాపురానికి చెందిన బేరోతుల రమేశ్ భార్యతో కలిసి జగ్గయ్యపేట వచ్చి పని చూసుకొని కోదాడ సమీపంలోని చిలుకూరుకు బయల్దేరారు. కోదాడ రోడ్డులో వెళ్తుండగా ఎదురుగా వచ్చిన కారు ఢీకొనడంతో రమేశ్ కాళ్లకు తీవ్ర గాయాలు, అతని భార్యకు స్వల్ప గాయాలయ్యాయి. జగ్గయ్యపేట ప్రభుత్వాసుపత్రిలో ప్రథమ చికిత్స అనంతరం రమేశ్‌ని మెరుగైన వైద్యం కోసం విజయవాడకు తరలించారు. ఎస్సై వెంకటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

జగ్గయ్యపేట: పట్టణంలోని కాకానీ నగర్‌లో నివాసం ఉంటున్న వంగూరి చిన వేంకటేశ్వరరావు ఇంట్లో సోమవారం చోరీ జరిగింది. ఇంటికి తాళం వేసి కుటుంబ సమేతంగా హైదరాబాద్ వెళ్లిన ఆయన తిరిగి వచ్చి చూసేసరికి తాళాలు పగలగొట్టి ఉన్నాయి. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు చేపట్టిన విచారణలో రూ.3 లక్షల విలువైన బంగారు, వెండి నగలు పోయినట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. ఎస్సై వెంకటేశ్వరారవు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం స్వాధీనం

జమ్మవరం (వీరులపాడు), న్యూస్‌టుడే : నిబంధనలకు విరుద్ధంగా జమ్మవరం గ్రామంలో చర్చి సమీపంలో మద్యం అమ్ముతున్న మహాలక్ష్మి అనే మహిళ నుంచి 8 సీసాలను స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ అఫ్షాపున్నీసా బేగం సోమవారం తెలిపారు.

విజయవాడ పశ్చిమ





వ్యాసరచన పోటీలో విద్యార్థులు, విజేతలతో పాఠశాల ఛైర్మన్ తిరుపతిరెడ్డి, డైరెక్టర్ దినేష్

ఉత్సాహంగా ప్రతిభా పాటవ పోటీలు

భవానీపురం, న్యూస్‌టుడే: భవానీపురంలోని నేతాజీ ఉన్నత పాఠశాలలో సోమవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు జరిగాయి. 'ఇంటర్నెట్ వినియోగం వల్ల లాభ నష్టాలు', 'విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో వరుసగా లక్ష్మీప్రణతి, బి.జెర్ష్వా, టి.విజయలక్ష్మీ నిలిచారు. వారికి పాఠశాల ఛైర్మన్ కె.తిరుపతిరెడ్డి, డైరెక్టర్లు కె.రాజేష్, కె.దినేష్‌లు బహుమతులు అందజేసి అభినందించారు.

రైల్వేస్టేషన్‌లో నకిలీ గుర్తింపు కార్డుల కలకలం

విజయవాడ, న్యూస్‌టుడే : విజయవాడ రైల్వేస్టేషన్‌లో నకిలీ గుర్తింపు కార్డుల దందా కలకలం రేపుతోంది. గుట్టుచప్పుడు కాకుండా కొందరు వెండర్లు నకిలీ గుర్తింపు కార్డులతో చేస్తున్న విక్రయాలు ఒక్కసారిగా బట్టబయలయ్యాయి. రైల్వే ఆసుపత్రి వైద్యుడి సంతకాలనే ఫోర్జరీ చేసి మరీ 500లకుపైగా నకిలీ గుర్తింపు కార్డులతో అనధికారికంగా ఆహార పదార్థాలు విక్రయిస్తున్నట్లు బయపడింది. రైల్వేస్టేషన్‌లోని క్యాంటీన్లు, స్టాళ్లలో ఆహారం విక్రయించాలంటే వెండర్లు తప్పనిసరిగా ఆరోగ్యవంతులై ఉండాలి.

రైల్వే వైద్యుడి సంతకాలు ఫోర్జరీ

వెండర్లు పూర్తిగా ఆరోగ్యంగా ఉన్నట్లు రైల్వే ఆసుపత్రి డాక్టర్ వైద్యపరీక్షలు నిర్వహించి ఫిట్ సర్టిఫికెట్ ఇచ్చిన అనంతరమే కమర్షియల్ విభాగం గుర్తింపు కార్డులను జారీ చేస్తుంది. అయితే రైల్వేస్టేషన్‌లో పని చేసే కొందరు క్యాంటీన్ల నిర్వాహకులు రైల్వే డాక్టర్ సంతకాలను ఫోర్జరీ చేసి వందల సంఖ్యలో అనధికార వెండర్లకు నకిలీ గుర్తింపు కార్డులు జారీ చేసినట్లు తెలుస్తోంది. ఈ కార్డుల ఆధారంగా వెండర్లు రైల్వేస్టేషన్‌లో ఆహార పదార్థాలు విక్రయాలు జరుపుతున్నట్లు తేలింది. రైల్వేస్టేషన్‌లోని అన్ని ప్లాట్‌ఫారాల్లో స్టాళ్లు, క్యాంటీన్లకు కలిపి సుమారు 100 నుంచి 150 మంది వెండర్లకు మాత్రమే గుర్తింపు కార్డులు జారీ చేశారు. కమర్షియల్ అధికారులు, ఆర్పీఎఫ్ పోలీసులు ఎప్పటికప్పుడు ఈ కార్డులను తనిఖీ చేస్తుంటారు. నిబంధనల మేరకు అధికారులు జారీ చేసిన గుర్తింపు కార్డులు కాకుండా నకిలీ కార్డులతో నాసికరం ఆహారం విక్రయిస్తూ ప్రయాణికులను నిలువునా దోచుకుంటున్నారు. దీనిపై ప్రతి రోజూ పెద్ద ఎత్తున ప్రయాణికుల నుంచి ఫిర్యాదులు అందుతున్నాయి. అధికారులు కూడా ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించి జరిమానా విధిస్తున్నారు. రాత్రి సమయాల్లో అధికారుల పర్యవేక్షణ తక్కువగా ఉండడంతో నకిలీ గుర్తింపు కార్డులతో విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. నకిలీ కార్డుల వ్యవహారం బయటపడడంతో రైల్వే అధికారులు విచారణ చేపట్టారు.



కాలువ నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న స్థానిక మహిళ, పక్కనే కార్పొరేటర్ విజయ్‌కుమార్

రూ.4.5 లక్షలతో కాలువ నిర్మాణం

చిట్టినగర్, న్యూస్‌టుడే: అభివృద్ధి పనుల్లో భాగంగా మురుగునీరు ప్రవహించేందుకు వీలుగా డ్రెయిన్ నిర్మాణం చేపడుతున్నట్లు 49వ డివిజన్ కార్పొరేటర్ బుల్లా విజయ్ కుమార్ తెలిపారు. పెనుమాక దేవదాసువీధిలో స్థానిక పెద్దలతో కలిసి కాలువ నిర్మాణ పనులకు సోమవారం శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మురుగు సమస్యను ఎమ్మెల్యే సుజనాచౌదరి దృష్టికి తీసుకు వెళ్లగా స్పందించి డ్రెయిన్ పనులకు రూ.4.5 లక్షలు మంజూరు చేయించారని వివరించారు. ఏఈ ప్రసాద్, కూటమి నాయకులు బదుగు వెంకన్న, కొమర కిరణ్, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

మహిళలకు ఉచిత డ్రైవింగ్ శిక్షణ

చిట్టినగర్, న్యూస్‌టుడే: మహిళలకు ఉచితంగా ద్విచక్ర వాహనం డ్రైవింగ్ శిక్షణ ఇస్తున్నట్లు కేబీఎన్ కళాశాల ప్రిన్సిపల్ జి.కృష్ణవేణి తెలిపారు. కొత్తపేటలోని కేబీఎన్ కళాశాల ఉమెన్ స్టడీ సెంటర్ ఆధ్వర్యంలో ద్విచక్రవాహనం శిక్షణకు సంబంధించిన కరపత్రాలను హిందూ హైస్కూల్స్ ఏవో నారాయణరావు చేతుల మీదుగా సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలకు ద్విచక్ర వాహనం డ్రైవింగ్ శిక్షణ ఈ నెల 25వ తేదీ నుంచి ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న మహిళలు, యువతులు కళాశాలలో సంప్రదించాలని సూచించారు. వైస్ ప్రిన్సిపల్స్ ఎం.వెంకటేశ్వరరావు, పి.ఏఎల్. రమేష్, ఉమెన్ స్టడీ సెంటర్ కన్వీనర్ వి.శైలజ, తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ల బదిలీ

విజయవాడ నగరపాలక సంస్థ,న్యూస్‌టుడే: నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ విభాగంలో సుదీర్ఘకాలంగా పని చేస్తున్న ఇద్దరు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లను ప్రభుత్వం బదిలీ చేసింది. సర్కిల్-1 పరిధిలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా పని చేస్తున్న ఎ.ఎస్.ఎన్. ప్రసాద్‌కు గుడివాడ పురపాలక సంఘానికి, సర్కిల్-2 పరిధిలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా విధులు నిర్వహిస్తున్న వి.చంద్రశేఖర్‌ను మచిలీపట్నం మున్సిపల్ కార్పొరేషన్‌కు పంపించింది. వారిని రిలీవ్ చేస్తూ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాలిచ్చారు.

ఈ రహదారులకు మోక్షమెప్పుడో?

భవానీపురం, న్యూస్‌టుడే

బుడమేరు వరద కారణంగా విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలోని పలు రహదారులు అధ్వానంగా మారాయి. దాదాపు పది డివిజన్లలోని కాలనీల్లో రోడ్లు గతుకులమయంగా మారాయి. నగరపాలక సంస్థ అధికారుల అంచనా ప్రచారం నియోజకవర్గం వ్యాప్తంగా అరవై కిలోమీటర్ల మేర రహదారులు దెబ్బతిన్నట్లు ఉన్నతాధికారులకు నివేదిక పంపారు.



దెబ్బతిన్న విద్యాధరపురంలోని ఒక రహదారి



ఐరన్ యార్డులోని రహదారి



జక్కంపూడి కాలనీలోని మార్గం

అయితే.. దెబ్బతిన్న ఆ రహదారుల మరమ్మతులకు మోక్షం ఎప్పుడు లభిస్తుందా అని ప్రజలు ఎదురుచూస్తున్నారు. రోజుల తరబడి నీరు నిలిచి ఉండటంతో రహదారులు భారీ స్థాయిలో దెబ్బతిన్నాయి. నేటికీ అనేక చోట్ల రహదారులపై గోతులు ఉన్నాయి. దీంతో పాదచారులు, వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు.

❖ విద్యాధరపురం పరిధిలోని రోటరీనగర్, కబేళా, సితార సెంటర్, తదితర ప్రాంతాల్లో రహదారులు పాడయ్యాయి. భవానీపురం పరిధిలోని ఐరన్ యార్డు, హెచ్‌బీ కాలనీ, ఊర్మిళానగర్ ప్రాంతాలు ముంపునకు గురి కావడంతో రహదారులు దెబ్బతిన్నాయి. జక్కంపూడి కాలనీలోని రోడ్లు ధ్వంసమయ్యాయి. ఆయా రహదారులకు మరమ్మతులు చేపట్టడం లేదా పునఃనిర్మించడం చేయాల్సిన అవసరం ఉంది. ❖ గతుకుల రోడ్లపై వాహనచోదకులు, పాదచారులు పీట్లు చేయాల్సి వస్తోంది. చిన్నపాటి వర్షం వచ్చినా నీరు నిలిచిపోయి ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రహదారులకు మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

భారీగా గోతులు పడ్డాయి

బుడమేరు వరద కారణంగా ఐరన్ యార్డులోని రహదారులపై మట్టి కొట్టుకుపోయింది. దీంతో రోడ్డు పొడవునా అనేక చోట్ల గోతులు పడ్డాయి. రాకపోకలు సాగించాలంటే ఇబ్బందిగా ఉంటోంది. ముఖ్యంగా ముఠా కార్మికులు వారి వాహనాలతో గతుకుల రోడ్లపై వెళ్లాలంటే పడరాని పాట్లు పడుతున్నారు. అధికారులు మరమ్మతులు చేపట్టాల్సిన అవసరం ఉంది.

– సత్యనారాయణ, ఐరన్ యార్డు

రహదారుల అభివృద్ధిపై దృష్టి పెట్టాలి

దెబ్బతిన్న రహదారులను అభివృద్ధి చేసేందుకు నగరపాలక సంస్థ అధికారులు స్పందించాలి. బుడమేరు వరద కారణంగా రహదారులు అనేక చోట్ల కుంగిపోవడం, గోతులు పడటం జరిగింది. దెబ్బతిన్న ఆ రహదారులను బాగు చేయిస్తే ప్రజలకు సౌకర్యంగా ఉంటుంది. అధికారులు చూసి వెళ్లారు తప్పితే మరమ్మతులు చేయించడం లేదు.


– నవీన్, విద్యాధరపురం


తెదేపాలోకి ముగ్గురు వైకాపా కార్పొరేటర్లు

పటమట, న్యూస్‌టుడే: విజయవాడలో వైకాపాకు వరుస ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. గతంలో పశ్చిమ నియోజకవర్గానికి చెందిన ముగ్గురు వైకాపా కార్పొరేటర్లు ఎంపీ కేశినేని శివనాథ్ సమక్షంలో తెదేపాలో చేరారు. సోమవారం సెంట్రల్ నియోజకవర్గానికి చెందిన వైకాపా కార్పొరేటర్లు కె.లక్ష్మీపతి, రమాదేవి, తిరుపతమ్మ తమ అనుచరులతో కలిసి తెదేపా తీర్థం పుచ్చుకున్నారు. వారికి ఎంపీ శివనాథ్, సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. తమది మంచి ప్రభుత్వమని ప్రజలు విశ్వసిస్తున్నారని పేర్కొన్నారు. విజయవాడకు వరద వచ్చినప్పుడు సీఎం చంద్రబాబు స్పందించిన తీరు అద్భుతమని కొనియాడారు. కూటమి ప్రభుత్వంతోనే ప్రజల కష్టాలు తీరుతాయని భావిస్తున్నందున వైకాపా నాయకులు తెదేపాలో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారని అన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ... వరద ప్రాంతాల్లో చంద్రబాబు స్పందించిన తీరు, సేవలు చూసి వైకాపా నాయకులు మెచ్చుకుంటున్నారని పేర్కొన్నారు. ప్రజాసేవ పట్ల అంకితభావం ఉన్న వారిని పార్టీలో చేర్చుకుంటున్నామని వెల్లడించారు. కూటమి నాయకులతో కలిసి డివిజన్ల అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. తెదేపా నాయకులు బొప్పన భవకుమార్, నవనీతం సాంబశివరావు, చెన్నుపాటి ఉషారాణి, మాదిగాని గురునాథం, రమణ, సొంగా సంజయ్‌వర్మ తదితరులు పాల్గొన్నారు.



ఎంపీ శివనాథ్, ఎమ్మెల్యే ఉమాతో కార్పొరేటర్లు లక్ష్మీపతి, రమాదేవి, తిరుపతమ్మ తదితరులు







వినువీధిలో కనువిందు

పున్నమి ఘాట్‌లో డ్రోన్ షోకు సర్వం సిద్ధమైంది. మంగళవారం బుల్లి విమానాల ప్రదర్శన నేపథ్యంలో సోమవారం రాత్రి నిర్వాహకులు ట్రయల్ రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆకాశంలో వేలాది డ్రోన్లు వివిధ ఆకారాల్లో కనువిందు చేశాయి. వినువీధిలో ఒక్కసారిగా వెలుగులు రావడంతో ప్రజలు ఆసక్తిగా తిలకించారు. - భవానీపురం, న్యూస్‌టుడే





డ్రోన్‌లు ఉంచేందుకు అమర్చిన కార్పెట్‌లు



పోలీసు సిబ్బందికి సూచనలు చేస్తున్న ఉన్నతాధికారులు

ప్రమాదవశాత్తు జారిపడి కూలీ మృతి

చిట్టినగర్, న్యూస్‌టుడే: ప్రమాదవశాత్తు జారిపడి చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం. . ఏలూరుకు చెందిన అబ్దుల్ సలామ్(50) పనుల నిమిత్తం సోమవారం నగరానికి వచ్చారు. కొత్తపేట చేపల మార్కెట్‌లోని మటన్ దుకాణంలో పని చేస్తూ జీవిస్తున్నారు. అప్పుడప్పుడు ఏలూరు వెళ్లి భార్య, పిల్లలను కలిసి వస్తుండేవారు. ఈనెల 20వ తేదీన సాయంత్రం చేపల మార్కెట్‌లో మెట్లు దిగుతుండగా ప్రమాదవశాత్తు జారి పడిపోయారు. దెబ్బలు తగలడంతో చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందారు. ఈ మేరకు మృతుడి బంధువైన అబ్దుల్ షఫీ ఫిర్యాదు చేయగా కొత్తపేట పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పారిశుద్ధ్య కార్మికులకు బీమా అమలు చేయాలి


భవానీపురం, న్యూస్‌టుడే : నగరపాలక సంస్థలో పని చేసే ఒప్పంద పారిశుద్ధ్య కార్మికులకు బీమా పథకాన్ని అమలు చేయాలని సీపీఎం కార్పొరేటర్ బోయి సత్యబాబు పేర్కొన్నారు. జక్కంపూడి కాలనీలో పారిశుద్ధ్య కార్మికురాలిగా పని చేస్తూ గుండెపోటుతో చనిపోయిన ఎస్.మరియమ్మ భౌతిక కాయం వద్ద సీపీఎం నాయకులు సోమవారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా సత్యబాబు మాట్లాడుతూ బుడమేరు వరదల నాటి నుంచి కార్మికులు సెలవులు లేకుండా పని చేస్తున్నారని తెలిపారు. దీంతో తీవ్ర పని ఒత్తిడికి గురై మరియమ్మ చనిపోయినట్లు చెప్పారు. ఆదివారం సెలవు రోజు కూడా విధులు నిర్వహించిందన్నారు. కార్మికులకు బీమా, గ్రాట్యూటీ, తదితర సౌకర్యాలేవీ లేవన్నారు. మరియమ్మ కుటుంబానికి అధికారులు న్యాయం చేయాలన్నారు. నాయకులు సాములు, దుర్గ, బుజ్జమ్మ, తదితరులు పాల్గొన్నారు.

కృత్రిమ మేధపై అంతర్జాతీయ సదస్సు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కళాశాల కార్యదర్శి అమరసుధీర్, ప్రిన్సిపల్ పతంజలిశాస్త్రి తదితరులు

చిట్టినగర్, న్యూస్‌టుడే: పొట్టి శ్రీరాములు చలవాది మల్లికార్జునరావు ఇంజినీరింగ్ కళాశాలలో డిసెంబరు 27, 28 తేదీలలో కృత్రిమ మేధపై అంతర్జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు కళాశాల కార్యదర్శి అమరసుధీర్ తెలిపారు. ఈ సదస్సుకు సంబంధించిన కరపత్రాలను కళాశాలలో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎస్ఈ, డేటా సైన్స్, మాస్టర్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్స్ విభాగాల ఆధ్వర్యంలో నూతన ఆవిష్కరణలను అభివృద్ధి చేయటానికి కృత్రిమ మేధపై అంతర్జాతీయ స్ప్రింగర్ కాన్ఫరెన్స్-2024 నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కళాశాల కోశాధికారి రాఘవయ్య, సహాయ కార్యదర్శి పవన్‌కుమార్, ప్రిన్సిపల్ పతంజలిశాస్త్రి, డేటా సైన్స్, సీఎస్ఈ విభాగాధిపతులు అక్బర్, దుర్గాప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



కమిషనర్‌కు వినతి పత్రం అందిస్తున్న సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు

వీధి విక్రయదారులను ఆదుకోండి

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: బుడమేరు వరద ముంపు బారిన పడి నష్టపోయిన వీధి విక్రయదార్లను ఆదుకోవాలని నగర సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు కమిషనర్ ధ్యానచంద్రను నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో సోమవారం కలిసి వినతి పత్రం సమర్పించారు. సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ... బుడమేరు వరదకు 32 డివిజన్లు ముంపు బారిన పడ్డాయని, ఆ సమయంలో నష్టపోయిన వీధి విక్రయదార్లను ఆదుకుంటామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారని గుర్తు చేశారు. హుద్‌హుద్ తుపాను సమయంలో విశాఖపట్నంలో నష్టపోయిన చిరు వ్యాపారులకు రూ.10 వేల చొప్పున ఆర్థిక సాయం అందించారని గుర్తు చేశారు. అదే విధంగా ఇక్కడ వారికి కూడా ఆర్థిక సాయం చేయాలని కోరారు. వరద సమయంలో సేవలు అందించిన పారిశుద్ధ్య కార్మికులకు ఒక నెల వేతనాన్ని బోనస్‌గా ఇవ్వాలని కోరారు. నాయకులు కె.ఆర్.ఆంజనేయులు, ఎం.సాంబశివరావు, టి.వెంకటేశ్వరరావు, మారుతీరావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అందిన ఫిర్యాదులను విభాగాధిపతులు స్వయంగా పరిశీలించి పరిష్కరించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు. నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. కమిషనర్ మాట్లాడుతూ. . విభాగాధిపతులంతా తమ పరిధిలోని సచివాలయ సిబ్బందిని సమన్వయం చేసుకుంటూ త్వరగా సమస్యలు పరిష్కరించాలని అన్నారు. ఆస్తి పన్ను, రహదారి ఆక్రమణ, సిమెంట్ రోడ్డు నిర్మాణం, అక్రమ నిర్మాణాలు, తాగునీటి సమస్య, బడ్డీకొట్టు తొలగింపు మొగల్రాజపురం బాబూ జగ్జీవన్‌రామ్ సామాజిక భవనం తాళాలు అప్పగించాలంటూ వినతులు అందాయి. అధికారులు డి.చంద్రశేఖర్, జీవీజీఎస్‌వీ ప్రసాద్, శ్రీనాథ్‌రెడ్డి, జి.సృజన, సురేష్ బాబు, పి.సత్యనారాయణ, సత్యకుమార్, మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.



వినతులు స్వీకరిస్తున్న కమిషనర్ ధ్యానచంద్ర

కాలుష్య రహిత నగరంగా తీర్చిదిద్దేందుకు కృషి

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగరాన్ని కాలుష్య రహితంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర వెల్లడించారు. మినిస్ట్రీ ఆఫ్ హౌసింగ్ అండ్ అర్బన్ అఫైర్స్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సుకు నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయం నుంచి సోమవారం ఆయన హాజరయ్యారు. అనంతరం అధికారులతో కమిషనర్ సమావేశమై చర్చించారు. ఆపై మాట్లాడుతూ.. నగరంలో కాలుష్యాన్ని కనిష్ఠ స్థాయికి తెచ్చేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. అధికారులు శ్రీనాథ్‌రెడ్డి, పి.సత్యకుమార్, వెంకటేశ్వరరెడ్డి, బి.సత్యనారాయణ పాల్గొన్నారు.



ఈవో రామారావుకు చెక్కును అందజేస్తున్న కొల్లూరి విజయలక్ష్మి దంపతులు

నిత్యాన్నదానానికి రూ.1,11,111 విరాళం

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం నిత్యాన్నదాన పథకానికి విజయవాడ అయ్యప్ప నగర్‌కు చెందిన కొల్లూరి విజయలక్ష్మి దంపతులు రూ.1,11,111 విరాళాన్ని సోమవారం అందజేశారు. దేవస్థానం ఈవో రామారావు, డిప్యూటీ ఈవో రత్నంరాజు వారికి అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు. ఇంద్రకీలాద్రిపై ధర్మపథం కార్యక్రమంలో భాగంగా విజయవాడకు చెందిన కర్ణాటక సంగీత కళాకారులు జ్యోతి, సూర్యకాంతి, వనజశ్రీ గాత్రం కచేరి భక్తులను సోమవారం అలరించింది.

ఇళ్ల పట్టాల సమస్యలు పరిష్కరించాలని వినతి



ఎంపీ కార్యాలయ సిబ్బంది జగన్మోహనరావుకి వినతి పత్రం అందిస్తున్న బాధితులు

చిట్టినగర్, న్యూస్‌టుడే: పాతరాజరాజేశ్వరీపేట రైల్వే స్థలాల్లో ఉంటున్న ప్రజలు రైల్వే అధికారుల తీరుతో పడుతున్న ఇబ్బందులను పార్లమెంటు సభ్యులు కేశినేని శివనాథ్ దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తామని ఎంపీ కార్యాలయ సిబ్బంది జగన్మోహనరావు చెప్పినట్లు స్థానికులు కుర్షీదా, పాండు తెలిపారు. 56వ డివిజన్ పాతరాజరాజేశ్వరీపేటలో రైల్వే స్థలాల్లో నివాసితులకు పట్టాలు ఇవ్వాలని, రైల్వే అధికారుల తీరు మార్చుకోవాలని కోరుతూ స్థానికులు చేపట్టిన నిరసన ధర్నా 3వ రోజు సోమవారం కొనసాగింది. ఆర్ ఆర్‌పేటలోని రైల్వే అధికారులు నోటీసులు ఇచ్చిన ప్రాంతాలను పరిశీలించినట్లు వివరించారు. ఈ మేరకు సమస్యలు పరిష్కరించాలని, ఇళ్ల పట్టాలు ఇప్పించాలని కోరుతూ వినతి అందించినట్లు తెలిపారు. అనంతరం స్థానిక బాధితులు షాహీన, లత, తదితరులు ధర్నాలో పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితుల అరెస్ట్

మంగళగిరి, న్యూస్‌టుడే: చోరీకి పాల్పడిన ఓ మహిళతో సహా మరో వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. మంగళగిరి గ్రామీణ పోలీసుస్టేషన్‌లో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ మురళీకృష్ణ, సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ వెంకట్ వివరాలు వెల్లడించారు. మిడ్‌వ్యాలీ సిటీలో నివసిస్తున్న డాక్టర్ ఇంట్లో పనిచేస్తోన్న వెంకట రమణ అనే మహిళ దశలవారీగా చోరీకి పాల్పడుతూ వస్తుంది. రోజుకో వస్తువు, నగదును అపహరించుకువెళుతుంది. అనుమానం వచ్చిన సదరు యజమాని ఈ నెల 15న పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు పనిమనిషితోపాటు విజయవాడ సమీపంలోని జక్కంపూడి వైఎస్ఆర్ కాలనీకి చెందిన వేముల వెంకన్న అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించారు. వారి నుంచి సుమారు 30 గ్రాములు బంగారు వస్తువులు, రూ.11.9 లక్షలు నగదు, రూ.1.50 లక్షల విలువైన ద్విచక్ర వాహనం, రూ.1.90 లక్షలు విలువచేసే రెండు మొబైల్ ఫోన్లు మొత్తం రూ.37 లక్షలు సొత్తును వారి నుంచి స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు.

వరదతో పర్యాటక ప్రదేశాలకు తీవ్ర నష్టం



హరిత హోటల్‌ను పరిశీలిస్తున్న ఏపీటీడీసీ ఛైర్మన్ బాలాజీ, అధికారులు

భవానీపురం, న్యూస్‌టుడే: వరద కారణంగా దెబ్బతిన్న పర్యాటక ప్రదేశాల పునరుద్ధరణకు చర్యలు చేపడుతున్నట్లు ఏపీటీడీసీ ఛైర్మన్ నూకసాని బాలాజీ పేర్కొన్నారు. భవానీపురంలోని హరిత హోటల్‌ను ఆయన సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో ఎన్నడూ జరగని రీతిలో వరద కారణంగా హరిత హోటల్, భవానీద్వీపంలకు ఎక్కువగా నష్టం వాటిల్లినట్లు తెలిపారు. వాటిని యధావిధిగా సాధారణ స్థితికి తీసుకువచ్చేందుకు అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. పర్యాటక శాఖ అధికారులు పాల్గొన్నారు.

రూ.10 నాణేలపై అవగాహన

విజయవాడ బస్‌స్టేషన్, న్యూస్‌టుడే : పండిట్ నెహ్రూ బస్టేషన్ డిపాశ్చర్ బ్లాక్‌లో సోమవారం రూ.10 నాణేలపై బ్యాంక్ ఆఫ్ బరోడా బ్యాంకు ఉద్యోగుల ఆధ్వర్యంలో ప్రయాణికులకు రూ. పది నాణెం చెల్లుబాటుపై అవగాహన కల్పించారు. ప్రయాణికులు, వినియోదారులు చాలా వరకు రూ. పది నాణేలను అవగాహన లేకపోవడంతో అవి చెల్లుబాటు కావడంలేదంటున్నారన్నారు. రూ. 10 నాణేలు వాడుకలో ఉన్నాయని ఆర్బీఐ స్వయంగా ప్రకటించిందని తెలిపారు.

విద్యాధరపురం, న్యూస్‌టుడే: చిల్లర కొరత లేకుండా రూ.10నాణాలను వినియోగించుకోవాలని ఇండియన్ బ్యాంక్ జోనల్ మేనేజర్ ఎం.రాజేష్ అన్నారు. కాళేశ్వరరావు మార్కెట్ సెంటరులో ఇండియన్ బ్యాంక్ నిర్వహించిన కాయిన్ మేళా సోమవారం ప్రారంభించారు. అనంతరం రాజేష్ మాట్లాడుతూ.. చిల్లర నాణేల సమస్య లేకుండా ఉండేందుకు రిజర్వు బ్యాంక్ రూ.1, రూ.2, రూ.5, రూ.10నాణేలను అందుబాటులోకి తీసుకువచ్చాయన్నారు. బ్యాంకు సిబ్బంది, వ్యాపారులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య లోపం లేకుండా చర్యలు చేపట్టాలి



పున్నమిఘాట్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ ధ్యానచంద్ర

భవానీపురం, న్యూస్‌టుడే: డ్రోన్‌షో జరిగే పున్నమి, భవానీ స్నానఘాట్‌ల వద్ద పారిశుద్ధ్య లోపం లేకుండా అధికారులు చర్యలు చేపట్టాలని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర పేర్కొన్నారు. డ్రోన్‌షో జరిగే పున్నమి, భవానీ స్నానఘాట్‌లను కమిషనర్ సోమవారం సాయంత్రం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వివిధ విభాగాల అధికారులు సమన్వయంతో పని చేయాలని పేర్కొన్నారు. తాత్కాలిక మరుగుదొడ్లను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. తాగునీటి సరఫరాలో ఏవిధమైన ఇబ్బంది లేకుండా చూడాలని పేర్కొన్నారు. అడిషనల్ కమిషనర్ డి.చంద్రశేఖర్, చీఫ్ ఇంజినీరు శ్రీనాథ్‌రెడ్డి, ఇన్‌ఛార్జి ఆరోగ్య అధికారి సురేష్, తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ల బదిలీ

విజయవాడ నగరపాలక సంస్థ : నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ విభాగంలో సుదీర్ఘకాలంగా పని చేస్తున్న ఇద్దరు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లను ప్రభుత్వం బదిలీ చేసింది. సర్కిల్-1 పరిధిలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా పని చేస్తున్న ఎ.ఎస్.ఎన్. ప్రసాద్‌కు గుడివాడ పురపాలక సంఘానికి, సర్కిల్-2 పరిధిలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా విధులు నిర్వహిస్తున్న వి.చంద్రశేఖర్‌ను మచిలీపట్నం మున్సిపల్ కార్పొరేషన్‌కు పంపించింది. వారిని రిలీవ్ చేస్తూ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాలిచ్చారు.

23 నుంచి కబడ్డీ టోర్నీ

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: స్థానిక ఎస్సారార్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో ఈ నెల 23, 24వ తేదీల్లో కృష్ణా విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల పురుషుల కబడ్డీ పోటీలు, వర్సిటీ జట్టు ఎంపిక చేస్తామని ప్రిన్సిపల్ కె.భాగ్యలక్ష్మి తెలిపారు. టోర్నీలో పాల్గొనే జట్లు ఈ నెల 23వ తేదీ ఉదయం 8 గంటల్లోపు మూడు సెట్ల అర్హతా పత్రాలతో పాటు క్రీడాకారుల గుర్తింపు కార్డులతో కళాశాల వ్యాయామ విద్యాసంచాలకుడు డి.యుగంధర్‌కు రిపోర్టు చేయాలన్నారు. వ్యక్తిగతంగా పోటీలో పాల్గొనే క్రీడాకారులు తగు అర్హత పత్రాలతో అదే రోజు ఉదయం 11 గంటలకు టోర్నీ కార్యనిర్వాహక కార్యదర్శి వద్ద హాజరుకావాలని చెప్పారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

63036 11232



సైడు కాలువలో కదలని మురుగు

? ప్రకాష్‌నగర్‌లో ఉన్న పోలీస్ స్టేషన్ వెనుక మూడో లైన్‌లో.. గోడ కూలి దాని వ్యర్థాలు సైడు కాలువలో పడ్డాయి. కాలువ పూడుకుపోవడంతో నీళ్లు నిలిచిపోతున్నాయి. వ్యాధులబారిన పడే అవకాశాలున్నాయి. - **హేమరాజు, స్థానికుడు**

✔ పరిశీలించి సమస్య పరిష్కరిస్తాం. - **వి.రామకోటేశ్వరరావు, ఏఎంవోహెచ్, వీఎంసీ**

? బీఆర్టీఎస్ రోడ్డులోని హెచ్‌సీజీ క్యాన్సర్ హాస్పిటల్ వద్ద విద్యుత్తు స్తంభం (1/238/503) దీపం కొద్ది రోజులుగా వెలగడం లేదు. రాత్రిళ్లు చీకటిగా ఉంటోంది. - **రాజాబాబు, స్థానికుడు**

✔ దీపం ఏర్పాటు చేస్తాం. - **విమల, ఏఈ, వీఎంసీ.**

– న్యూస్‌టుడే, సీతారాంపురం

ఘంటసాల విగ్రహం ఏర్పాటుకు కృషి

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే : రాజధాని అమరావతిలో 25 అడుగుల ఘంటసాల విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు తెలిపారు. ఘంటసాల చైతన్య వేదిక ఆధ్వర్యంలో కౌతా కళా వేదికపై నిర్వహిస్తున్న రాష్ట్ర మహాసభలు సోమవారం ముగిశాయి. ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. తెలుగు జాతిని జాగృత పరిచిన ఎన్టీఆర్‌తో పాటు ఘంటసాలకు కేంద్ర ప్రభుత్వం భారతరత్న ఇవ్వాల్సిన అవసరాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళతానని చెప్పారు. రాజధానిలో మహనీయుల విగ్రహాలను ఏర్పాటు చేసేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. చింతకాయల చిట్టిబాబు అధ్యక్షత వహించారు. సినీ సంగీత విభావరి అలరించింది. గాయకులను ఎమ్మెల్యే ఉమా సత్కరించారు. తెదేపా నాయకుడు సాంబశివరావు, వేదిక అధ్యక్షుడు వెంకటేశ్వరరెడ్డి, డేవిడ్‌రాజు, శింగంశెట్టి చంద్రశేఖర్, బి.ఆంజనేయరాజు, కారుమంచి రాజు, జి.రంగారెడ్డి, కె.వి.ప్రసాద్, ఎం.శ్రీనివాస్, నాగేంద్ర పాల్గొన్నారు.

నిధులు మింగారు.. ఉద్యానాలు వదిలేశారు

ఆట పరికరాల కొరత | ఆహ్లాదం అంతంతే..

మానసిక ఉల్లాసానికి, వికాసానికి ఆటలు ఎంతో దోహదం చేస్తాయి. పాఠశాలలో పుస్తకాలతో కుస్తీలు పట్టే చిన్నారులు.. సాయంత్రం వేళ కాసేపు ఆడుకుందామని పార్కులకు వెళుతుంటే.. నిరాశే ఎదురవుతోంది. వసతులు, పరికరాలు లేక నిరుత్సాహానికి గురవుతున్నారు. గత వైకాపా ప్రభుత్వం అభివృద్ధి చేశామని డప్పుకొట్టింది. క్షేత్రస్థాయిలో చూస్తే.. దానికి భిన్న పరిస్థితులు నెలకొన్నాయి. పిల్లలు ఆడుకునే అవకాశాలే లేకుండా పోయాయి.

ఇదేనా ఆధునికీకరణ..?

సత్యనారాయణపురం, న్యూస్‌టుడే



శాస్త్రి ఉద్యానంలో విరిగిన బల్లలు



ఆంధ్రరత్న పార్కులో చిన్నారులను ఊయల ఊపుతున్న తల్లిదండ్రులు

సత్యనారాయణపురంలో రెండు పార్కులు ఉన్నాయి. నిర్వహణ లేకపోవడంతో ప్రజలకు ఆహ్లాదం పంచడం లేదు. ఆంధ్రరత్న పార్కులో ఈ ఏడాది ఫిబ్రవరిలో రూ.20 లక్షలతో ఆధునికీకరించారు. కానీ పిల్లలకు కావాల్సిన ఆట పరికరాలు లేకపోవడం శోచనీయం. చిన్నారులు ఎక్కువగా ఇష్టపడే ఊయలలు లేవు. ఉన్నవాటిని బాగు చేయలేదు. రెండేసి ఊయలలు ఉండాల్సిన చోట ఒకటే ఉంది. మరో రెండు విరిగిపోయాయి. గతంలో నమూనా విమానం ఉండేది. దానిని ఎక్కి ఆడేందుకు పిల్లలు ఎంతో ఉత్సాహం చూపించేవారు. అది విరిగిపోవడంతో తీసేశారు. మరో ఆటపరికరం విరిగిపోతే.. దానినీ పడేశారు.

షటిల్ కోర్టుతో ఆటంకం.. ఒకపక్క పిల్లలకు ఆటపరికరాలు చాలక ఉన్న స్థలం ఇరుకైపోయి ఇబ్బంది పడుతున్నారు. ఇక్కడే పెద్దల కోసం షటిల్ కోర్టు నిర్మించారు. దీనివల్ల సాయంకాలం పిల్లల్ని పార్కుకు తీసుకువచ్చే మహిళలు, ఆటలాడే పిల్లలు ఇబ్బందిపడుతున్నారు. షటిల్ ఆడేవారికి ఉదయపూటే అనుమతివ్వాలి, సాయంత్రం పిల్లలకే అవకాశం ఇవ్వాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. అదనపు బెంచీలు అవసరం.

ఆడుకునేదెక్కడ..?.. జీ.వి.ఎస్.శాస్త్రిపార్కులో సువిశాలమైన స్థలం ఉంది. ఇందులో మూడొంతుల ప్రాంతాన్ని స్కేటింగ్ రింక్ నిర్మాణాలు ఆక్రమించాయి. స్థలం చాలక పిల్లలు కిందనే ఆటలాడుతున్నారు. కూర్చునేందుకు బల్లలు లేవు. సేదతీరుదామన్నా పచ్చదనం లేదు. పెద్దలు వ్యాయామం చేసేందుకు పరికరాలు లేవు. కానీ చిన్నారులకు అవసరమైనవి లేవు. ఇసుకలోనే ఆడుకుంటున్నారు. తల్లిదండ్రులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.


వస్తువులు లేకపోవడం లోపం



సత్యనారాయణపురంతో పాటు దుర్గాపురం, బావాజీపేట, లక్ష్మీనగర్ తదితర ప్రాంతాల ప్రజలు, ఎక్కువ మంది పిల్లలు పార్కుకు వస్తుంటారు. చిన్నారుల ఆట పరికరాలు లేకపోవడం పెద్ద లోపం. స్థలం కూడా లేదు. ఉన్నదానిని అభివృద్ధిచేసి, మరికొన్ని ఆటవస్తువులు పెడితే బాగుంటుంది. పచ్చదనం పెంచాలి. - **సంతోష్, స్థానికుడు, సత్యనారాయణపురం**

ఎక్కడి పనులు అక్కడే..

సీతారాంపురం, న్యూస్‌టుడే



పార్కు స్థలంలో పెరిగిన పిచ్చి మొక్కలు



రోడ్డుపైనే క్రికెట్ ఆడుకుంటూ..

సీతారాంపురం రైవస్ కాలువ గట్టుపై పార్కు కార్యరూపం దాల్చలేదు. కొత్తవంతెన నుంచి అల్లూరి సీతారామరాజు వంతెన వరకు పార్కు ఏర్పాటుకు సుమారు మూడేళ్ల కిందటే చదును చేశారు. గృహాలు, షెడ్లు తొలగించారు. అప్పటి ఎమ్మెల్యే మల్లాది విష్ణు శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. పచ్చిక మైదానం, వాకింగ్ ట్రాక్, చిన్నారులు ఆడుకునేందుకు వీలుగా ఆట పరికరాలు ఏర్పాటు చేస్తామన్నారు. పనులు చేసే గుత్తేదారులు ఇప్పటికే ఇద్దరు మారారు. మూడేళ్ల గడచినా ముందడుగు పడలేదు. పిచ్చి మొక్కలు మొలిచాయి. ఆ స్థలంలో ప్రజలు దుస్తులు ఆరబెట్టుకుంటున్నారు. ఈ ప్రాంతంలో సుమారు ఏడు వందల కుటుంబాలు నివసిస్తున్నాయి. సుమారు మూడు వేల మంది జీవిస్తున్నారు. వీరందరికీ ఆహ్లాదం కరవవుతోంది.

అభివృద్ధి చేయాలి..



పార్కు పనుల కోసం ఇద్దరు కాంట్రాక్టర్లు మారారు. సుమారు 100మీ. మేర ఎర్రమట్టి వేశారు. వాకింగ్ ట్రాక్ కోసం సిమెంటు దిమ్మెలు వేశారు. కాలువలో నీళ్లు ఎక్కువగా వచ్చినప్పుడు.. పాములు ఇళ్లల్లోకి వచ్చే అవకాశం ఉంది. స్థల సేకరణ చేసినప్పుడు చెట్లు అన్నీ కొట్టేశారు. ఇప్పుడు మళ్లీ పిచ్చి మొక్కలు బాగా పెరిగాయి. పార్కును అభివృద్ధి చేస్తే మాకు ప్రయోజనకరంగా ఉంటుంది. - **వరలక్ష్మి, స్థానికురాలు**

ఆడుకోవాలని ఉంది..



పార్కు నిర్మాణం పూర్తయితే జాగింగ్ చేసుకోవడానికి, ఆటలు ఆడుకునేందుకు అనువుగా ఉంటుంది. సెలవు రోజుల్లో ఎస్సారార్ ప్రభుత్వ కళాశాల మైదానానికి వెళ్లి ఆడుకుంటున్నాం. స్థానికంగానే పార్కు ఉంటే.. బాగుంటుంది. అందులోనే ఆడుకుంటాం. అధికారులు చర్యలు తీసుకోవాలి. - **బి.మోహిత్, విద్యార్థి**

మురుగు పొంగి.. దుర్గంధం



పురుషోత్తం వీధిలో...

సత్యనారాయణపురం, ముత్యాలంపాడు, భానునగర్ ప్రాంతాల్లో డ్రైనేజీలు పొంగిపొర్లుతున్నాయి. స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సత్యనారాయణపురం పురుషోత్తం వీధిలో గత రెండు రోజులుగా మురుగు నీరంతా రహదారిపై ప్రవహిస్తోంది. ఇది తాగునీటి కుళాయిల్లో కలుస్తోందని స్థానికులు వాపోతున్నారు. నగరపాలక సంస్థ సిబ్బంది పట్టించుకోవడం లేదని వారు ఆరోపిస్తున్నారు. పలు చోట్ల రహదార్లపై చెత్త పోయడంతో దుర్వాసన వెదజల్లుతోంది. సత్యనారాయణపురం పార్కు రోడ్డు, బీఎస్ఎన్ఎల్ కార్యాలయం సమీపంలోనూ ఇష్టానుసారంగా రహదారిపై చెత్త పోస్తున్నారు. చెత్త తరలింపులో సిబ్బంది శ్రద్ధచూపడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు.

- న్యూస్‌టుడే, సత్యనారాయణపురం

నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

గవర్నర్‌పేట, మధురానగర్, న్యూస్‌టుడే : విద్యుత్తులైన్ల తనిఖీలు, మరమ్మతులు కారణంగా పలు ప్రాంతాలకు మంగళవారం విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.రవీంద్రబాబు ఓ ప్రకటనలో తెలిపారు. గవర్నర్‌పేట విద్యుత్తు సెక్షన్ పరిధిలో ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు.. మూర్తి వీధి, కూర్మయ్యవీధి, నసురుల్లాఖాన్ వీధి, హుస్సేన్‌సాహెబ్ వీధి, మౌలానా వీధి, చెరుకుపల్లి వారి వీధి, కాళేశ్వరరావు రోడ్డు, వెంకటేశ్వరరావు వీధి, రామమందిరం వీధి, మల్లాది వారి వీధికి విద్యుత్తు ఉండదు. మధురానగర్ విద్యుత్తు సెక్షన్ పరిధిలో ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు.. మధురానగర్ మెయిన్ రోడ్డు, లెక్చరర్స్‌కాలనీ, ఇందిరాకాలనీ, రైల్వేసొసైటీ కాలనీ, రాగంమస్తాన్‌రావురోడ్డు జాన్ టీ స్టాల్ నుంచి రామాలయం వరకు... తదితర ప్రాంతాల్లో సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ వివరించారు.


గాంధీనగర్, న్యూస్‌టుడే : విద్యుత్తు లైన్ల మరమ్మతుల దృష్ట్యా మంగళవారం ఉదయం 8 గంటల నుంచి 10 వరకు గాంధీనగర్ సెక్షన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ పి.రవీంద్రబాబు ఓ ప్రకటనలో తెలిపారు. ఆంధ్రరత్న రోడ్డు, ఎన్ఆర్‌పీ రోడ్డు, నర్రా వారి వీధి, గల్లా వారి వీధి, హిందీ వీధి, జ్ఞానోలైవ్ వీధి, ఫిల్మ్ ఛాంబర్, అన్నపూర్ణ రోడ్డు, జమీందారు వీధి, సన్యాసిరాజు వీధి, రైల్వేస్టేషన్ రోడ్డు, గాంధీనగర్, సాంబమూర్తి రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్తు ఉండదని ఆయన వివరించారు.


'50 రోజులు గడిచినా అందని సాయం'




బాధితులతో మాట్లాడుతున్న బాబూరావు

అజిత్‌సింగ్‌నగర్ (మధురానగర్), న్యూస్‌టుడే : బుడమేరుకు వరద వచ్చి 50 రోజులు గడిచినా ఇంకా అనేక మందికి వరద సాయం అందలేదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సి.హెచ్. బాబూరావు పేర్కొన్నారు. సోమవారం ఆయన పాయకాపురం, అజిత్‌సింగ్‌నగర్‌లోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. ఈ నెల 23న నార్త్ ఎమ్మార్వో కార్యాలయం వద్ద నిర్వహించే ధర్నాకు తరలిరావాలని పిలుపునిచ్చారు. కొంత మందిని మొదటి అంతస్తులో ఉన్నట్లు నమోదు చేశారని, మరికొందరికి ద్విచక్రవాహనాలకు రూ.3వేలు ఇచ్చి.. ఇంటి నష్టానికి ఇవ్వాల్సిన రూ.25వేలు ఇవ్వలేదని విమర్శించారు. తోపుడు బండ్లు, చిరువ్యాపారులకు చిల్లిగవ్వ ఇవ్వలేదని పేర్కొన్నారు. సాయం అందని బాధితులంతా ధర్నాకు హాజరవ్వాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బి.రమణారావు, సి.హెచ్.శ్రీనివాస్, నిజాముద్దీన్, అరుణ, విజయ తదితరులు పాల్గొన్నారు.







వినువీధిలో కనువిందు



పున్నమి ఘాట్‌లో డ్రోన్ షోకు సర్వం సిద్ధమైంది. మంగళవారం బుల్లి విహంగాల ప్రదర్శన నేపథ్యంలో సోమవారం రాత్రి నిర్వాహకులు ట్రయల్ రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆకాశంలో వేలాది డ్రోన్లు వివిధ ఆకారాల్లో కనువిందు చేశాయి. వినువీధిలో ఒక్కసారిగా వెలుగులు రావడంతో ప్రజలు ఆసక్తిగా తిలకించారు. - **భవానీపురం, న్యూస్‌టుడే**



డ్రోన్లు ఉంచేందుకు వేసిన కార్పెట్‌లు



పోలీసు సిబ్బందికి సూచనలు చేస్తున్న ఉన్నతాధికారులు

ముగ్గురు వైకాపా కార్పొరేటర్లు తెదేపాలో చేరిక

పటమట, న్యూస్‌టుడే: విజయవాడలో వైకాపాకు వరుస ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. గతంలో పశ్చిమ నియోజకవర్గానికి చెందిన ముగ్గురు వైకాపా కార్పొరేటర్లు ఎంపీ కేశినేని శివనాథ్ సమక్షంలో తెదేపాలో చేరారు. సోమవారం సెంట్రల్ నియోజకవర్గానికి చెందిన వైకాపా కార్పొరేటర్లు కె.లక్ష్మీపతి, రమాదేవి, తిరుపతమ్మ తమ అనుచరులతో కలిసి తెదేపా తీర్థం పుచ్చుకున్నారు. వారికి ఎంపీ శివనాథ్, సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. తమది మంచి ప్రభుత్వమని ప్రజలు విశ్వసిస్తున్నారని పేర్కొన్నారు. విజయవాడకు వరద వచ్చినప్పుడు సీఎం చంద్రబాబు స్పందించిన తీరు అద్భుతమని కొనియాడారు. కూటమి ప్రభుత్వంతోనే ప్రజలు కష్టాలు తీరుతాయని భావిస్తున్న వైకాపా నాయకులు తెదేపాలో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారని అన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ... వరద ప్రాంతాల్లో చంద్రబాబు చేసిన సేవలు చూసి వైకాపా నాయకులే మెచ్చుకుంటున్నారని పేర్కొన్నారు. ప్రజాసేవ పట్ల అంకితభావం ఉన్న వారినే పార్టీలో చేర్చుకుంటున్నామని వెల్లడించారు. కూటమి నాయకులతో కలిసి డివిజన్ల అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. తెదేపా నాయకులు బొప్పన భవకుమార్, నవనీతం సాంబశివరావు, చెన్నుపాటి ఉషారాణి, మాదిగాని గురునాథం, రమణ, సొంగా సంజయ్‌వర్మ తదితరులు పాల్గొన్నారు.



ఎంపీ శివనాథ్, ఎమ్మెల్యే ఉమాలతో కార్పొరేటర్లు లక్ష్మీపతి, రమాదేవి, తిరుపతమ్మ తదితరులు

జీఎస్టీ చీఫ్ కమిషనర్‌తో భేటీ



పుష్పగుచ్ఛం అందజేస్తున్న భాస్కరరావు

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే : ఆంధ్రప్రదేశ్ ఫెడరేషన్ ఆఫ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు వక్కలగడ్డ భాస్కరరావు సోమవారం తాడేపల్లిలోని ఆంధ్రప్రదేశ్ జీఎస్టీ కార్యాలయంలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన చీఫ్ కమిషనర్ అహ్మద్‌బాబును మర్యాదపూర్వకంగా కలిశారు. జీఎస్టీలో సమస్యలు, ఏపీ జీఎస్టీ అడ్వైజరీ కమిటీ, ఏపీ జీఎస్టీ గ్రీవెన్స్‌కు వచ్చిన సమస్యలను ఆయనకు వివరించారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించినట్లు భాస్కరరావు తెలిపారు.

సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు



విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అందిన ఫిర్యాదులను విభాగాధిపతులు స్వయంగా పరిశీలించి పరిష్కరించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు. నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. కమిషనర్ మాట్లాడుతూ.. విభాగాధిపతులంతా తమ పరిధిలోని సచివాలయ సిబ్బందిని సమన్వయం చేసుకుంటూ త్వరగా సమస్యలు పరిష్కరించాలని అన్నారు. ఆస్తి పన్ను, రహదారి ఆక్రమణ, సిమెంట్ రోడ్డు నిర్మాణం, అక్రమ నిర్మాణాలు, తాగునీటి సమస్య, బడ్డీకొట్టు తొలగింపు మొగల్రాజపురం బాబూ జగ్జీవన్‌రామ్ సామాజిక భవనం తాళాలు అప్పగించాలంటూ వినతులు అందాయి. అధికారులు డి.చంద్రశేఖర్, జీవీజీఎస్‌వీ ప్రసాద్, శ్రీనాథ్‌రెడ్డి, జి.సృజన, సురేష్‌బాబు, పి.సత్యనారాయణ, సత్యకుమార్, మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

వినతులు స్వీకరిస్తున్న కమిషనర్ ధ్యానచంద్ర

అందుబాటులో ఆధునిక వస్త్రాలు



షోరూమ్‌ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఉమామహేశ్వరరావు. పక్కన ఈవో రామారావు, షోరూమ్ ఛైర్మన్ పెరుమాళ్లరెడ్డి

మొగల్రాజపురం (చుట్టుగుంట), న్యూస్‌టుడే : మొగల్రాజపురం నిమ్మతోట కూడలిలో 'హైప్స్ వి సిల్క్స్'ను సోమవారం వైభవంగా ప్రారంభించారు. ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, బొండా ఉమామహేశ్వరరావు, శ్రీదుర్గామల్లేశ్వర దేవస్థానం ఈవో రామారావులు అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఇప్పటి వరకు శ్రీకాళహస్తి వస్త్ర ప్రేమికులను అలరిస్తున్న 'హైప్స్ వి సిల్క్స్'.. ఇప్పుడు విజయవాడ నగరవాసుల చెంతకు వచ్చినట్లు చెప్పారు. దేశవ్యాప్తంగా ప్రఖ్యాతిగాంచిన కంచి, బెనారస్, సికో, కోట, బగాకోపురి మొదలైన చీరలు, పట్టు వస్త్రాలను ఆధునిక డిజైన్లలో అందిస్తున్నట్లు షోరూమ్ జనరల్ మేనేజర్ ఎం.భరత్ తెలిపారు. కార్యక్రమాన్ని దిగ్విజయం చేసిన ప్రతి ఒక్కరికీ షోరూమ్ ఛైర్మన్ పి.ఎస్.పెరుమాళ్లరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. పలువురు పురప్రముఖులు, శ్రేయోభిలాషులు, వినియోగదారులు పాల్గొన్నారు.

కాలుష్య రహితంగా నగరం

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగరాన్ని కాలుష్య రహితంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర వెల్లడించారు. మినిస్ట్రీ ఆఫ్ హౌసింగ్ అండ్ అర్బన్ అఫైర్స్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సుకు నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయం నుంచి సోమవారం ఆయన హాజరయ్యారు. అనంతరం అధికారులతో కమిషనర్ సమావేశమై చర్చించారు. ఆపై మాట్లాడుతూ.. నగరంలో కాలుష్యాన్ని కనిష్ఠ స్థాయికి తెచ్చేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. తాగునీటి సరఫరా మెరుగుపర్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని, వాడుక నీటి శుద్ధిపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని అన్నారు. నగరంలో పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. అధికారులు శ్రీనాథ్‌రెడ్డి, పి.సత్యకుమార్, వెంకటేశ్వరరెడ్డి, బి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అందని తాగునీరు

ప్రజల గగ్గోలు

మధురానగర్, న్యూస్‌టుడే : నగరంలో 24 గంటలూ తాగు నీరు అందిస్తామంటూ అర్భాటంగా ప్రారంభించిన పథకం ఆదిలోనే జనాలకు చుక్కలు చూపిస్తోంది. మధురానగర్‌ను పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి.. పైపులు వేశారు. 24 గంటల నీరు ఏమోగానీ.. ఇప్పుడు బిందె నిండటం గగనమైపోయింది. మోటారు వేస్తేనే గుక్కెడు నీళ్లు వస్తున్నాయని పసుపుతోట, మధురానగర్ వాసులు గగ్గోలు పెడుతున్నారు. మధురానగర్‌కు రెండు వాటర్ రిజర్వాయర్లు ఉన్నా... నీటి కోసం వెంపర్లాడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యలపై మధురానగర్ పసుపుతోట కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్.. అధికారులు, ప్రజా ప్రతినిధులకు వినతిపత్రాలను అందించింది. మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్రను కలిసి, వినతిపత్రం సమర్పించింది. దీనికి ముందు ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావును కలిసింది. 24×7 పేరిట పైపులు వేసిన నాటి నుంచి ఇబ్బందులు వస్తున్నాయని.. ఆ సమస్యను పరిష్కరించాలని అసోసియేషన్ కార్యదర్శి తిరుమలరావు, అధ్యక్షుడు వి.హెచ్.సి.బి.వి.ప్రసాద్ విజ్ఞప్తి చేశారు.

వీధి విక్రయదారులను ఆదుకోండి

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: బుడమేరు వరద ముంపు బారిన పడి నష్టపోయిన వీధి విక్రయదార్లను ఆదుకోవాలని నగర సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు కమిషనర్ ధ్యానచంద్రను నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో సోమవారం కలిసి వినతి పత్రం సమర్పించారు. సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ... బుడమేరు వరదకు 32 డివిజన్లు ముంపు బారిన పడ్డాయని, ఆ సమయంలో నష్టపోయిన వీధి విక్రయదార్లను ఆదుకుంటామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారని గుర్తు చేశారు. హుద్‌హుద్ తుపాను సమయంలో విశాఖపట్నంలో నష్టపోయిన చిరు వ్యాపారులకు రూ.10 వేల చొప్పున ఆర్థిక సాయం అందించారని గుర్తు చేశారు. అదేవిధంగా ఇక్కడ వారికి కూడా ఆర్థిక సాయం చేయాలని కోరారు. వరద సమయంలో సేవలు అందించిన పారిశుద్ధ్య కార్మికులకు ఒక నెల వేతనాన్ని బోనస్‌గా ఇవ్వాలని కోరారు. నాయకులు కె.ఆర్.ఆంజనేయులు, ఎం.సాంబశివరావు, టి.వెంకటేశ్వరరావు, మారుతీరావు పాల్గొన్నారు.

విరాళాలతో పుస్తకాల పంపిణీ

పాయకాపురం (మధురానగర్), న్యూస్‌టుడే : వరదల్లో నష్టపోయిన విద్యార్థులను ఆదుకునేందుకు మానవత స్వచ్ఛంద సంస్థ ముందుకు వచ్చింది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సంస్థ శాఖల ద్వారా సేకరించిన విరాళాలతో రాత పుస్తకాలను కొనుగోలు చేసింది. వీటిని పాఠశాలల్లో విద్యార్థులకు అందించింది. పాయకాపురంలోని బి.వి.సుబ్బారెడ్డి పాఠశాల, పుచ్చలపల్లి సుందరయ్య పాఠశాల విద్యార్థులకు విజయవాడ శాఖ ఛైర్మన్ వేమూరి బాబూరావు చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బాలోత్సవ్ కమిటీ అధ్యక్షుడు పి.మురళీకృష్ణ, మైనం హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా వర్సిటీ బ్యాడ్మింటన్ విజేత పీబీ సిద్ధార్థ

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: స్థానిక పీబీ సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఆధ్వర్యంలో జరిగిన కృష్ణా విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల బ్యాడ్మింటన్ (పురుషుల) పోటీలు, వర్సిటీ జట్టు ఎంపిక పోటీల్లో ఆతిథ్య కళాశాల జట్టు విన్నర్ ట్రోఫీ కైవసం చేసుకుంది. సోమవారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో పీబీ సిద్ధార్థ కళాశాల జట్టు ఏఎన్నార్ కళాశాల (గుడివాడ) జట్టుపై విజయం సాధించింది. తృతీయ స్థానం కానూరులోని ఎస్వీడీ న్యాయ కళాశాల జట్టు కైవసం చేసుకుంది. బహుమతి ప్రదానోత్సవానికి కళాశాల పీజీ డీన్ రాజేష్ సి.జంపాల, వాసిరెడ్డి నాగేశ్వరరావు (పీడీ, కేవీఆర్ కళాశాల, నందిగామ), ఆర్.రఘురామ్ (పీడీ, సప్తగిరి కళాశాల, విజయవాడ) హాజరై విజేతలకు ట్రోఫీలు బహూకరించారు. కళాశాల వ్యాయామ విద్యా విభాగాధిపతి టీవీబీ కృష్ణారెడ్డి పర్యవేక్షించారు.

వచ్చే ఏడాది నుంచి 'పది'లో అంతర్గత మార్కులు

ఈనాడు, అమరావతి: వచ్చే విద్యా సంవత్సరం నుంచి పదో తరగతిలోనూ అంతర్గత మార్కుల విధానాన్ని ప్రవేశపెట్టాలని పాఠశాల విద్యాశాఖ భావిస్తోంది. సిలబస్ మార్పు చేసినందున పరీక్ష విధానంలోనూ మార్పులు తీసుకువచ్చేందుకు కసరత్తు చేస్తోంది. ప్రస్తుతం ప్రభుత్వ, ప్రైవేట్‌లోని అన్ని పాఠశాలలకూ జాతీయ విద్య పరిశోధన, శిక్షణ మండలి (ఎన్‌సీఈఆర్టీ) సిలబస్‌నే అమలు చేస్తున్నారు. విద్యార్థులు ఎన్‌సీఈఆర్టీ సిలబస్ చదువుతూనే రాష్ట్ర బోర్డు పరీక్షలు రాస్తున్నారు. అయితే సీబీఎస్‌ఈ విధానంలో అంతర్గత మార్కుల విధానం ఉంది. గతంలో నిరంతర, సమగ్ర మూల్యాంకనం (సీసీఈ) విధానంలో అంతర్గత మార్కులు ఉండగా.. 2019లో వీటిని రద్దు చేశారు. అంతర్గత మార్కుల విషయంలో ప్రభుత్వ బడులు నిబంధనలు పాటిస్తున్నా.. ప్రైవేటు పాఠశాలలు ఇష్టారాజ్యంగా మార్కులు వేసుకుంటున్నాయని ఫిర్యాదులు రావడంతో ఆ విధానాన్ని రద్దు చేశారు. ఇప్పుడు 2025-26 విద్యా సంవత్సరం నుంచి పదిలో రాత పరీక్షకు 80 మార్కులు, అంతర్గతంగా 20 మార్కులు ఇచ్చేందుకు అధికారులు కసరత్తు చేపట్టారు. పాఠశాలలు ఇష్టారాజ్యంగా మార్కులు వేసుకోకుండా పకడ్బందీ విధానాన్ని తీసుకువచ్చేలా ఆలోచన చేస్తున్నారు. సీబీఎస్‌ఈలో అంతర్గత మార్కులు 20కి 20 వేసుకోకుండా ప్రత్యేక విధానాన్ని అమలు చేస్తున్నారు. అలాంటి దాన్నే తీసుకురావాలని భావిస్తున్నారు. ప్రస్తుతం పదోతరగతి పరీక్షల్లో సూక్ష్మ, లఘు ప్రశ్నలు 12 ఉండగా.. వీటికి ఒక్కో దానికి అరమార్కు, తేలికైన 8 ప్రశ్నలకు ఒక్కో మార్కు ఉండగా.. వీటిని ఒక్కో మార్కు ప్రశ్నలుగా మార్పు చేయాలనే దానిపైనా కసరత్తు చేస్తున్నారు.

ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు కోర్టు సమన్లు

ఈనాడు, హైదరాబాద్: తిరుమల శ్రీవారి లడ్డూ అంశంలో ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చేసిన వ్యాఖ్యలపై తాను పిటిషన్ వేయగా సిటీ సివిల్ కోర్టు పవన్‌కు సమన్లు జారీ చేసినట్లు న్యాయవాది ఇమ్మనేని రామారావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. తిరుమల లడ్డూ విషయంలో పవన్ భక్తుల మనోభావాలు దెబ్బతినేలా వ్యాఖ్యలు చేశారని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఆధారాల్లేకుండానే లడ్డూల్లో కల్తీ జరిగిందని పవన్ మాట్లాడారని, ఆ వ్యాఖ్యలను సామాజిక మాధ్యమాల నుంచి తొలగించాలని రామారావు కోరారు.



దిల్లీలో ఇండియన్ సెల్యులర్ అండ్ ఎలక్ట్రానిక్స్ అసోసియేషన్ ప్రతినిధులతో సమావేశమైన మంత్రి లోకేశ్

ఆంధ్రాలో పెట్టుబడులు పెట్టండి

- ఐసియా ప్రతినిధులకు మంత్రి లోకేశ్ ఆహ్వానం
- రాష్ట్రంలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్కిల్స్ ఏర్పాటు చేయండి
- కేంద్ర మంత్రి జయంత్ చౌధరికి వినతి

ఈనాడు, దిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో దేశంలోనే అత్యుత్తమ పారిశ్రామిక విధానాన్ని అమల్లోకి తెచ్చి, అన్ని రకాల పరిశ్రమలకు అనువైన వాతావరణం నెలకొల్పుతున్నామని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ చెప్పారు. రాష్ట్రంలో పెద్దఎత్తున పెట్టుబడులు పెట్టాలని పారిశ్రామికవేత్తలను ఆహ్వానించారు. రాష్ట్రానికి పెట్టుబడులు, నైపుణ్యాభివృద్ధి సంస్థలను సాధించేందుకు సోమవారం ఆయన దిల్లీలో ఇండియన్ సెల్యులర్ అండ్ ఎలక్ట్రానిక్స్ అసోసియేషన్ (ఐసీఈఏ) ప్రతినిధులు, కేంద్ర నైపుణ్యాభివృద్ధి శాఖ మంత్రి జయంత్‌చౌధరితో వేర్వేరుగా సమావేశమయ్యారు. తొలుత ఐసీఈఏ ఛైర్మన్ పంకజ్ మహీంద్ర అధ్యక్షతన జరిగిన సెల్యులర్, ఎలక్ట్రానిక్స్ అసోసియేషన్ ప్రతినిధుల సమావేశంలో పాల్గొని ఆంధ్రప్రదేశ్‌ను ఎలక్ట్రానిక్స్ హబ్‌గా మార్చడానికి తీసుకుంటున్న చర్యల గురించి వివరించారు. తాము ఐటీ, ఎలక్ట్రానిక్స్ రంగంలో దేశంలోని రాష్ట్రాలతో మాత్రమే కాకుండా దిగ్గజ దేశాలతో పోటీపడుతున్నట్లు తెలిపారు. పేరొందిన పారిశ్రామికవేత్తలతో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేసి పరిశ్రమల స్థాపనలో ఎదురవుతున్న విధానపరమైన సమస్యలను పరిష్కరిస్తున్నామని చెప్పారు. ఐటీ, ఎలక్ట్రానిక్స్ పరిశ్రమల కోసం అనువైన విధానాన్ని రూపొందించి ప్రోత్సాహకాలు అందించబోతున్నామని.. అందువల్ల ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానించారు. విశాఖపట్నాన్ని ఐటీ పవర్‌హౌస్‌గా, అంతర్జాతీయ ఏఐ రాజధానిగా తీర్చిదిద్దాలని, తిరుపతిని ఎలక్ట్రానిక్స్ హబ్‌గా మారాల్సన్న లక్ష్యసాధనకు సహకరించాలని సెల్యులర్, ఎలక్ట్రానిక్స్ అసోసియేషన్ ప్రతినిధులను కోరారు.



కేంద్ర నైపుణ్యాభివృద్ధి శాఖ మంత్రి జయంత్‌చౌధరితో మంత్రి లోకేశ్

ఏపీలో నైపుణ్యాభివృద్ధి కేంద్రాలు ఏర్పాటు చేయండి

ఆంధ్రప్రదేశ్ యువత నైపుణ్యాభివృద్ధి కోసం అమరావతి, విశాఖపట్నంలలో స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థలు ఏర్పాటు చేయాలని మంత్రి నారా లోకేశ్ కేంద్ర నైపుణ్యాభివృద్ధి శాఖ మంత్రి జయంత్‌చౌధరిని కోరారు. ఆయన సోమవారం దిల్లీలో కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడితో కలిసి జయంత్‌చౌధరితో సమావేశమయ్యారు. 'ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యంలో అమరావతిలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్కిల్స్, స్కిల్ ఇండియా ఇంటర్నేషనల్ సెంటర్లను నెలకొల్పండి. విశాఖపట్నంలో కేటాయించిన ఏడెకరాల్లో జాతీయ నైపుణ్య శిక్షణ కేంద్రం ఏర్పాటు చేయండి. మంగళగిరిలో జెమ్స్ అండ్ జువెలరీ, అమరావతిలో నిర్మాణ రంగం, కర్నూలులో పునరుత్పాదక ఇంధనం, చేనేత-హస్తకళలు, విశాఖపట్నంలో ఫార్మా ల్యాబ్స్, నెల్లూరు, తిరుపతిల్లో ఎలక్ట్రానిక్ సిస్టమ్ డిజైన్ మాన్యుఫ్యాక్చరింగ్‌కు చెందిన ఎక్సలెన్స్ సెంటర్ల ఏర్పాటుకు కేంద్ర స్కిల్ కౌన్సిల్ నుంచి సహకారం అందించండి. గిరిజన ప్రభావిత ప్రాంతాల్లో నైపుణ్య శిక్షణ కేంద్రాల ఏర్పాటుకు నిధులివ్వండి' అని కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశారు. పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్, డైరెక్టర్ విజయరామరాజు, ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఎండీ గణేష్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రశ్నిస్తే కేసులు.. ఎదురు తిరిగితే దాడులు

- తండ్రి విశ్వరూప్ అధికారంతో రెచ్చిపోయిన శ్రీకాంత్
- దళిత యువకుడి హత్య కేసులో సూత్రధారిగా నిర్ధారణ



ఆదివారం రాత్రి మదురైలో పోలీసుల అదుపులో శ్రీకాంత్

ఈనాడు, రాజమహేంద్రవరం, న్యూస్‌టుడే, అమలాపురం పట్టణం, పి.గన్నవరం: అధికార బలంతో రెచ్చిపోయారు. తండ్రి మంత్రి పదవిని అడ్డం పెట్టుకొని ఇష్టారాజ్యంగా ప్రవర్తించారు. ఎవరైనా ప్రశ్నిస్తే.. పోలీస్ స్టేషన్‌కు పిలిపించి వారిని ఇబ్బంది పెట్టడం.. దూషణలకు పాల్పడేవారు. వైకాపా ప్రభుత్వ హయాంలో డా. బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం మాజీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి పినిపె విశ్వరూప్ తనయుడు శ్రీకాంత్ వ్యవహారశైలి ఇది. 2022 జూన్ 6న జరిగిన అయినవిల్లికి చెందిన దళిత యువకుడు, వాలంటీర్ జనుపల్లి దుర్గాప్రసాద్ హత్య కేసులో ప్రధాన సూత్రధారి శ్రీకాంత్‌ను తమిళనాడులోని మదురైలో ఆదివారం రాత్రి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గతేడాది అంబేడ్కర్ జయంతి సందర్భంగా కొందరు ద్విచక్ర వాహనాల సైలెన్సర్లు తొలగించి అమలాపురంలో ర్యాలీ చేయగా, నాలుగు వాహనాలను పోలీసులు స్టేషన్‌కు తరలించారు. వాటిని తమ వారికి ఇచ్చేయాలని శ్రీకాంత్ డీఎస్పీ మాధవరెడ్డిని కోరారు. ధ్రువపత్రాలతో రావాలని చెప్పడంతో ఆగ్రహంతో వెళ్లిన శ్రీకాంత్ తండ్రి విశ్వరూప్‌తోపాటు అనుచరులను తీసుకొని స్టేషన్‌కు వచ్చారు. 'మీరు అన్‌నెససరీ చేస్తున్నారు.. చలో అమలాపురానికి పిలుపునివ్వమంటారా? ఇంతకు వందరెట్లు పోలీసులను తెచ్చుకున్నా సరిపోరు' అంటూ విశ్వరూప్ డీఎస్పీపై ఆగ్రహించారు. పోలీసుల అనుమతి లేకుండానే వాహనాలను పట్టుకుపోయారు. అమలాపురం మండలం కామనగరువులో గతేడాది ఆగస్టు 31న శ్రీకాంత్ 'గడప గడపకు' కార్యక్రమం నిర్వహించారు. కోనసీమ జిల్లా పేరు మార్పు విషయంలో తమను అన్యాయంగా కేసుల్లో ఇరికించారని పలువురు యువకులు ఆయన్ను నిలదీశారు. దీంతో ఆ ముగ్గురు యువకులను పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లి రాత్రయినా పంపలేదు. స్థానికుల ఆందోళనతో అర్ధరాత్రి విడిచిపెట్టి కేసులు పెట్టారు. తాను కాబోయే ఎమ్మెల్యేనంటూ శ్రీకాంత్ ప్రచారం చేసుకున్నారు. ఉద్యోగుల నియామకాలు, బదిలీల్లో సైతం జోక్యం చేసుకునే వారనే ఆరోపణలున్నాయి.

చట్టం తన పని తాను చేసుకుపోతుంది

- మాజీ మంత్రి విశ్వరూప్ తనయుడి అరెస్టుపై మంత్రి సుభాష్



రామచంద్రపురం, న్యూస్‌టుడే: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అయినవిల్లికి చెందిన దళిత యువకుడు జనుపల్లి దుర్గాప్రసాద్ హత్య కేసులో చట్టం తన పని తాను చేసుకుపోతుందని మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. ఈ కేసులో మాజీ మంత్రి విశ్వరూప్ తనయుడు శ్రీకాంత్‌ను పోలీసులు అరెస్టు చేయడం వెనుక తన ప్రోద్బలం లేదని స్పష్టం చేశారు. విశ్వరూప్ అసత్య ఆరోపణలు చేస్తున్నారని ఖండించారు. రామచంద్రపురంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'విశ్వరూప్ కుమారుడైన పినిపె శ్రీకాంత్ దుర్గాప్రసాద్ హత్యలో ప్రధాన నిందితుడు. ఆయన హత్య తర్వాత బాధిత కుటుంబానికి శ్రీకాంత్ రూ.లక్ష సాయం చేసి, హతుడి భార్యకు ఎస్సీ కార్పొరేషన్‌లో ఉద్యోగం ఇప్పిస్తామని, రెండు ఎకరాల పొలం ఇస్తామని కేసు పెట్టవద్దని విశ్వరూప్ బాధిత కుటుంబాన్ని బతిమిలాడారు. మృతుడి భార్య ఇద్దరు పిల్లలతో నా వద్దకు వచ్చారు. చట్టపరంగా న్యాయం చేస్తానని చెప్పి.. ఆమెను ఐజీ, డీఐజీల వద్దకు తీసుకెళ్లా. దుర్గాప్రసాద్‌ను ఫోన్ చేసి పిలిచి, చంపేశారని ఆయన భార్య చెబుతున్నారు. విచారణలో పూర్తి వాస్తవాలు తెలుస్తాయి. గత ప్రభుత్వ హయాంలో ఈ కేసును ఎందుకు మూసేశారో చెప్పాలి. కోనసీమ అల్లర్లలో నేను ప్రధాన ముద్దాయినంటూ విశ్వరూప్ ఆరోపణలు చేస్తున్నారు. ఆ కేసును వైకాపా ప్రభుత్వంలోనే కొట్టేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మాట ప్రకారం మేము కక్షపూరిత చర్యలకు పాల్పడటం లేదు. న్యాయపరంగానే ముందుకెళ్తాం' అని వివరించారు.

అప్పట్లో ఈ కేసు దర్యాప్తు సక్రమంగా జరగలేదు: మంత్రి లోకేశ్

'రాష్ట్రంలో హింసను గత ప్రభుత్వం పెంచి పోషించింది. అందుకే ఈ హత్యకేసు దర్యాప్తు సక్రమంగా జరగలేదు. ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మృతుడి కుటుంబసభ్యులు ధైర్యంగా ముందుకొచ్చారు. తమకు న్యాయం చేయాలని ఫిర్యాదు చేశారు. అప్పటి నుంచి కేసు దర్యాప్తు వేగం పుంజుకుంది' అని ఎక్స్ వేదికగా మంత్రి లోకేశ్ వివరించారు.

రాష్ట్రాన్ని ముంచిన వైకాపా సర్కారు

- వారు చేసిన అప్పుపై ఏటా కట్టాల్సిన వడ్డీయే రూ.75 వేల కోట్లు
- కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు రాష్ట్ర మంత్రి సత్యకుమార్ వివరణ



అమిత్ షాతో సమావేశమైన సత్యకుమార్ యాదవ్

ఈనాడు, దిల్లీ: రాష్ట్రాన్ని జగన్ రూ.11 లక్షల కోట్ల అప్పుల్లో ముంచిపోయారని.. ఫలితంగా ప్రస్తుత ప్రభుత్వం వాటిపై వడ్డీల రూపంలోనే ఏటా రూ.75 వేల కోట్లు చెల్లించాల్సిన పరిస్థితి ఉందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు వివరించారు. జగన్ ప్రభుత్వం చేసిన పాపాలను కూటమి ప్రభుత్వం కడగాల్సిన పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. అమిత్ షాతో సోమవారం ఆయన సుమారు 20 నిమిషాలపాటు సమావేశమయ్యారు. మూడు నెలల్లో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వివిధ కార్యక్రమాలు, తాను చేసిన పనులను తెలిపారు. గత ప్రభుత్వం కేంద్రం నిధులను పక్కదారి పట్టించి, యూసీలు కూడా ఇవ్వలేదని చెప్పారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం యూసీలను సకాలంలో కేంద్రానికి పంపుతున్నట్లు వెల్లడించారు. కేంద్ర ప్రాయోజిత పథకాల వినియోగంపై వివరాలు అందజేశారు. ఆయుష్మాన్‌భారత్ అమలు తీరు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పని విధానంపై అమిత్ షా వివరాలు అడిగి తెలుసుకున్నారు.

మచిలీపట్నం వైద్య కళాశాలకు పింగళి వెంకయ్య పేరు

ఈనాడు డిజిటల్, అమరావతి: మచిలీపట్నంలోని నూతన ప్రభుత్వ వైద్య కళాశాలకు జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య పేరును ప్రభుత్వం ఖరారు చేసింది. ఈ మేరకు సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది.

రేపు గుంటూరు, వైఎస్సార్ జిల్లాల్లో జగన్ పర్యటన

ఈనాడు, అమరావతి: వైకాపా అధ్యక్షుడు జగన్ బుధవారం గుంటూరు, వైఎస్సార్ జిల్లాల్లో పర్యటించనున్నారు. ఒక రౌడీషీటర్ కారణంగా ఆస్పత్రి పాలైన స్థితిలో ఉన్న, గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న యువతిని పరామర్శించనున్నారు. తర్వాత వైఎస్సార్ జిల్లా చేరుకుని బద్వేలులో హత్యాచారానికి గురైన బాలిక కుటుంబంతో మాట్లాడతారు. అక్కడి నుంచి పులివెందులకు వెళతారని వైకాపా కేంద్ర కార్యాలయం ప్రకటించింది.

ఆదర్శ పౌరులతో విశ్వగురుగా భారత్



వెంకయ్యనాయుడితో చిగురుపాటి వరప్రసాద్, మంత్రి కొల్లు, ఎమ్మెల్యేలు రామ్మోహన్, యార్లగడ్డ, బోడే, మండలి, గొండు శంకర్, మాజీ ఎంపీ కనకమేడల, వైవీబీ, ఆలపాటి



విద్యార్థినుల నృత్య ప్రదర్శన

కానూరు, న్యూస్‌టుడే: విద్యారంగంలో ఆదర్శవంతమైన విద్యార్థులు, పౌరులను తీర్చిదిద్దడం ద్వారా భారత్‌ను విశ్వగురుగా నిలపవచ్చని మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు అన్నారు. సోమవారం పోరంకిలోని చిగురుపాటి శ్రీకృష్ణవేణి విద్యాసంస్థల 40 ఏళ్ల వేడుకలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడారు. 40 ఏళ్లుగా లక్ష మంది విద్యార్థులకు విద్య అందించడం గొప్ప విషయమన్నారు. ఈ రోజుల్లో సంస్కారం లేని చదువే ఎక్కువగా కనిపిస్తుందన్నారు. క్రమశిక్షణ, అంకితభావం, కష్టపడి పనిచేయడం వంటి మూడు విషయాలతో ఏ రంగంలోనైనా రాణించవచ్చని పేర్కొన్నారు. రాజకీయ నాయకులు ఈ రోజుల్లో ఏ పార్టీలో ఉన్నారో రోజు చూసుకోవాల్సి వస్తుందని చెప్పారు. ప్రజాప్రతినిధుల ప్రసంగాలు, ప్రవర్తన బాధ కలిగిస్తుందన్నారు. బ్రిటీష్ పాలనతో వెనకబడిన మన దేశం ఇప్పుడు పుంజుకుంటుందని వెల్లడించారు. ప్రపంచంలో ఎన్నో బహుళజాతి సంస్థలకు భారతీయులు సీఈవోలుగా ఉన్నారన్నారు. మాతృభాషను అందరు గౌరవించాలని, ఇంగ్లీషుకు తాను వ్యతిరేకం కాదని పేర్కొన్నారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, విశ్రాంత సీజేఐ ఎన్.వెంకటరమణ, ప్రధానమంత్రి నరేంద్రమోదీ అందరు మాతృభాషలోనే చదివి ఉన్నతస్థాయికి చేరుకున్నారన్నారు. జంక్ ఫుడ్‌లతో చిన్నారులు, విద్యార్థులకు ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయన్నారు. నేనే పదవీ విరమణ చేశాను కానీ పెదవీ విరమణ చేయలేదన్నారు. అన్ని ప్రాంతాలను సందర్శించి యువతలో స్ఫూర్తి నింపడమే తన ధ్యేయమని తెలిపారు. శ్రీకృష్ణవేణి విద్యాసంస్థల ఛైర్మన్ చిగురుపాటి వరప్రసాద్ మాట్లాడుతూ.. సాధారణ కుటుంబం నుంచి వచ్చిన తాను కష్టపడి చదివి ఈ రోజులు ఈస్థాయిలో లక్షమందికి విద్యను అందించే స్థాయికి వచ్చామన్నారు. అనంతరం చిగురుపాటి వరప్రసాద్ కుటుంబసభ్యులు, పాఠశాల అధ్యాపకులు, ప్రజాప్రతినిధులు మాజీ ఉప రాష్ట్రపతిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపీ కనకమేడల రవీంద్రకుమార్, ఎమ్మెల్యేలు బోడే ప్రసాద్, గద్దె రామ్మోహన్, మండలి బుద్ధ ప్రసాద్, గొండు శంకర్, కామినేని శ్రీనివాస్, మాజీ ఎంపీ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ వైవీబీ రాజేంద్రప్రసాద్, పాఠశాల ప్రతినిధులు, నగరానికి చెందిన పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

కదంతొక్కిన సీహెచ్‌వోలు



ప్లకార్డులతో నిరసన

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే: ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్స్ (విలేజ్ హెల్త్ క్లినిక్స్)లో వైద్య సేవలు అందిస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ (సీహెచ్‌వో)లు తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం విజయవాడలో పెద్ద ఎత్తున ధర్నా చేశారు. రాష్ట్రవ్యాప్తంగా పని చేస్తున్న వారందరూ భారీగా తరలివచ్చారు. దీర్ఘకాలికంగా ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని నినదించారు. నేషనల్ హెల్త్ మిషన్‌లో పని చేస్తున్న తమకు గత వైకాపా ప్రభుత్వం వేతనాలు పెంచలేదని ధ్వజమెత్తారు. వీరికి ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు సంఘీభావం తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. సీహెచ్‌వోలకు మినిమం టైమ్‌స్కేల్, కేంద్ర ప్రభుత్వ నిబంధనల మేరకు హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఎ.వి.నాగేశ్వరరావు మాట్లాడుతూ.. పది నెలల బకాయిలు, హెల్త్ క్లినిక్స్ అద్దెలు, విద్యుత్తు బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇతర రాష్ట్రాల్లో మాదిరిగా సీహెచ్‌వో, ఎన్‌హెచ్‌వో ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని కోరారు. నేషనల్ హెల్త్ మిషన్ ఐకాస రాష్ట్ర అధ్యక్షురాలు దయామణి మాట్లాడుతూ.. గత ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరించిందని, కూటమి ప్రభుత్వం సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్ సీహెచ్‌వోస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు ప్రియాంక, ఉపాధ్యక్షుడు పులి ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ.. మ్యాట్రిక్స్ విధానాన్ని రద్దు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర నాయకులు మధు, సుధాకర్, ప్రమోద్, దుర్గాభవానీ, సిద్దయ్య, నీలిమ, రాజేశ్వరి, వర్మ, అహ్మద్ బాషా, సుజాత తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బందిని పంచాయతీకి అనుసంధానం చేయండి



ఇన్‌ఛార్జి కలెక్టర్ నిధిమీనాకు వినతి పత్రం అందజేస్తున్న వసంత్‌కుమార్ తదితరులు

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే: గ్రామ పంచాయతీకి ఒక సచివాలయం ఏర్పాటు చేసి, సచివాలయ సిబ్బందిని పంచాయతీకి అనుసంధానం చేయాలని ఉమ్మడి కృష్ణా జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు గోలి వసంత్‌కుమార్ కలెక్టరేట్‌లో ఇన్‌ఛార్జి కలెక్టర్ నిధిమీనాను సోమవారం కలిసి వినతి పత్రం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ప్రతి సచివాలయంలో 11 మంది ఉద్యోగులను నియమించారని, వారిపై సరైన పర్యవేక్షణ లేకుండా పోయిందని అన్నారు. చాలా పంచాయతీల్లో రెండు నుంచి ఐదు సచివాలయాలు ఏర్పాటు చేశారని, అవసరానికి మించి ఉద్యోగులు ఉన్నందున వారికి పూర్తి స్థాయిలో పని లేకుండా పోయిందన్నారు. వేతనాలు ఇచ్చేది ఒకరు, పని చేయాలని ఆదేశించేది ఇంకొకరు, హాజరు చూసేది మరొకరు, పనితీరు విశ్లేషించేది వేరొకరు కావడం వల్ల ఎవరి ఆదేశాలు పాటించాలో తెలియని స్థితిలో ఉద్యోగులు ఉన్నారని తెలిపారు. ఈ వ్యవస్థను చట్ట వ్యతిరేకంగా రూపకల్పన చేశారని ఆరోపించారు. పరిష్కారంగా పంచాయతీకి ఒక సచివాలయాన్ని ఏర్పాటు చేసి ఆ సచివాలయంలో సిబ్బందిని పంచాయతీ ఆధీనంలోకి తీసుకురావాలని మూడేళ్ల నుంచి తాము అనేక ఉద్యమాలు చేశామని గుర్తు చేశారు. సర్పంచులు పంచకర్ల సురేష్, మన్నే సాత్విక, కొప్పుల సీతారామయ్య, కసుకుర్తి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రక్తమోడిన దారులు

వేర్వేరు ప్రమాదాల్లో అయిదుగురి దుర్మరణం

ఉమ్మడి కృష్ణా జిల్లాలో రోడ్లు రక్తసిక్తమయ్యాయి. వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన రహదారి ప్రమాదాల్లో అయిదుగురు వ్యక్తులు దుర్మరణం చెందారు. వాహనాల మితిమీరిన వేగం.. అమాయకుల ప్రాణాలను బలిగొంది. బాధిత కుటుంబాల్లో తీవ్ర విషాదఛాయలు అలముకున్నాయి.

పాయకాపురం (మధురానగర్), న్యూస్‌టుడే: విజయవాడ గ్రామీణ మండలం నున్న సమీపంలో సోమవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వాహనం ఢీకొని ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. వీరిద్దరి ఇంటి పేర్లు ఒకటే కావడంతో.. బంధువులు అయి ఉంటారని స్థానికులు భావించారు. కానీ.. ఒకరితో ఒకరికి సంబంధమే లేదు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. అజిత్‌సింగ్‌నగర్ గంగానమ్మగుడి సెంటరుకు



ఘటనా స్థలంలో సాంబశివరావు, దుర్గారావు మృతదేహాలు. పక్కనే ధ్వంసమైన ద్విచక్రవాహనం

చెందిన సుంకర సాంబశివరావు (53) వంట మేస్త్రీగా పని చేస్తున్నారు. ఎక్కడైనా వంట పని ఉంటే ఆటోలో వెళుతుంటారు. సోమవారం ఉదయం గన్నవరం మండలం పాలెం అడ్డరోడ్డులోని శివాలయంలో అన్నదాన కార్యక్రమం ఉండటంతో బయలుదేరారు. ఉదయం 5.30 గంటల వేళ.. ఆటోలు ఏమీ లేవు. ఈ క్రమంలో ఆగిరిపల్లిలోని గెయిల్ కంపెనీలో డ్యూటీకి వెళుతున్న విశ్రాంత సైనికోద్యోగి సుంకర దుర్గారావు (43) కనిపించగా.. లిఫ్ట్ అడిగి ద్విచక్రవాహనం ఎక్కారు. నున్న శివారు వద్దకు రాగానే అతివేగంగా వచ్చిన గుర్తు తెలియని వ్యాను వారిని ఢీకొంది. ఇద్దరూ గాలిలో ఎగిరి రోడ్డు పక్కన పడిపోయారు. తలకు బలమైన గాయాలు తగలడంతో అక్కడికక్కడే మృతి చెందారు. ప్రమాదానికి కారణమైన వాహనం అద్దం, దిష్టికి కట్టే దండ ఘటనాస్థలంలో పడ్డాయి. దీన్ని బట్టి.. అది మినీ ట్రాన్స్‌పోర్ట్ వాహనం అయి ఉండడొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. దానిపై ఆరా తీస్తున్నారు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



సుంకర దుర్గారావు గుర్తింపు కార్డు

రోడ్డుదాటుతూ వాచ్‌మెన్...

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందిన సంఘటన గన్నవరం మండలం కేసరపల్లి వద్ద చెన్నై-కోల్‌కతా జాతీయ రహదారిపై సోమవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని బుద్ధవరానికి చెందిన మరీదు కృష్ణ (55) కేసరపల్లిలోని ఓ అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. యథావిధిగా విధులకు వచ్చిన కృష్ణ.. తెల్లవారుజామున పని మీద హైవే దాటుతుండగా అతివేగంగా వచ్చిన వ్యాను అతడి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఘటన జరిగిన కొంత సమయం అనంతరం అదే ప్రాంతంలో ఓ లారీ యూటర్న్ తీసుకుంటుండగా వెనుక నుంచి అతివేగంగా వచ్చిన బొలేరో వాహనం లారీని ఢీకొంది. ప్రమాదంలో బొలేరో వ్యాను డ్రైవర్‌కు స్వల్ప గాయాలవ్వగా విజయవాడ ఆసుపత్రికి తరలించారు.

కుమారుడిని బస్టేషన్‌కు తీసుకెళుతూ..

సూర్యారావుపేట, న్యూస్‌టుడే: కుమారుడిని హైదరాబాద్‌కు పంపేందుకు వెళుతున్న తండ్రిని కారు ఢీకొట్టడంతో.. ప్రాణాలు కోల్పోయిన ఘటన నగరంలో చోటుచేసుకుంది. సూర్యారావుపేట పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మాచవరం పోలీస్‌స్టేషన్ సమీపంలోని శీలం దేవకరరావు (55) నివసిస్తున్నారు. ఈయనకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కుమారుడు హైదరాబాద్‌లో చదువుతున్నాడు. ఆదివారం అర్ధరాత్రి రెండు గంటల సమయంలో అతడిని బస్‌స్టేషన్‌లో దింపేందుకు తండ్రి బయలుదేరారు. ఇద్దరూ రెండు వేర్వేరు బైక్‌లను బుక్ చేసుకున్నారు. చెరో బండి మీద వెళుతున్నారు. రీజినల్ ఇంటెలిజెన్స్ కార్యాలయం వద్దకు రాగానే.. సీపీ కార్యాలయం వైపు నుంచి అతివేగంగా వచ్చిన కారు తండ్రిని ఢీకొంది. ద్విచక్ర వాహనం నడుపుతున్న షేక్ కరీముల్లాతో పాటు దేవకరరావులు తీవ్రంగా గాయపడ్డారు. దేవకరరావును ప్రైవేటు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందారు. దీనిపై సూర్యారావుపేట పోలీసులు సోమవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లారీ ఢీకొని మెకానిక్..

చిట్టినగర్, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో మెకానిక్ మృతి చెందిన ఘటన పట్టణంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... షేక్ ఆఫ్తాబ్(23) వైఎస్ఆర్ కాలనీలో ఉంటున్నారు. ఈ నెల 20వ తేదీన రాజీవ్ నగర్‌లోని తన స్నేహితుడి వద్దకు వెళ్లి తిరిగి ద్విచక్ర వాహనంపై రాత్రి 11 గంటలకు ఇంటికి వస్తున్నారు. పైపుల రోడ్డు నుంచి వస్తుండగా వైవీ రావు రింగ్ సమీపంలోని వెల్‌కమ్ హోటల్ వద్ద వెనుక నుంచి లారీ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న కొత్తపేట పోలీసులు ఘటనా ప్రాంతానికి చేరుకుని శవపంచనామా నిర్వహించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

టాలీ కోర్సులో ఉచిత శిక్షణ

పటమట, కరెన్సీనగర్, భాస్కరపురం(మచిలీపట్నం): ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కానూరులోని ఫెడరల్ స్కిల్ అకాడమీ ట్రైనింగ్ సెంటర్లో టాలీ కోర్సులో సర్టిఫికెట్‌తో కూడిన ఉచిత శిక్షణ అందిస్తున్నామని, అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని జిల్లా అధికారి శ్రీనివాసరావు, జిల్లా ఉపాధి కల్పన అధికారి డి.విక్టర్ బాబు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. బీకాం, బీఏ, బీబీఏ, ఎమ్‌కామ్ పూర్తి చేసి ఉండాలని, 18 నుంచి 30 ఏళ్ల వయోపరిమితి ఉన్న వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని చెప్పారు. ఈ నెల 28 నుంచి శిక్షణ తరగతులు ప్రారంభం కానున్నాయని వెల్లడించారు. శిక్షణ అనంతరం ప్రైవేటు రంగ సంస్థలో ఉద్యోగావకాశాలు కల్పిస్తామని తెలిపారు. ఉమ్మడి కృష్ణా జిల్లాలో గల ఆసక్తి గల అభ్యర్థులు కానూరు తులసీనగర్‌లోని ఫెడరల్ స్కిల్ అకాడమీ ట్రైనింగ్ సెంటర్లో వివరాలు నమోదు చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు 87146 92748, 87146 92749 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.